  

మార్క్స్
ఎంగెల్స్
లెనిన్‌ల
తాత్విక రచనలు

# భౌతిక వాదం
# భావ వాదం

335.412
393

SCANNED
09/01/2020

# భౌతిక వాదం
# భావ వాదం

మార్క్స్

ఏంగెల్స్

లెనిన్

తాత్విక రచనలు

ప్రచురణ :

ప్రజాశక్తి బుక్ హౌస్

*1-1-298/4, స్ట్రీట్ నెం 1, అశోక్‌నగర్,*

*హైదరాబాద్-20, ఫోన్ . 7665420*

***English Title :*** Reader in Marxist Philosophy
***Editor's :*** Howard Selsam, Harry Martel.

ప్రచురణ సంఖ్య : 629

ప్రచురణ కాలం : మార్చి 2001

ప్రతులు : 2,000

వెల : 12-00

C/5028

A.C. No. 392

తెలుగు : ఎ. గాంధీ

ముద్రణ : ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్, హైదరాబాద్

ప్రతులకు **ప్రజాశక్తి బుక్‌హౌస్**

| | | |
|---|---|---|
| కారల్‌మార్క్స్ రోడ్ విజయవాడ - 520 002 ఫోన్ : 432792 | 1-8-52/2 శ్రీరామా కాంప్లెక్స్, చిక్కడపల్లి హైదరాబాద్ -20 ఫోన్ : 7608107 | షాప్ నెం.47, ఆర్టీసి షాపింగ్ కాంప్లెక్స్, ద్వారకానగర్, విశాఖపట్నం - 2 |

| | | | |
|---|---|---|---|
| సుందరయ్య భవన్, బాలాజీనగర్, ఖమ్మం - 507 001 | 5, ఎ.జి.కె.కాంప్లెక్స్, గాంధీరోడ్, తిరుపతి - 517 501 | 6-2-250 విజయటాకీస్ రోడ్, చౌరస్తా హన్మకొండ-506 001 | సుందరయ్య భవన్ సుభాష్ విగ్రహం (ఎదుట) నల్గొండ |

# మామాట

మార్క్సిస్టు తత్వశాస్త్ర మూలసూత్రాలను ఆ సిద్ధాంతకర్తల రచనల నుంచే అందించే సిరీస్ ఇది. హావార్డ్‌సెల్సం, హారీ మార్టెల్‌ల సంపాదకత్వంలోవెలువడిన "రీడర్ ఇన్ మార్క్సిస్ట్ ఫిలాసఫీ" అనే పుస్తకాన్ని కొన్ని భాగాలుగా ముద్రించాలని ప్రజాశక్తి బుక్‌హౌస్ నిర్ణయించింది. అందులో ఇది రెండవది. ఇవి వేటికవి సమగ్రంగానే వుంటాయి. సోవియట్ విచ్ఛిన్నం,సోషలిస్టు శిబిరానికి ఎదురుదెబ్బ తర్వాత మరింత ప్రాధాన్యత సంతరించుకున్న సిద్ధాంత అధ్యయనానికి ఈ ప్రచురణ దోహద పడగలదని మా విశ్వాసం.పై గ్రంథం న్యూయార్క్ ఇంటర్నేషనల్ పబ్లిషర్స్ ప్రచురణగా 1963లో తొలిసారి వెలువడింది. 1987లో వచ్చిన 12వ ముద్రణకు అనువాదమిది.

సెల్సం, మార్టెల్‌లు ప్రముఖ మేధావులు. సెల్సం మార్క్సిస్టు తత్వశాస్త్రానికి సంబంధించి "వాట్ ఈజ్ ఫిలాసఫీ", "ఫిలాసఫీ ఇన్ రెవల్యూషన్", "సోషలిజం అండ్ ఎథిక్స్", "హ్యాండ్ బుక్ ఆఫ్ ఫిలాసఫీ" అనే పుస్తకాలు వెలువరించారు. ఆ విధంగా తత్వశాస్త్ర విషయాలలో ప్రామాణిక రచయితల్లో ఒకరుగా ఆయన పేరుపొందారు.

మార్క్స్, ఎంగెల్సు, లెనిన్‌ల రచనలలోని భాగాలనే తాము పొందుపరిచినట్లు సెల్సం ఇంగ్లీషు పుస్తకం ముందుమాటలో రాశారు.స్టాలిన్ ముఖ్యంగా గతితార్కిక భౌతిక వాదానికి సంబంధించి చాలా విలువైన రచనలే చేశారని పేర్కొన్నారు. అలాగే మావో, గ్రామ్‌స్కీ, రోజాలగ్జెంబర్గ్ వంటివారు కూడా ప్రతిభావంతమైన స్వకీయ సూత్రీకరణలు చేసినప్పటికి తాము ఆ అంశాలను గ్రంథంలో పొందుపరచలేకపోయామని వివరించారు. మార్క్సిస్టు సూత్రాలు తెలుసుకోకుండా ప్రపంచాన్ని అర్థం చేసుకోగలగడం అసాధ్యమని స్పష్టపరిచారు. ఆ స్ఫూర్తితోనే వెలువడుతున్న ఈ ప్రచురణ తెలుగు పాఠకుల ఆదరణకు పాత్రమౌతుందని ఆశిస్తున్నాం. ఈ పుస్తకాలు తెలుగు చేస్తున్న ఎ.గాంధీ కాలమిస్టుగా, పలు సిద్ధాంత గ్రంథాల అనువాదకులు కూడా.

**ప్రజాశక్తి బుక్ హౌస్.**

# విషయ సూచిక


(1) తత్వశాస్త్రంలో రెండు మౌలిక వాదాలు 1

(2) ఫ్రాన్స్, ఇంగ్లండ్‌లలో ఆధునిక భౌతికవాద అభివృద్ధి 8

(3) ఆధునిక వర్గపోరాటాలతో అజ్ఞేయవాదానికీ, భౌతికవాదానికీ,
మతానికీ ఉన్న సంబంధం 17

(4) రివిజనిస్టులకు వ్యతిరేకంగా మార్క్సిస్టు భౌతికవాదం 21

(5) బర్కిలీ మొదలుకుని మాకియన్ల వరకూ
భౌతికవాదాన్ని తప్పుబట్టేవారే 23

(6) భౌతికవాదం, భావవాదం పరస్పర విరుద్ధం:
తటస్థ వైఖరీ, రాజీ ధోరణీ అసాధ్యం 38

(7) కొత్త భౌతికశాస్త్రం భౌతికవాదాన్ని తప్పు
అని రుజువు చేస్తోందా 45

# 1

## తత్వ శాస్త్రంలో రెండు మౌలిక వాదాలు

'ఆలోచనకీ, అస్తిత్వానికీ ఉన్న సంబంధమే తత్వ శాస్త్రానికి అంతటికీ గొప్ప మౌలిక ప్రశ్న. ఆధునిక తత్వ శాస్త్రానికి ఇది మరింతగా వర్తిస్తుంది ఆలోచన ఇంద్రియ అనుభూతులు తమ శరీర కార్య కలాపాలు కావని మనుషులు అనాదిగా నమ్ముతూ వచ్చారు తమ దేహంలోనే ఉంటూ మరణం తర్వాత దేహాన్ని విడిచిపెట్టే ఆత్మ కార్య కలాపాలుగా వాటిని వారు భావించారు. శరీర నిర్మాణం గురించి బొత్తిగా తెలియని కాలంలో, స్వప్న భూతాల ప్రేరణతో వారు ఈ నిర్ధారణకు వచ్చారు. ఆనాటి నుంచీ వారు ఆత్మకు, బాహ్య ప్రపంచానికి ఉన్న సంబంధాన్ని గురించి ఆలోచిస్తూనే ఉన్నారు.

క్రైస్తవ మధ్య యుగాల సుదీర్ఘ సుషుప్తి నుండి యూరప్ సమాజం మేలుకున్న తర్వాతనే మొట్టమొదటిసారిగా ఈ ప్రశ్న దాని మొత్తం తీవ్రతతో ముందుకు వచ్చింది అప్పుడే అది పూర్తి ప్రాధాన్యాన్ని సంతరించుకుంది ఆలోచనకూ, అస్తిత్వానికి ఉన్న సంబంధం ఏమిటి ఆ సంబంధంలో ఆలోచనకు ఉన్న స్థానం ఏమిటి అన్నదే ప్రశ్న మధ్య యుగాల నాటి పండిత వాదంలో కూడా అదే ప్రశ్న గొప్ప పాత్ర నిర్వహించింది ఆత్మ, ప్రకృతి అన్న ఈ రెంటిలో ఏది ప్రథమం అన్నదే ఈ ప్రశ్న అదే ప్రశ్న చర్చకు సంబంధించినంత వరకూ ఇలా పదునెక్కింది ప్రపంచాన్ని దేవుడు సృష్టించాడా లేదా ప్రపంచం నిరంతరాయంగా ఉంటూ వచ్చిందా ?'

ఈ ప్రశ్నకు ఇచ్చిన సమాధానాన్ని బట్టి తాత్వికులు రెండు మహా శిబిరాలుగా చీలారు ప్రకృతి కంటే ఆత్మ ప్రాథమికం అన్న వారు అంతిమంగా ప్రపంచ సృష్టిని ఏదో ఒక రూపంలో నమ్మారు (క్రైస్తవ మతంలో కంటే హెగెల్ లాంటి తాత్వికుల

విషయంలో తరచుగా ఈ సృష్టి అన్నది మరింత సంక్లిష్టంగానూ దాదాపు అసాధ్యంగానూ కనిపిస్తుంది.) వారు ·భావవాదులు. మిగతా వారు ప్రకృతి ప్రథమం అన్నారు వీరు వివిధ భౌతికవాద ధోరణులలో దేనికో ఒకదానికి చెంది ఉంటారు

ఈ రెండు వ్యక్తీకరణలూ భౌతిక వాదమూ భావ వాదమూ కూడా ప్రాథమికంగా ఇంతకు మించి వివరించవు ఇక్కడ కూడా మరే ఇతర అర్థంలోనూ వాటిని నేను ప్రయోగించలేదు. వీటికి ఈ అర్థంలో గాక వేరే అర్థం ఆపాదించినప్పుడు ఎటువంటి గందరగోళం తలెత్తుతుందో తర్వాత పేజీల్లో చూద్దాం.

ఆలోచనకీ అస్తిత్వానికీ ఉన్న సంబంధం అన్న ఈ ప్రశ్నకు మరో పార్శ్వం ఉంది మన చుట్టూ ఉన్నప్రపంచం గురించిన మన ఆలోచనలు ఈ ప్రపంచంతో ఎటువంటి సంబంధాన్ని కలిగిఉంటాయి ? వాస్తవ ప్రపంచాన్ని మన ఆలోచన గుర్తించగలదా ? వాస్తవ ప్రపంచాన్ని గురించిన మన భావాలూ అభిప్రాయాలూ వాస్తవాన్ని సరిగానే ప్రతిబింబించగలవా ? తాత్విక భాషలో ఈ ప్రశ్నను ఆలోచనా అస్తిత్వాల సారూప్యతా ప్రశ్న అంటారు. తాత్వికులలో అత్యధికులు దీనికి సానుకూలంగా సమాధానం చెబుతారు. ఉదాహరణకు హెగెల్ విషయంలో ఈ సానుకూలత స్వయం విదితం. వాస్తవ ప్రపంచంలో మనం గ్రహించే దాన్ని ఒక పరమ భావపు ఆలోచనా సారం అంటాడాయన. అనాదిగా, ప్రపంచంతో ప్రమేయం లేకుండా ప్రపంచానికి పూర్వం ఎక్కడో ఉంటుంది ఈ పరమ భావం. ఈ ఆలోచనా సారం, ప్రపంచం క్రమంగా పరమ భావాన్ని వాస్తవీకరించేలా తోడ్పడుతుంది అని ఆయన అంటాడు. దీనికి ఇంత రాద్ధాంతం అవసరం లేదు. ఆలోచన అన్నది ఒక సారాంశాన్ని తెలుసుకోగలదని అదే ఆలోచనా సారం అని వ్యక్తమౌతుంది ఇక్కడ ముందుగా ఊహించిన అంశంలోనే నిరూపించాల్సిన అంశం ఇమిడి ఉంది అన్నది కూడా స్పష్టంగా కనిపిస్తుంది అయినా ఆలోచనా అస్తిత్వాల సారూప్యత అనే తన సిద్ధాంత నిరూపణ నుంచి మరిన్ని నిర్ధారణలు స్వీకరించకుండా హెగెల్‌ను అది ఏ విధంగానూ నిరోధించదు ఎందుకంటే తన ఆలోచన మేరకు అది సరైందే కనుక అదే సరైంది కనుక అస్తిత్వ ఆలోచనల సారూప్యత అనే తన సిద్ధాంతాన్ని తక్షణమే మానవ జాతి రుజువు చేయాల్సి ఉంది, మరి తన తాత్వికతను సిద్ధాంత స్థాయి నుంచి ఆచరణ స్థాయికి మార్చాలి హెగెలియన్ సూత్రాల ప్రకారమే మొత్తం ప్రపంచాన్ని మార్చాల్సి ఉంది మరి. ఇది భ్రమ తాత్వికులు అందరి లాగానే హెగెల్ కూడా ఈ భ్రమకు లోనయ్యాడు

వీరు గాక మరో రకం తాత్వికులు ఉన్నారు. ప్రపంచాన్ని గ్రహించడం (లేదా సంపూర్ణగ్రాహ్యాన్ని) అసాధ్యం అనేవారు ఉన్నారు ఆధునికుల్లో హ్యూమ్, కాంట్ కూడా అటువంటివారిలో ఉన్నారు వారు తత్వ శాస్త్ర అభివృద్ధిలో ఎంతో ప్రధాన పాత్ర

నిర్వహించారు. భావ వాద దృక్పథం నుంచి సాధ్యమైన మేరకు ఈ ధోరణిని హెగెలే నిర్ణయాత్మకంగా తిరస్కరించాడు. భౌతిక వాద దృక్పథం నుంచి ఫ్యూయర్ బా తిరస్కరించాడు. అయితే ఆయన వాదం పరిపుష్టం అనడం కంటే మరింత వివేకవంతం. అన్నిటికంటే ఆచరణ, అనగా ప్రయోగం, పరిశ్రమ అనేవి, ఈ తాత్విక కల్పనల వాదాన్ని ప్రతిభావంతంగా తిరస్కరిస్తాయి. ఒక ప్రకృతి క్రమాన్ని మనమే సుసాధ్యం చేయడం ద్వారా దాని పరిస్థితుల నుంచి దాన్ని అస్తిత్వంలోకి తేవడం ద్వారా మన లక్ష్యాలకు అనుగుణంగా దాన్ని ఉపయోగించడం ద్వారా ప్రకృతి ప్రక్రియల గురించిన మన భావనలు సరైనవేనని రుజువు చేయగలిగితే "స్వయంభూ వస్తువు" అనే దుర్గ్రాహ్యమైన కాంట్ వాదం అంతమైపోతుంది. సేంద్రియ రసాయన శాస్త్రం మొక్కల్లోనూ జంతువుల్లోనూ ఉండే రసాయనిక పదార్థాల్ని ఒకదాని తర్వాత ఒకటి ఉత్పత్తి చేయడం ప్రారంభించేటంత వరకూ ఈ పదార్థాలు స్వయంభూ వస్తువులుగానే ఉండిపోయాయి. ఇప్పుడు 'తనలో తాను ఒక వస్తువు' అన్నది మన కోసం వస్తువుగా మారింది. ఉదాహరణకు రంగులు వేయడానికి ఉపయోగించే అలిజారిన్ అనే పదార్థాన్ని పొలాల్లో ఒక రకమైన దుంపల నుంచి తీసేవారు. ఇప్పుడు అదే పదార్థాన్ని మరింత చౌకగా సులభంగా బొగ్గు తారు నుంచి గ్రహిస్తున్నాం.... సైద్ధాంతికంగానూ, ఆచరణాత్మకంగానూ కాంట్ వాదాన్ని హ్యూమ్ వాదాన్ని ఎన్నడో తిరస్కరించడం జరిగింది. అయినా జర్మనీలో నయా కాంట్ వాదులు కాంట్ వాదానికీ హ్యూమ్ అనుయాయులు అజ్ఞేయ వాదానికీ మళ్లీ ప్రాణం పోయాలని ఇంగ్లండ్‌లో తంటాలు పడుతున్నారు. (నిజానికి ఇంగ్లండ్‌లో అది ఎన్నడూ పూర్తిగా అంతమైపోలేదు.). శాస్త్రీయంగా చూస్తే ఇవి తిరోగమన వాదాలు. ఆచరణాత్మకంగా చూస్తే బహిరంగంగా భౌతికవాదాన్ని తిరస్కరిస్తూనే చాటుమాటుగా, సిగ్గుమాలిన విధంగా ఇవి భౌతికవాదాన్ని స్వీకరిస్తున్నాయి.

డెస్కార్టెస్ నుండి హెగెల్ వరకూ హాబ్స్ నుంచి ఫ్యూయర్ బా వరకూ ఉన్న సుదీర్ఘకాలంలో తాత్వికులు తమకు తాము భావించుకున్నట్టు కేవలం పరిశుద్ధమైన హేతువుతోనే ప్రేరితులు కాలేరు. సరిగా అందుకు జరిగింది విరుద్ధం. ప్రకృతి శాస్త్రంలోనూ పరిశ్రమలోనూ శక్తివంతమైన, అంతకంతగా శీఘ్రమైన ప్రగతి మాత్రమే వారిని ముందుకు నెట్టింది. భౌతిక వాదుల విషయంలో ఇది పైకి స్పష్టంగా కనిపించే వ్యవహారమే. భావ వాద వ్యవస్థలు సైతం భౌతిక వాద సారాంశంతో నిండిపోయాయి. మస్తిష్కానికి పదార్థానికి మధ్య ఉన్న వైరుధ్యానికి వారు PANTHEISTICAL గా రాజీ కుదర్చడానికి ప్రయత్నించారు. హెగెల్ వ్యవస్థ చివరికి పద్ధతిలోనూ సారాంశంలోనూ భౌతిక వాదాన్ని భావవాద పరంగా తలకిందులు చేసింది. హెగెల్‌వాది ఫ్యూయర్‌బాక్ భౌతికవాదిగా పరిణామం చెందాడు. నిజానికి ఎప్పుడూ ఆయన పూర్తిగా సంప్రదాయక

హెగెల్‌వాది కాదనుకోండి. ఈ పరిణామం ఒకానొక దశలో హెగెల్ భావవాద వ్యవస్థతో తెగతెంపులు చేసుకొనేలా చేసింది. హెగెల్‌వాదం ప్రకారం ఈ లోకానికి ముందే ఒక 'సంపూర్ణ భావమూ', 'తార్కిక విషయాలూ' ఉండినాయి. లోకాతీత సృష్టికర్త ఒకరున్నారనే విశ్వాసపు వింత అవశేషమే తప్ప ఇది మరొకటి కాదు. భౌతికమూ ఇంద్రియ గోచరమూ అయిన మన ఈ ప్రపంచమే ఏకైక వాస్తవం. మన చైతన్యమూ ఆలోచనా ఇంద్రియాతీతమని ఎంతగా అనిపించినప్పటికీ అవి భౌతికమూ శారీరక అంగమూ అయిన మెదడు నుంచి పుట్టినవి మాత్రమే. పదార్థం మనసు నుండి పుట్టలేదు. మనసే పదార్థం నుండి పుట్టిన అత్యున్నత ఉత్పాదితం. ఈనిర్ధారణలకు అణచ వీలులేని శక్తితో చేరుకోక ఫ్యూయర్‌బాకి తప్పలేదు. అయితే ఇది విశుద్ధ భౌతికవాదం. ఇంతదూరం వచ్చాక ఫ్యూయర్‌బా ఇక్కడ ఆగిపోయాడు. సంప్రదాయకంగా వస్తున్న దురభిప్రాయాన్ని ఆయన అధిగమించ లేకపోయాడు. విషయంతో కాక భౌతికవాదం అన్న పేరుతో ఆయన విభేదించాడు. 'నా దృష్టిలో మానవ సారమూ జ్ఞానమూ అనబడే భవంతికి పునాది భౌతికవాదమే. అయితే సంకుచిత అర్థంలో ఒక శారీరక శాస్త్రవేత్త లేదా మోల్‌స్కాట్ లాంటి ఒక ప్రకృతి శాస్త్రవేత్త దృష్టి కాదు. సహజంగానే వారి దృష్టికోణమూ వారి వృత్తీ ఆ భవంతీ అన్నిటితోనూ విభేదిస్తాను. వెనుక దిశలో నేను భౌతికవాదులతో అంగీకరిస్తాను. ముందు దిశలో మాత్రం కాదు'.

భౌతికవాదం ఒక ప్రపంచ దృక్పథం. పదార్థానికీ మనసుకీ నడుమ ఉన్న సంబంధం గురించిన నిర్దిష్ట భావనపై అది ఆధారపడి ఉంటుంది. ఒకానొక నిర్దిష్ట దశలో, పద్దెనిమిదో శతాబ్దంలో ఈ దృక్పథం ఒక ప్రత్యేక రూపంలో వ్యక్తమైంది. భౌతికవాదాన్ని ఫ్యూయర్‌బా ఈ ప్రత్యేక రూపంతో గందరగోళ పర్చాడు. అంతేకాదు. యాభయిలలో బూక్నర్, వోగ్ట్, మోలెస్కాట్‌లు తమ పర్యటనలలో ప్రచారం చేసిన రూపంలోనే, పద్దెనిమిదో శతాబ్దపు పసలేని, భ్రష్ట రూపంలోనే భౌతికవాదం ప్రకృతిశాస్త్రవేత్తల, భౌతికశాస్త్రవేత్తల బుర్రలను పట్టుకొంది. ఆయన భౌతికవాదాన్ని ఈ భ్రష్ట రూపంతో గందరగోళపర్చాడు. భావవాదం వరుసగా అనేక అభివృద్ధి దశలను గడిచినట్టే భౌతికవాదమూ గడిచింది. ప్రకృతిశాస్త్రంలో సైతం యుగావిష్కరణలు సంభవించినప్పుడల్లా అది తన రూపం మార్చుకోవలసి వచ్చింది. ఇక చరిత్రను సైతం భౌతిక దృక్పథంతో పరిశీలించడం ప్రారంభం అయ్యాక దానికి మరో కొత్త అభివృద్ధి అవకాశం లభించింది.

గత శతాబ్దపు భౌతికవాదం అత్యధికం యాంత్రికం. ఎందుకంటే ఆనాటి ప్రకృతిశాస్త్రాలన్నిటిలోనూ యాంత్రిక శాస్త్రానికే ప్రాబల్యం ఉంది. అంతరిక్షంలోనూ

భూగోళంలోనూ కూడా ఘన పదార్థాల అధ్యయనానికే అగ్రస్థానం. క్లుప్తంగా చెప్పాలంటే గురుత్వాకర్షణకి సంబంధించిన యాంత్రికవాదమే ప్రగతి సాధించింది. రసాయన శాస్త్రం ఇంకా అప్పటికి శైశవావస్థ దాటలేదు. జీవ శాస్త్రం ఇంకా పొత్తిళ్లలోనే ఉంది. మొక్కలలోనూ జంతువుల్లోనూ అంగ నిర్మాణం కేవలం స్థూలంగానే పరిశీలించ బడింది. పైగా అది కేవలం యాంత్రిక కారణాల ద్వారానే వివరించ బడింది. డెస్కార్టెస్ జంతువు పరిగణించినట్టే పద్ధెనిమిదో శతాబ్దపు భౌతికవాదులు మనిషిని ఒక యంత్రంగా పరిగణించారు. రసాయనిక, సేంద్రియ స్వభావం కలిగిన ప్రక్రియలకు వారు కేవలం యాంత్రిక ప్రమాణాలను వర్తింప జేశారు. ఈ ప్రక్రియలలో యాంత్రిక నియమాలు కూడా వర్తిస్తాయి, నిజమే. కాని అంతకంటే ఉన్నతమైన ఇతర నియమాలు వీటిని వెనకకు నెడుతాయి. సంప్రదాయ ఫ్రెంచి భౌతికవాదానికి ఇది ఆనాటి ఒక ప్రత్యేక అనివార్య పరిమితి.

ఈ భౌతికవాదం విశ్వాన్ని ఒక ప్రక్రియగా గ్రహించ లేదు. అంటే ఒక చారిత్రిక క్రమంలో పరిణమిస్తున్న పదార్థంగా దానిని గ్రహించ లేక పోయింది. ఇది దాని రెండో ప్రత్యేక పరిమితి. ఆవేళ్టి ప్రకృతి శాస్త్రాల స్థాయికీ దానికి సంబంధించిన అధిభౌతిక, గతితర్కేతర తత్వశాస్త్రానికీ ఇది అనుగుణంగానే ఉంది. ప్రకృతి నిరంతరాయంగా చలనంలో ఉందని అప్పటికి తెలుసు. అయితే ఆనాటి భావాల ప్రకారం ఈ చలనం నిరంతరాయంగా ఒక వలయంలో జరుగుతుంది, కనుక అది అక్కడి నుండి కదలనే కదలదు. పదే పదే అవే ఫలితాలను అది సృష్టిస్తుంది. ఆవేళ్టికి ఈ భావన తప్పదు. సూర్య కుటుంబం పుట్టుక గురించి అప్పుడే కాంట్ తన సిద్ధాంతం ప్రతిపాదించాడు. కాని అప్పటికి దానిని ఒక వింతగానే పరిగణించారు. భూమి పరిణామ చరిత్ర, భూగోళ శాస్త్రం అప్పటికి బొత్తిగా తెలియదు. సామాన్యం నుంచి సంక్లిష్టం వరకూ సాగిన అనేక పరిణామాల పరంపర ఫలితమే నేటి జీవుల ఉనికి అనే భావన అప్పటికి శాస్త్రీయంగా ప్రతిపాదించ బడనేలేదు. కనుక ప్రకృతి గురించిన ఈ అచారిత్రిక భావన అప్పటికి అనివార్యం. హెగెల్‌కి సైతం ఇదే భావన ఉందీ అంటే పద్ధెనిమిదో శతాబ్దపు భౌతికవాదులను ఈ విషయంలో నిందించాల్సిన పనే లేదని అర్థం. భావం నుంచే ప్రకృతి వేరుపడిందని ఆయన అంటాడు. కాలంలో అభివృద్ధి చెందగలిగిన శక్తి ప్రకృతికి లేదనీ అది కేవలం స్థలంలో మాత్రమే తన వైవిధ్యాన్ని విస్తరించగలుగుతుందని ఆయన అంటాడు. కనుక దానిలో ఉన్న అభివృద్ధి దశలన్నింటినీ ఏకకాలంలో పక్కపక్కనే ప్రదర్శిస్తుందనీ అదే ప్రక్రియ నిరంతరాయంగా పునరావృతం గాక తప్పదనీ ఆయన భావన. అభివృద్ధి అంతటికీ మౌలిక షరతు అయిన కాలంతో ప్రమేయం లేకుండా కేవలం స్థలంలో అభివృద్ధి చెందడం అన్నది అసంబద్ధం. ఈ అసంబద్ధతను హెగెల్ ప్రకృతి పైన రుద్దాడు. భూగోళ శాస్త్రం, పిండ శాస్త్రం,

మొక్కలకూ జంతువులకూ సంబంధించిన శరీర అంగ నిర్మాణ శాస్త్రం, సేంద్రీయం రసాయన శాస్త్రం అప్పుడే నిర్మించబడుతున్నాయి. ఈ నూతన శాస్త్రాల ప్రాతిపదికపై ప్రతిచోటా పరిణామక్రమ సిద్ధాంతపు అద్భుతమైన ఛాయలు కనిపిస్తున్నాయి. (ఉదాహరణకు, గోథే, లామార్క్). సరిగ్గా ఈ సమయంలోనే హెగెల్ సిద్ధాంతపు ఈ అసంబద్ధత. దానిని ఆనాటి వ్యవస్థ కోరింది వ్యవస్థ కోసం తయారైన పద్ధతి అది. అందుకే తనకు తాను అసత్యం కావలసి వచ్చింది.

ఈ అచారిత్రక భావన చారిత్రక రంగంలో కూడా ప్రబలంగా ఉండింది. ఇక్కడ మధ్య యుగాల అవశేషాలపై పోరాటం దృక్పథాన్ని మసగబారేలా చేసింది. మధ్య యుగాలను మొత్తంగా వెయ్యేళ్ల సార్వత్రిక ఆటవికతగానూ ఒక చారిత్రక ఆటంకంగానూ భావించడం జరిగింది. అదే కాలంలో యూరప్ సాంస్కృతిక ప్రదేశం విస్తరించింది. గొప్ప జాతులు ఎన్నో పుట్టాయి. మనగలిగాయి. పైగా 14, 15 శతాబ్దాల్లో అద్భుతమైన సాంకేతిక ప్రగతి సాధ్యమైంది. మధ్య యుగాలలో సాధించిన ఈ మహా ప్రగతినంతటినీ వారు పట్టించుకోలేదు. దానివల్ల ఒక మహత్తర చారిత్రక అంత. సంబంధాన్ని గ్రహించే హేతు బద్ధ అంత: దృష్టి అన్నది అసాధ్యమైంది. మహా అయితే చరిత్ర అన్నది తత్వశాస్త్రవేత్తలకు ఒక ఉదాహరణల సంపుటిగా మాత్రమే ఉపయోగపడింది.

జర్మనీలో యాభయ్యవ దశకంలో భౌతికవాదాన్ని నెత్తినెత్తుకుని దానిని భ్రష్టు పట్టించిన వాళ్లు కూడా ఏ రకంగానూ తమ ఉపాధ్యాయుల పరిమితులను అధిగమించలేకపోయారు ఈ లోగా ప్రకృతి శాస్త్రాలు పురోగమించాయి. ఆ పురోగమనమంతా కేవలం ప్రపంచ సృష్టికర్త ఎవరూ లేరని నిరూపించడానికి దొరికిన మరికొన్ని కొత్త రుజువులుగా మాత్రమే వారు ఉపయోగించుకున్నారు. నిజానికి సిద్ధాంతాన్ని మరింతగా అభివృద్ధి చేయడం అన్నది వారి వల్ల అయ్యే ఈనికాదు కూడా భావ వాదం అవసాన దశకు చేరుకుంది. 1848 విప్లవం దానిని చావుదెబ్బ కొట్టింది. అయినప్పటికీ భౌతికవాదం ఆవేళకు మరింతగా దిగజారింది గదా అన్న సంతృప్తి దానికి మిగిలింది ఈ బాపతు భౌతిక వాదానికి ప్రాతినిధ్యం వహించడానికి ఫ్యూయర్ బా నిరాకరించడం సరైనదే. అయితే ఈ భ్రష్ట సిద్ధాంతాన్ని భౌతికవాదంగా గందరగోళ పరచిఉండాల్సి కాదు

అయితే ఇక్కడ రెండు విషయాలు ప్రస్తావించాల్సి ఉంది.

మొదటిది, ఫ్యూయర్ బా జీవిత కాలంలో ప్రకృతి శాస్త్రాల అభివృద్ధి ప్రక్రియ ఒక అగ్నిగుండంలా ఉంది. అది కేవలం 15 యేళ్లగా మాత్రమే సాపేక్షంగా స్పష్టమైన నిర్ధారణలకు చేరుకుంది. కనీవినీ ఎరుగని స్థాయిలో కొత్త శాస్త్రీయ సమాచారం పోగుబడింది.

అయితే అంత: సంబంధాలను రుజువు చేయడం ద్వారా ప్రతి నూతన అన్వేషణను ఒకరికొకరు సన్నిహితంగా పరిశీలించి చూసుకోవడం ద్వారా గందరగోళంగా కనిపించే ఆవిష్కరణలలో ఉండే క్రమ బద్ధతను ప్రదర్శించడం మొట్టమొదటిసారిగా ఇటీవల కాలంలో మాత్రమే సాధ్యమైంది. కణ సిద్ధాంతం, శక్తి రూపాంతరం అన్న సిద్ధాంతం, డార్విన్ జీవ పరిణామ సిద్ధాంతం-ఈ మూడు నిర్ణయాత్మక సిద్ధాంతాలు ఫ్యూయర్ బా బతికుండగానే వచ్చాయి. నిజమే ఆనాటి శాస్త్రవేత్తలు సైతం ఈ ఆవిష్కరణలను సవాలు చేయనైనా చేశారు లేదా వాటిని ఎలా ఉపయోగించాలో తగినంత స్థాయిలో తెలుసుకోలేకనైనా పోయారు అటువంటప్పుడు గ్రామీణ ప్రాంతంలో ఏకాంతంలో ఉన్న ఒక ఒంటరి తత్వవేత్తగా ఈ ఆవిష్కరణల సంపూర్ణ విలువను తెలుసుకోవడానికి తగినంతగా శాస్త్రీయ పరిణామాలను ఫ్యూయర్ బాక్ ఎలా గ్రహించగలడు? ఆనాటి జర్మనీలోని హీన పరిస్థితులే దీనికి కారణం. వాటి కారణంగానే కలగూర గంపలాంటి చిల్లర సొలెగూడు సిద్ధాంతాలను అల్లేవారే తత్వశాస్త్ర పీఠాలను ఆక్రమించారు. వారందరికంటే ఉన్నతుడైన ఫ్యూయర్ బా ఒక కుగ్రామంలో మగ్గాల్సి వచ్చింది. ప్రకృతికి సంబంధించిన చారిత్రక భావన ఇప్పుడు సాధ్యమైంది ఫ్రెంచి భౌతికవాదపు లోపభూయిష్టతను అది తొలగించగలిగింది. కాని అది ఫ్యూయర్ బాకు అందుబాటులోకి రాలేదన్నదిఆయనపొరపాటుకాదు.

రెండోది, 'ప్రాకృతిక శాస్త్రీయ భౌతిక వాదం మానవ ... జ్ఞానం అనే భవంతికి పునాదేకాని అది స్వయంగా భవంతి కాదు' అని ఫ్యూయర్ బా సరిగానే స్పష్టం చేశాడు. ఎందుకంటే మనం నివసించేది కేవలం ప్రకృతిలో మాత్రమే కాదు మానవ సమాజంలో కూడా. ప్రకృతిలాగానే మానవ సమాజానికి కూడా ఒక అభివృద్ధి చరిత్ర ఒక శాస్త్రం ఉన్నాయి. కనుక సామాజిక శాస్త్రాన్ని ( అనగా చరిత్ర , తత్వ శాస్త్రాల సమాహారం). భౌతిక పునాదిపై పొందికగా నిలపాలి. దానిపైన పునర్నిర్మాణాన్ని కొనసాగించాలి. అయితే ఇది ఫ్యూయర్ బా వంతు కాలేకపోయింది.' పునాది' సరిగానే ఉన్నప్పటికీ ఆయన ఇక్కడ సంప్రదాయక భావవాద సంకెళ్లలో బందీ అయ్యాడు.' వెనుక దిశలో నేను భౌతికవాదులతో అంగీకరిస్తాను. ముందు దిశలో మాత్రం కాదు' అన్న ఆయన మాటల్లో ఈ వాస్తవం ఇమిడి ఉంది.

–ఏంగెల్స్ , లుడ్విగ్ ఫ్యూయర్ బాక్ (1888).

# 2

# ఫ్రాన్స్, ఇంగ్లండులలో ఆధునిక భౌతికవాద అభివృద్ధి

18 వ శతాబ్దపు ఫ్రెంచి వికాస ఉద్యమం ముఖ్యంగా ఫ్రెంచి భౌతికవాదం కేవలం అనాటి రాజకీయ వ్యవస్థలపైనా, మతంపైనా, దైవ వాదంపైనా పోరాడాయి. అంతేగాదు. మొత్తంగా అధిభౌతికవాదంపైన, 17 వ శతాబ్దపు అధి భౌతికవాదంపైన, ముఖ్యంగా డెస్కార్టస్ , మాలెబ్రాంచ్, స్పినోజా , లీబ్నిజ్‌ల అధి భౌతికవాదంపైన కూడా బాహాటంగా పోరాడాయి. ఫ్యూయర్ బా హెగెల్‌పై తన మొట్టమొదటి దాడిలో స్థిరచిత్తం కలిగిన తత్వశాస్త్రాన్ని తాగుబోతు ఊహాత్మక వాదానికి వ్యతిరేకంగా నిలిపాడు. ఫ్రెంచి వికాస ఉద్యమం ఇంకా ఖచ్చితంగా చెప్పాలంటే 18 వ శతాబ్దపు ఫ్రెంచి భౌతికవాదం అధిభౌతికవాదాన్ని ఓడించి రంగం నుంచి తరిమేశాయి. అయితే జర్మన్ తత్వశాస్త్రం, ముఖ్యంగా 19 వ శతాబ్దపు ఊహాత్మక జర్మన్ తత్వశాస్త్రం మళ్లీ దానిని ఘనంగా, విజయవంతంగా పునరుద్ధరించాయి. హెగెల్ తన తత్వశాస్త్రంతో తర్వాత కాలపు అధి భౌతికవాదాన్ని అంతటినీ జర్మన్ భావ వాదంతో అమోఘంగా మేళవించి ఏకంగా ఒక అధి భౌతిక విశ్వ సామ్రాజ్యాన్నే స్థాపించాడు. ఊహాత్మక అధి భౌతికవాదంపైనా స్థూలంగా అధి భౌతికవాదంపైనా జరిగిన దాడి 18 వ శతాబ్దంలోలాగానే దైవ వాదంపైన దాడికి అనుగుణంగా ఉంది. ఇప్పుడు ఊహాత్మకత వల్లనే మరింత పరిపూర్ణతను సాధించుకున్న భౌతికవాదం ఊహాత్మక వాదాన్ని ఓడించి మానవతావాదంతో మమేకం అవుతుంది. సైద్ధాంతిక రంగంలో భౌతికవాదానికి ఫ్యూయర్ బా ప్రాతినిధ్యం వహించినట్టే ఆచరణ రంగంలో ఇప్పుడు మానవతావాదంతో ఏకీభవిస్తున్న భౌతికవాదానికి ఫ్రెంచి, ఇంగ్లీష్ సోషలిజం, కమ్యూనిజాలు ప్రాతినిధ్యం వహిస్తున్నాయి.

ఫ్రెంచి భౌతికవాదంలో రెండు ధోరణులు ఉన్నాయి. ఒకదానికి మూలం డెస్కార్టస్, రెండోదానికి మూలాధారం లాక్. లాక్ సిద్ధాంతం ప్రధానంగా ఒక ఫ్రెంచి పరిణామం. అది నేరుగా సోషలిజానికి దారితీస్తుంది. డెస్కార్టస్ సిద్ధాంతం యాంత్రిక భౌతిక

వాదం. అది ఫ్రెంచి ప్రకృతి శాస్త్రంతో కలిసిపోతుంది ఈ రెండు ధోరణులు అభివృద్ధి క్రమంలో ఒకదానినొకటి దాటుతూ ఉంటాయి. డెస్కార్టస్ సిద్ధాంతం నుంచి పరిణమించిన ఫ్రెంచి భౌతికవాదం గురించికానీ అలాగే ఫ్రెంచి న్యూటన్ సిద్ధాంత ధోరణుల గురించికానీ లేదా స్థూలంగా ఫ్రెంచి ప్రకృతి శాస్త్రం గురించి కానీ ఇక్కడ మనం లోతుగా పరిశీలించాల్సిన అవసరం లేదు.

కనుక మనం ఈ కింది విషయాన్ని ప్రస్తావిస్తే సరిపోతుంది.

డెస్కార్టస్ తన భౌతిక శాస్త్రంలో పదార్థానికి స్వయం సృష్టి శక్తిని ఇచ్చాడు. యాంత్రిక చలనం అనేది పదార్థపు జీవిత చర్యగా ఆయన భావించాడు. ఆయన తన భౌతిక శాస్త్రాన్ని తన అధి భౌతికవాదం నుంచి పూర్తిగా వేరుచేశాడు. ఆయన భౌతికవాదం పరిధిలో అస్థిత్వానికీ, జ్ఞానానికీ ఏకైక పునాది పదార్థం మాత్రమే.

ఫ్రెంచి యాంత్రిక్ష భౌతికవాదం డెస్కార్టస్ అధి భౌతికవాదానికి వ్యతిరేకంగా ఆయన భౌతిక వాదాన్ని అనుసరించింది. ఆయన అనుయాయులు వృత్తిరీత్యా అధి భౌతికవాద వ్యతిరేకులు. అనగా భౌతికవాదులు.

ఈ తాత్విక ధోరణి వైద్యుడయిన లెరాయ్‌తో ప్రారంభమై మరో వైద్యుడు కబానిస్‌తో శిఖరాగ్ర దశను చేరుకుంది. వైద్యుడు లామెట్రీ దీనికి కేంద్ర బిందువు. కార్టీజియన్ల జంతువుల అంగ నిర్మాణ పద్ధతిని లామెట్రీలాగానే లెరాయ్ కూడా 18 వ శతాబ్దంలో మానవ ఆత్మకు వర్తింపజేశాడు. ఆత్మ అనేది దేహం ఉండే విధానమని భావాలు యాంత్రిక చలనాలనీ వారు అన్నారు. అప్పటికి డెస్కార్టస్ బతికే ఉన్నాడు. డెస్కార్టస్ తన నిజమైన అభిప్రాయాన్ని దాచిపెట్టాడని కూడా లెరాయ్ అనుకున్నాడు. దానిని డెస్కార్టస్ నిరసించాడు. “మనిషిలో భౌతిక, నైతిక అంశాల మధ్య చంబంధం” అనే తన గ్రంథంలో 18 వ శతాబ్దపు అంతంలో కబానిస్ కార్టీజియన్ భౌతికవాదాన్ని మరింత పరిపూర్ణం చేశాడు.

ఫ్రాన్స్‌లో కార్టీజియన్ భౌతికవాదం ఇంకా బతికే ఉంది. యాంత్రిక ప్రకృతి శాస్త్రంలో అది ఘన విజయాన్ని సాధించింది. దానిని కాల్పనికవాదమని ఎవరూ నిందించలేరు.

డెస్కార్టస్ ప్రాతినిధ్యం వహించిన అధి భౌతిక సిద్ధాంతం ఫ్రాన్స్‌లో భౌతికవాదానికి ఆజన్మ శత్రువు. ఎపిక్యూరస్ భౌతికవాదాన్ని పునరుద్ధరించిన గాసెండీ డెస్కార్టస్‌ను వ్యక్తిగతంగా వ్యతిరేకించాడు. ఫ్రెంచి , ఇంగ్లీష్ భౌతికవాదం ఎల్లప్పుడూ డెమాక్రిటస్, ఎపిక్యూరస్‌లతో సన్నిహిత సంబంధం కలిగిఉంది. ఇంగ్లీష్

భౌతికవాది హాబ్స్ కూడా కార్టీజియన్ భౌతికవాదాన్ని వ్యతిరేకించాడు. గాసెండీ, హాబ్స్‌లు తమ ప్రత్యర్థిపై వారి మరణానంతరమే విజయం సాధించారు. అప్పటికే భౌతికవాదం ఫ్రెంచి పాఠశాలలన్నింటిలోనూ అధికారికంగా ప్రబలంగా ఉంది.

18 వ శతాబ్దంలో జెస్యూట్‌లకూ, జాన్సనిస్టులకూ మధ్య కొనసాగిన వివాదాలను ఫ్రెంచి ప్రజలు పట్టించుకోకపోవడానికి తత్వశాస్త్రం కంటే ఆర్థిక రంగంలో లా నిర్వహించిన విన్యాసాలేనని వాల్టెయిర్ అన్నాడు. నిజానికి 17 వ శతాబ్దపు అధి భౌతికవాద పతనాన్ని 18 వ శతాబ్దపు భౌతిక వాద సిద్ధాంతం ద్వారా వివరించవచ్చు అయితే ఆ సిద్ధాంత ఉద్యమాన్ని ఆనాటి ఫ్రెంచి జీవితపు ఆచరణశీల స్వభావం ద్వారా వివరించిన మేరకే అది సాధ్యం. ఆనాటి జీవితం తక్షణ వర్తమానానికీ, ప్రాపంచిక సుఖాలకూ, ప్రాపంచిక ప్రయోజనాలకూ, ఇహలోకపర అంశాల వైపుకూ తిరిగింది. దాని దైవ వాద వ్యతిరేక , అధి భౌతికవాద వ్యతిరేక భౌతికవాద ఆచరణకి దైవ వాద వ్యతిరేక, అధి భౌతికవాద వ్యతిరేక సిద్ధాంతాలు అవసరమయ్యాయి. అధి భౌతికవాదం ఆచరణలో తన ప్రతిష్టనంతటినీ కోల్పోయింది. ఇక్కడ మనం క్లుప్తంగా ఈ సైద్ధాంతిక క్రమాన్ని సూచిస్తే చాలు.

17 వ శతాబ్దపు అధి భౌతికవాదంలో ( డెస్కార్టస్, లీబ్నిజ్ తదితరులు) ఇంకా సానుకూలమైన వ్యవహారశీలమైన అంశం ఉండింది. గణిత శాస్త్రంలోనూ, భౌతిక శాస్త్రంలోనూ దాని పరిధిలోకి వస్తాయని భావించిన ఇతర ప్రకృతి శాస్త్రాలలోనూ అది ఆవిష్కరణలు చేసింది. అయితే ఈ రూపం 18 వ శతాబ్దపు ప్రారంభం నాటికే అంతమైపోయింది. ఈ రూఢ శాస్త్రాలు దానినుంచి విడిపోయి తమ తమ సొంత రంగాలను నిర్ణయించుకున్నాయి. సరిగా నిజమైన వస్తువులు , ఇహలోక అంశాలూ ఆకర్షణ కేంద్రాలైన తరుణంలోనే అధి భౌతికవాదపు సంపద మొత్తం ఆలోచనాంశాలకూ , స్వర్గ లోక విషయాలకూ కుదించబడింది. అధి భౌతికవాదం తన పస కోల్పోయింది. 17 వ శతాబ్దపు చిట్టచివరి మహా అధి భౌతికవాదులైన మాలె బ్రాంచ్ , అర్నాల్డ్‌లు చనిపోయిన యేదాదే హెల్వీటియస్, కాండిలాక్‌లు పుట్టారు.

17 వ శతాబ్దపు అధి భౌతికవాదానికి సైద్ధాంతిక రంగంలో ఎటువంటి ప్రతిష్టా లేకుండా చేసినవాడు పియరీ బేల్ ఆయన ఆయుధం సంశయవాదం అధిభౌతిక వాదపు సొంత గారడీ సూత్రాల నుండే ఆయన తన ఆయుధాన్ని సమకూర్చుకున్నాడు. ఆయన కార్టీజియన్ భౌతికవాదం నుంచే తన పయనాన్ని మొదలుపెట్టాడు. ఊహాత్మక దైవ వాదానికి వ్యతిరేకంగా తన పోరాటాన్ని ప్రారంభించి ఊహాత్మక తత్వ శాస్త్రానికి వ్యతిరేకంగా పోరాడే దశకు ప్యూయర్ బాక్ చేరుకున్నాడు. ఎందుకంటే ఆయన

ఊహాత్మక వాదాన్ని దైవ వాదానికున్న ఆఖరి ఆసరాగా గుర్తించాడు. దైవ వాదాన్ని ఆయన దాని శాస్త్రీయ నటన నుంచి రోత పుట్టించే మొరటు విశ్వాసం వైపుకు తరిమేయాలని అనుకున్నాడు. అలాగే బేల్ కూడా మత సందేహంతో ప్రారంభించి మత విశ్వాసానికి ఆధారభూతమైన అధి భౌతికవాదాన్ని సందేహించే దశకు చేరుకున్నాడు. అందుకనే అయన అధి భౌతికవాదాన్ని దాని పుట్టుక నుంచీ విమర్శనాత్మకంగా పరిశోధించాడు. అయన దాని మరణ చరిత్ర రాయడం కోసం దాని చరిత్రకారుడు అయ్యాడు. ముఖ్యంగా స్పినోజా, లీబ్నిజ్ సిద్ధాంతాలను తప్పు అని రుజువు చేశాడు.

పియరీ బేల్ తన సంశయవాదంతో అధిభౌతికవాదాన్ని తునాతునకలు చేయడం ద్వారా భౌతికవాదానికీ వ్యవహార జ్ఞాన తత్వశాస్త్రానికీ స్వాగత సన్నాహాలు మాత్రమే చేయలేదు. ఆయన ఒక నాస్తిక సమాజాన్ని ప్రారంభించాడు. నాస్తికులు మాత్రమే ఉండే ఒక సంఘం సాధ్యమని, ఒక నాస్తిక వాది గౌరవనీయమైన వ్యక్తిగా ఉండగలడని రుజువు చేశాడు. మనిషి నాస్తికత్వం వల్లగాక మూఢనమ్మకాల వల్లనూ విగ్రహారాధన వల్లనూ తనను తాను నీచబర్చుకుంటాడని ఆయన రుజువు చేశాడు.

ఒక ఫ్రెంచి రచయిత మాటల్లో చెప్పాలంటే పియరీ బేల్ "17 వ శతాబ్దపు అర్థంలో చిట్టచివరి అది భౌతికవాది. 18 వ శతాబ్దపు అర్థంలో మొదటి తాత్వికుడు.'

' 17 వ శతాబ్దపు దైవవాదాన్ని అధిభౌతికవాదాన్ని తప్పు అని రుజువు చేసే ప్రతికూల సిద్ధాంతంతో పాటు ఒక సానుకూలమైన అధిభౌతికవాద వ్యతిరేక వ్యవస్థ అవసరమైంది. ఆనాటి జీవిత ఆచరణను క్రమబద్ధం చేసి సైద్ధాంతికంగా సమర్థించే గ్రంథం ఒకటి అవసరమైంది. మానవ హేతుబద్ధతపై లాక్ రాసిన గ్రంథం ఇంగ్లీష్ కాలువకు ఆవల వైపు నుంచి ఈ అవసరానికి జవాబుగానా అన్నట్టుగా వచ్చింది. ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న అతిథిని ఆదరించినట్టు ఉత్సాహంగా ఫ్రెంచి వారు దానికి స్వాగతం పలికారు.

బహుశా లాక్ స్పినోజా అనుయాయుడేమో అన్న ప్రశ్నకు "వ్యవహారశీల' ' చరిత్ర ఇలా సమాధానం చెప్పవచ్చు :

భౌతికవాదం జన్మత: గ్రేట్ బ్రిటన్ సంతానం. బ్రిటన్‌కి చెందిన పండితవాది డన్స్ స్కోటస్ "పదార్థం ఆలోచించగలదా " అని ఆశ్చర్యపోయాడు.

ఆ అద్భుతాన్ని సాధించడానికి ఆయన భగవంతుని సర్వశక్తి సామర్థ్యాన్ని ఆశ్రయించాడు. అంటే ఆయన దైవవాదంతోనే భౌతికవాదాన్ని బోధింపజేశాడు. దానికితోడు ఆయన నామవాది. నామవాదం ఇంగ్లీష్ భౌతికవాదంలో ఒక ప్రధాన భాగం స్థూలంగా భౌతిక వాదానికి అది ప్రథమ వ్యక్తీకరణ.

ఇంగ్లీష్ భౌతికవాదానికీ, సకల ఆధునిక ప్రయోగశాస్త్రానికీ ఆద్యుడు బేకన్. అతని దృష్టిలో ప్రకృతి శాస్త్రమే నిజమైన శాస్త్రం. ఇంద్రియ గ్రాహ్యంపై ఆధారపడిన భౌతిక శాస్త్రం ప్రకృతి శాస్త్రంలో ఒక అద్భుత భాగం. హోమియో మెరియా ( ఈ పదాన్ని అరిస్టాటిల్ ప్రయోగించాడు. చరాచర ప్రపంచమంతా ఈ సూక్ష్మాంశాలతో లేదా అంకురాలతో నిండి ఉంటుందని అనగ్జాగోరస్ నమ్మాడు. అవే హోమియో మెరియాలు) ని ప్రతిపాదించిన అనగ్జాగోరస్నీ, అణు సిద్ధాంతాన్ని ప్రవచించిన డెమాక్రిటస్నీ ఆయన తరచుగా ప్రామాణికతకు ఉదాహరణలుగా ప్రస్తావించాడు. ఆయన బోధన ప్రకారం ఇంద్రియాలు తప్పు చేయవు. అవి జ్ఞానానికంతటికీ మూలాధారం. శాస్త్రం ప్రయోగశీలం. ఇంద్రియాలు సమకూర్చిన సమాచారానికి హేతుబద్ధ పద్ధతిని నిలకడగా వర్తింపజేయడమే శాస్త్రం పని. పదార్థానికి అంతర్ నిహితంగా ఉండే లక్షణాల్లో ప్రథమమూ, అత్యంత ప్రధానమూ అయినది చలనం. యాంత్రిక , గణిత చలనం మాత్రమే కాదు. ప్రేరణ, సజీవ జీవన తత్వం , ఉద్విగ్నత, లేదా జాకబ్ బోహ్మే మాటల్లో చెప్పాలంటే, పదార్థపు వేదన ( క్వాల్) ఇవన్నీ చలనాలే. పదార్థంలో అంతర్ నిహితంగా ఉండే సజీవ విడి అస్థిత్వ శక్తులూ, తెగల మధ్య భిన్నత్వాన్ని ఉత్పత్తి చేసే అంశాలే దాని ప్రాధమిక రూపాలు.

భౌతిక వాదానికి ప్రథమ సృష్టి కర్త అయిన బేకన్ సిద్ధాంతం ప్రకారం పదార్థం తనలో గుప్తంగా అమాయకంగా సర్వతోముఖ అభివృద్ధికి అవసరమైన అంకురాలను కలిగి ఉంటుంది. పదార్థం మనిషిని చూసి కవితాత్మకమైన ఇంద్రియ కాంతితో చిరు నవ్వింది. ధర్మ సూత్రాల జాబితాలాంటి ఈ సిద్ధాంతం మరో వైపున దైవ వాదంలో ఉన్న వైరుధ్యాలన్నింటితోనూ నిండిపోయింది

భౌతికవాదం దాని తర్వాత అభివృద్ధిలో ఏకపార్శ్వంగా మారింది. బేకన్ భౌతిక వాదాన్ని క్రమబద్ధం చేసినవాడు హాబ్స్ ఇంద్రియానుభూతి దాని వికాసాన్ని కోల్పోయింది. అది ఒక రేఖా గణిత శాస్త్రజ్ఞుని నైరూప్య ఇంద్రియానుభూతిగా మారిపోయింది. యాంత్రిక, గణిత చలనాలకు భౌతిక చలనం బలైంది. రేఖా గణిత శాస్త్రమే ప్రధాన శాస్త్రమైంది. భౌతికవాదం మానవత్వానికి శత్రువైంది. భౌతికవాదం తన సొంత రంగంలో తన మానవ వ్యతిరేక అశరీర తత్వాన్ని అధిగమించడం కోసం తన శరీరాన్ని కృశింపజేసుకుని ఒక రుషిలా మారాల్సి వచ్చింది. అది ఒక హేతుబద్ధతకు అస్థిత్వ రూపంలా కనిపించింది. అయితే హేతుబద్ధతకు ఒక మొండి తర్కాన్ని అభివృద్ధి చేసింది.

జ్ఞానానికంతటికీ మానవ ఇంద్రియాలే మూలాధారమైనప్పుడు భావన, ఆలోచన, ఊహ మొదలైనవన్నీ భౌతిక ప్రపంచపు ప్రేతాలు తప్ప మరేమీ కాదు అని హాబ్స్

వాదిస్తాడు ఈ విషయంలో ఆయన బేకన్ నుంచి ప్రారంభించాడు. కాకుంటే ఈ ప్రేతాత్మలకు ఇంద్రియ రూపం ఉండదు. వీటికి శాస్త్రం పేరు మాత్రమే పెట్టగలుగుతుంది. అనేక ప్రేతాత్మలకు ఒక పేరు వర్తిస్తుంది. పేర్లకు కూడా పేర్లు ఉండవచ్చు అని ఆయన అంటాడు. అయితే ఒక వైపున భావాలన్నీ ఇంద్రియాల ప్రపంచం నుంచి పుట్టాయని చెబుతూనే మరో వైపున ప్రాతినిధ్యం వహించబడిన అస్థిత్వాలకు తోడు ఒక మాట, ఒక మాట కంటే ఎక్కువని అనడం పరస్పర విరుద్ధం. పైగా ఈ అస్థిత్వ అంశాలు విడి అంశాలు అంటూనే వీటన్నింటికీ వర్తించే సామాన్య అంశాలు ఉన్నాయని అనడం కూడా వైరుధ్యమే. ఒక అశరీర వస్తువు ఎంత అర్థరహితమో ఒక అశరీర సారం కూడా అంతే అర్థరహితం. వస్తువు, సారం, అస్థిత్వం అన్నవి ఒకే ఒక లాంటి వాస్తవ భావం. ఆలోచించే పదార్థం నుంచి ఆలోచనను ఎవరూ వేరుచేయలేరు. అనంతంగా ఒకదానికి మరోదాన్ని జత చేసుకుంటూ పోయే మేధోశక్తి అన్న అర్థంలో తప్ప అనంతం అన్న మాట అర్థరహితం. ఎందుకంటే పాదార్థికం అయినది మాత్రమే గ్రహించడానికి తెలుసుకోవడానికి సాధ్యపడుతుంది. భగవంతుని అస్థిత్వం గురించి ఏమీ తెలియదు నా ఉనికి గురించి మాత్రమే నాకు ఖచ్చితంగా తెలుసు. ప్రతి మానవ ఉద్విగ్నత ఆదిలోనైనా, అంతంలోనైనా యాంత్రిక చలనం మాత్రమే. ప్రేరణల లక్ష్యాలు మంచి మాత్రమే. ప్రకృతికి వర్తించే నియమాలే మనిషికీ వర్తిస్తాయి. శక్తి, స్వేచ్ఛ రెండూ సర్వ సమానాలే అని ఆయన అంటాడు.

ఈ రకంగా హాబ్స్ బేకన్ సిద్ధాంతాన్ని క్రమబద్ధం చేశాడు. అయితే మన జ్ఞానానికీ, మన భావాలకూ మూలాధారం ఇంద్రియాల ప్రపంచమే అన్న ఆయన మౌలిక సూత్రానికి మరింత ఖచ్చితమైన రుజువును చూపలేకపోయారు.

బేకన్, హాబ్స్‌ల సూత్రాన్ని మానవ హేతుబద్ధత పుట్టుకపై రాసిన తన వ్యాసంలో లాక్ రుజువు చేశాడు.

బేకన్ భౌతిక వాదంలోని దైవ వాద దురభిమానాలను హాబ్స్ తొలగించాడు అలాగే కాలిన్స్, డాడ్‌వెల్, కోవార్డ్, హార్ట్‌లీ, ప్రీస్ట్‌లీ తదితరులు లాక్ ఇంద్రియానుభూతి వాదపు చిట్టచివరి పరిధులను చెరిపేశారు. భౌతికవాదులకు మతాన్ని వదిలించుకోవడానికి ద్వైవీ వాదం అన్నది సుకరమైన, సులువైన సాధనం తప్ప మరేమీ కాదు.

లాక్ గ్రంథం ఫ్రెంచి ప్రజలకు ఎంత సమయానుకూలంగా లభించిందో మనం ఇంతకుముందే చెప్పుకున్నాం. వ్యవహార జ్ఞాన తత్వశాస్త్రాన్ని లాక్ కనుగొన్నాడు. ఆరోగ్యకరమైన మానవ ఇంద్రియాలకు వాటిపై ఆధారపడిన హేతుబద్ధతకూ ఏ తత్వవేత్త విరుద్ధంగా ఉండజాలదని ఆయన అన్నారు.

కాండీలాక్ లాక్ గ్రంధాన్ని ఫ్రెంచిలోకి అనువదించాడు. లాక్‌కు తక్షణ అనుయాయుడు కూడా ఆయనే ఆయన లాక్ ఇంద్రియానుభూతి వాదాన్ని 17 వ శతాబ్దపు అధి భౌతికవాదానికి పోటీగా నిలబెట్టాడు. అధి భౌతికవాదం అన్నది కేవలం ఒక కాల్పనిక గందరగోళంగానూ, దైవవాద దురభిమానంగానూ భావించి ఫ్రెంచి ప్రజలు సరిగానే తిరస్కరించారని ఆయన రుజువు చేశాడు. డెస్కార్టస్ , స్పినోజా , లీబ్నిజ్ , మాలెబ్రాంచ్‌ల సిద్ధాంత వ్యవస్థలను తప్పు అని రుజువు చేయడం కోసం ఒక గ్రంథాన్ని ఆయన ప్రచురించాడు.

ఆయన తన ఎస్సే సర్ లారిజిన్ డెస్ కొన్నైజెన్సెస్ హ్యూమైన్స్ లో లాక్ భావాలను వివరించాడు. అందులో కేవలం ఆత్మ మాత్రమే కాక ఇంద్రియాలు కూడా, భావాలను సృషించే కళ మాత్రమే కాక ఇంద్రియానుభూతి చెందే కళ కూడా, అనుభవానికీ, అలవాటుకీ సంబంధించిన విషయాలేనని ఆయన రుజువు చేశాడు. కనుక మనిషి అభివృద్ధి యావత్తూ విద్యపైన, పరిసరాలపైన ఆధారపడి ఉంటుంది అని ఆయన అన్నాడు. ఫ్రెంచి బడుల నుంచి కలగూర తత్వశాస్త్రమే కాండీలాక్ సిద్ధాంతాన్ని వెలివేసింది.

ఫ్రెంచి, ఇంగ్లీష్ భౌతికవాదాల మధ్య ఉన్న తేడా ఆ రెండు జాతుల మధ్య ఉన్న తేడాను అనుసరిస్తుంది. ఇంగ్లీష్ భౌతికవాదానికి ఫ్రెంచి వారు రక్తమాంసాలు అందించారు. గ్రహింపునూ, భాషణా చాతుర్యాన్ని ఇచ్చారు. దానికి లేని మనస్తత్వాన్నీ, దర్పాన్నీ చేకూర్చారు. దానిని నాగరికం చేశారు.

లాక్‌పై కూడా ఆధారపడిన హెల్వీటియస్ భౌతికవాదాన్ని నిజంగా ఫ్రెంచి భౌతికవాదంగా మార్చాడు. హెల్వీటియస్ తక్షణమే దానిని సామాజిక జీవితానికి వర్తించే విధంగా అర్థం చేసుకున్నాడు. ( హెల్వీటియస్, డి లహోమ్మీ, డి సెస్ పాకెల్టెస్ ఇంటలెక్చువల్లెస్ ఎట్ డి సన్ ఎడ్యుకేషన్ ). ఇంద్రియ గత లక్షణాలు, స్వీయ ప్రేమ, సుఖ భోగం, సరిగా అర్థం చేసుకున్న వ్యక్తిగత ప్రయోజనాలు నైతికతకు ఆధారాలు. మానవ మేథ సహజ సమానత్వమూ, హేతుబద్ధత ప్రగతీ, పరిశ్రమ ప్రగతి రెండింటి సమైక్యతా మనిషి సహజమైన మంచితనమూ, విద్యకున్న సర్వశక్తి సామర్థ్యమూ- ఇవీ, ఆయన సిద్ధాంత వ్యవస్థలోని ప్రధానాంశాలు.

డెస్కార్టస్ వ్యవస్థను, ఇంగ్లీష్ భౌతికవాదాన్ని లామెట్రీ తన గ్రంథంలో మేళవించాడు. డెస్కార్టస్ భౌతిక శాస్త్రాన్ని ఆయన వివరంగా ఉపయోగించుకున్నాడు. డెస్కార్టస్ 'జంతు యంత్రం' అనే నమూనాపై ఆధారపడి ఆయన తన 'మానవ యంత్రాన్ని' రచించాడు. సిస్టమ్ డి లా నేచర్ అనే గ్రంథంలో హోల్‌బాక్ కూడా ఫ్రెంచి,

ఇంగ్లీష్ భౌతికవాదాలను మేళవించాడు. ఇది ఆయన గ్రంథంలో భౌతిక భాగం. మిగతా నైతిక భాగం విషయంలో ఆయన హెల్వీటియస్ నైతిక శాస్త్రంపైన గణనీయంగా ఆధారపడ్డాడు. డి లా నేచర్ రాసిన రాబినెట్ ఫ్రెంచి భౌతికవాది. అయితే అధిభౌతిక వాదంతో ఆయన కు అత్యంత ఎక్కువ సంబంధం ఉంది. ఆయన బాహాటంగా లీబ్నిజ్‌ను ప్రస్తావిస్తాడు. అందుకే ఆయనను హెగెల్ పొగిడాడు.

పిజియోక్రాట్‌ల గురించి ఇక్కడ ప్రస్తావించాల్సిన అవసరం లేనట్టే వోల్నీ డుపీయిస్ డైడరాట్ తదితరుల గురించి కూడా మనం ఇక్కడ ప్రస్తావించాల్సిన పని లేదు. ఎందుకంటే ఫ్రెంచి భౌతికవాదం డెస్కార్టస్ భౌతిక శాస్త్రం నుంచి , ఇంగ్లీష్ భౌతిక వాదం నుంచి పుట్టిందని ఇప్పటికే రుజువు చేశాం. అలాగే ఫ్రెంచిపారౌతికవాదం 17 వ శతాబ్దపు అధి భౌతికవాదాన్ని, డెస్కార్టస్, స్పినోజా , మాలెబ్రాంచ్ , లీబ్నిజ్‌ల అధి భౌతికవాదాన్ని వ్యతిరేకించిందని కూడా తెలియజేశాం. ఊహాత్మక అధి భౌతిక వాదాన్ని తాము వ్యతిరేకించేటంత వరకూ పైన పేర్కొన్న వ్యతిరేకతను జర్మన్లు చూడలేకపోయారు.

కార్టీజియన్ భౌతిక వాదం ప్రకృతి శాస్త్రంలో కలిసిపోయినట్టే ఫ్రెంచి భౌతిక వాదానికి ఉన్న మరో శాఖ నేరుగా సోషలిజానికి, కమ్యూనిజానికి దారితీస్తుంది.

మనిషికున్న సహజమైన మంచితనమూ, సమానమైన మేథాశక్తి అనుభవానికీ, విద్యకీ , అలవాటుకీ ఉన్న సర్వశక్తి సామర్థ్యమూ , మనిషిపైన పరిసరాలకుండే ప్రభావమూ, పరిశ్రమకున్న గొప్ప ప్రాధాన్యమూ, అనుభోగాన్ని సమర్థించటమూ వగైరాలను బోధించిన భౌతిక వాద సిద్ధాంతం సోషలిజం, కమ్యూనిజాలతో సన్నిహితంగా ముడిపడి ఉంది అని చెప్పడానికి గొప్ప మేధాశక్తి అవసరం లేదు. ( ఇక్కడ సోషలిజం, కమ్యూనిజాలు అంటే అవి మార్క్సిజానికి పూర్వపు ధోరణులు అని గ్రహించాల్సి ఉంది. ఈ గ్రంథం మార్క్స్, ఏంగెల్స్‌లు 1844 లో రాశారన్నది గుర్తుంచుకోవాలి– సం ) మనిషి తన జ్ఞానాన్నీ, ఇంద్రియానుభూతినీ మొత్తంగా ఇంద్రియాల ప్రపంచం నుంచీ దానిలో పొందిన అనుభవం నుంచీ గ్రహించినట్టయితే అనుభవశీల ప్రపంచాన్ని అనువుగా మలచుకోవాల్సి ఉంది. మనిషి నిజంగా మానవీయమైనదాన్ని అనుభవించడానికీ, అలవాటుపడడానికీ , తానొక మనిషిననే చైతన్యంతో వ్యవహరించడానికి వీలుగా పరిసరాలను దిద్దుకోవాల్సి ఉంది. సరిగా అర్థం చేసుకున్న ప్రయోజనమే నైతికతకు అంతటికీ సూత్రమైనప్పుడు మనిషి వ్యక్తిగత ప్రయోజనం మానవ జాతి ప్రయోజనంతో ఏకీభవించేలా చేయాల్సి ఉంది. భౌతికవాద అర్థంలో మనిషి స్వతంత్రుడు కావాలి. అంటే ఇది చేయరాదు అది చేయరాదు అనే ప్రతికూల శక్తి ద్వారా కాకుండా తన నిజమైన వ్యక్తిత్వాన్ని నిలబెట్టుకునే సానుకూల శక్తి ద్వారా స్వేచ్ఛాయుతుడు కావాలి. కనుక నేరానికి శిక్ష వ్యక్తులకు విధించరాదు.

నేరానికున్న సంఘ వ్యతిరేక మూలాన్ని అంతం చేయాలి. తన అస్థిత్వాన్ని సజీవంగా ప్రదర్శించుకోవడానికి ప్రతి వ్యక్తికీ సామాజిక అవకాశం ఉండాలి. ప్రతి మనిషినీ పరిసరాలే రూపొందిస్తాయి అన్నప్పుడు అతని పరిసరాలను మానవీయం చేయాల్సి ఉంటుంది. మనిషి స్వభావరీత్యా సంఘ జీవి అన్నప్పుడు అతను తన నిజమైన స్వభావాన్ని సమాజంలోనే అభివృద్ధి చేసుకుంటాడు. అతని స్వభావ శక్తిని విడి వ్యక్తుల శక్తితోగాక సామాజిక శక్తితో కొలవాల్సి ఉంది.

ఇదీ , ఇలాంటి ప్రతిపాదనలే దాదాపు అక్షరాలా తొలి ఫ్రెంచి భౌతికవాదులలో సైతం కనిపిస్తాయి. వాటిని బేరీజు వేయడానికి అనువైన స్థలం కాదిది. లాక్‌కు తొలి అనుయాయుల్లో ఒకడైన మాండెవిల్లీ "తేనెటీగల కథలు లేదా వ్యక్తిగత దోషాలను బహిరంగపర్చడం ప్రయోజనకరం" అన్న గ్రంధాన్ని రాశాడు. అనాటి భౌతికవాదపు సామాజిక ధోరణులకు ఇది ఒక నమూనా. ఆధునిక సమాజంలో దోషమన్నది అనివార్యమని, ప్రయోజనకరమని అతను రుజువు చేశాడు. అది ఆధునిక సమాజానికి ఏ రకంగానూ వకాల్తా కాదు.

కొరియర్ నేరుగా ఫ్రెంచి భౌతికవాదుల బోధన నుంచే ప్రారంభించాడు. బబోవిస్టులు మొరటు, అనాగరిక భౌతికవాదులు. అయితే పరిణిత కమ్యూనిజం కూడా ఫ్రెంచి భౌతికవాదం నుంచే నేరుగా వచ్చింది. భౌతికవాదం హెల్వీటియస్ దానికి అందించిన రూపంలో తిరిగి తన మాతృదేశమైన ఇంగ్లండును చేరింది. హెల్వీటియస్ నీతి శాస్త్రంలోని సరిగా అర్థం చేసుకున్న ప్రయోజనం అన్న అంశంపైన బెంతం సిద్ధాంత వ్యవస్థ ఆధారపడింది. బెంతం వ్యవస్థపై ఆధారపడి వోవెన్ ఇంగ్లీష్ కమ్యూనిజాన్ని కనుగొనడానికి ప్రయత్నించాడు. ఫ్రెంచి పౌరుడు కాబెట్ ఇంగ్లండులో ప్రవాసంలో ఉండగా అక్కడ కమ్యూనిస్టు భావాల ప్రభావంలో పడ్డాడు. ఆయన కమ్యూనిస్టు జ్ఞానం కేవలం పైపై జ్ఞానమే అయినప్పటికీ ఫ్రాన్స్‌కు తిరిగి వెళ్లాక అక్కడ కమ్యూనిజానికి అత్యంత సుప్రసిద్ధుడైన ప్రతినిధి అయ్యాడు. డిజామీ, గే తదితరులు వోవెన్ లాగానే మరింత మెరుగైన శాస్త్రీయ ఫ్రెంచి కమ్యూనిస్టులు. వారు భౌతికవాద బోధనను ఒక మానవతా వాద బోధనగానూ, కమ్యూనిజానికి తార్కిక పునాదిగానూ అభివృద్ధి చేశారు.

మార్క్స్, ఏంగెల్స్, " పవిత్ర కుటుంబం" (1845)

# 3

# ఆధునిక వర్గ పోరాటాలతో అజ్ఞేయవాదానికీ, భౌతికవాదానికీ,మతానికీ ఉన్న సంబంధం

బ్రిటిష్ ప్రజలలో ఒక గణనీయమైన భాగం ఈ గ్రంథంలోని అంశాలకు అభ్యంతరం తెలియజేస్తారని నాకు బాగా తెలుసు బ్రిటిష్ "గౌరవనీయత"కు సంబంధించిన దురభిమానాలను ఏ మాత్రం పరిగణనలోకి తీసుకున్నా యూరప్ ఖండవాసులమైన మనం ఉన్నదాని కంటే మరింత హీనమైన స్థితిలో పడతాం. ఈ గ్రంథం "చారిత్రక భౌతికవాదం" అని మనం అంటున్నదానిని సమర్థిస్తుంది బ్రిటిష్ పాఠకులలో అత్యధికులకు భౌతికవాదం అనే మాట కర్ణ కఠోరం. 'అజ్ఞేయవాదా"న్ని సహించవచ్చుగాని వారికి భౌతికవాదం అన్నది ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు.

అయితే ఆధునిక భౌతికవాదానికంతటికీ 17 వ శతాబ్దం నుం నేటివరకూ ఇంగ్లండే జన్మభూమి.

"భౌతికవాదం గ్రేట్ బ్రిటన్ సహజ సంతానం.........." ( ఈ మొత్తం ఉల్లేఖనను ఇంతకుముందు 13వ పేజీ నుంచి చూడవచ్చు-సం.)

ఆధునిక భౌతికవాదం బ్రిటన్‌లోనే పుట్టింది అన్న సంగతిని కారల్ మార్క్స్ ఆ విధంగా రాశాడు. ఈనాటి బ్రిటిష్ వారి పూర్వీకులను ఆయన శ్లాఘించాడు. ఆ శ్లాఘన వీరికి గిట్టడంలేదంటే అది మరింత దయనీయం. ఏమైనప్పటికీ 18 వ శతాబ్దపు ఫ్రెంచి భౌతికవాదుల అమోఘమైన తాత్విక ధోరణకి దోహదపడింది మాత్రం బేకన్, హాబ్స్, లాక్ లే. భూమి మీద, సముద్రం మీద జరిగిన యుద్ధాలన్నింటిలోనూ జర్మన్లు, ఇంగ్లీష్ వారు ఫ్రెంచి వారిని ఓడించారు. అయినప్పటికీ భౌతికవాద సిద్ధాంతం కారణంగానే 18 వ శతాబ్దం ఫ్రెంచి శతాబ్దం. ఫ్రెంచి విప్లవంతో శిఖరాగ్ర దశకు

చేరుకోకముందే ఈ విషయం నిర్ధారితమైంది. ఫ్రాన్స్‌కు బయట బ్రిటిష్ , జర్మనీలలో ఉన్న మనం ఇంకా ఆ ఫలితాలకు అలవాటు పడడానికి ప్రయత్నిస్తూనే ఉన్నాం.

దానిని తిరస్కరించడానికి వీలులేదు. ఈ శతాబ్దపు మధ్యలో ఇంగ్లండులో నివాసం ఏర్పర్చుకున్న ప్రతి విదేశీయుడికీ గౌరవనీయమైన ఇంగ్లీష్ మధ్య తరగతి మత చాందసత్వాన్ని, మూర్ఖత్వాన్ని తప్పనిసరిగా పరిగణించాల్సి వచ్చింది. ఇది కొట్టొచ్చినట్టు కనిపించిన అంశం. ఆ సమయంలో మేమంతా భౌతికవాదులం లేదా కనీసం పురోగామి స్వతంత్ర ఆలోచనాపరులం. ఇంగ్లండులోని దాదాపు విద్యావంతులందరూ అన్ని రకాల అసంబద్ధపు అద్భుతాలను నమ్మడం మాకు అనూహ్యంగా ఉండేది. బక్లాండ్ , మాంటెల్‌లాంటి భూగర్భ శాస్త్రవేత్తలు సైతం ఆది గ్రంథంలోని మిధ్యతో ఘర్షించకుండా ఉండేందుకుగాను తమ శాస్త్ర వాస్తవాలను ఘోరంగా మార్చుకున్నారు. ఇది మాకు దుర్గ్రాహ్యంగా ఉండేది. మత విషయాలలో తమ స్వంత మేథోశక్తిని ఉపయోగించ సాహసించిన వారిని అవిద్యావంతులుగా శుచీ శుభ్రతలేని వారిగా పరిగణించారు. కార్మికులను ముఖ్యంగా ఓవెనైట్ సోషలిస్టులను, ఆనాడు "శుచీ శుభ్రతలేని" వారిగా పరిగణించేవారు.

అయితే ఆనాటి నుంచి ఇప్పటికి ఇంగ్లండు "నాగరికం" అయింది. 1851 నాటి ప్రదర్శన ఇంగ్లీష్ వారి ఒంటరి గూటిని బద్దలుకొట్టింది. ఆహార విహారాల్లో, భావాల్లో ఇంగ్లండు క్రమంగా అంతర్జాతీయం అయింది. యూరప్ ఖండంలో ఇంగ్లీష్ ఆచార వ్యవహారాలు ప్రభావం చూపినట్టే ఆ ఖండపు అలవాట్లు ఇంగ్లండులోనూ ప్రభావం చూపాయని నేను భావించాను. 1851 కి ముందు కేవలం ప్రభు వర్గానికి మాత్రమే తెలిసిన సలాడ్ ఆయిల్‌తో పాటు మత వ్యవహారాల్లో యూరప్ ఖండపు సంశయవాదం మరణాంతకంగా వ్యాపించింది. ఇంకా అప్పటికి అజ్ఞేయవాదానికి ఇంగ్లండు చర్చికి ఉన్నంత ప్రాధాన్యం లేనప్పటికీ గౌరవనీయతకు సంబంధించినంత వరకూ దానికి బాప్టిజం (నామకరణ మహోత్సవం) స్థాయి లభించింది. సంశయవాదానికి సాల్వేషన్ ఆర్మీ కంటే ఉన్నత స్థానం లభించిందని ఖచ్చితంగా చెప్పవచ్చు. ఈ దైవ వ్యతిరేకతను, విష పూరితమైన ఈ కొత్త భావాలను ఖండించే వారిలో చాలామందికి ఈ భావాలు విదేశాల్లో పుట్టలేదని అనేక రోజువారీ వస్తువులు తయారైనట్టుగా జర్మనీలో తయారుకాలేదని తెలియదు. అవి నిస్సందేహంగా పూర్వపు ఇంగ్లీష్ వారే సృష్టించిన భావాలని 200 యేళ్లనాడే తాము సాహసించలేనంత దూరం తమ పూర్వీకులు వెళ్లారని తెలియదు. అలా తెలుసుకుంటే కొంత ఊరట చెందగలరని నాకు అనిపిస్తుంది.

నిజానికి అజ్ఞేయవాదం అంటే ఏమిటి ? లాంక్‌షైర్ వాసుల పదాల్లో

చెప్పాలంటే అజ్ఞేయ వాదం అంటే " సిగ్గుపడే" భౌతికవాదమే అజ్ఞేయవాదపు ప్రకృతి భావన మొత్తంగా భౌతికవాద భావనే. ప్రాకృతిక ప్రపంచం అంతా నియమబద్ధం. బయట నుంచి ఏ కార్యాన్ని అది బొత్తిగా ఆమోదించదు. అయితే తెలిసిన విశ్వానికి బాహ్యంగా ఒక అత్యున్నత శక్తి ఉందనడానికి లేదనడానికి మనకు ఎటువంటి ఆధారాలు లేవని మాత్రం అజ్ఞేయవాది జోడిస్తాడు. "మెకానిక్ సెలెస్టే" అనే తన గ్రంధంలో సృష్టికర్తను గురించి ఎందుకు ప్రస్తావించలేదని లాప్లేస్‌ను నెపోలియన్ అడిగితే "నాకు ఆ సిద్ధాంత ప్రతిపాదన అవసరం లేదు" అని ఆయన గర్వంగా సమాధానం చెప్పాడట. ఇప్పుడు విశ్వానికి సంబంధించిన పరిణామ క్రమ భావనలో సృష్టికర్తకుగానీ, పాలకునికి గానీ ఎటువంటి అవకాశమూ లేదు అస్థిత్వంలో ఉన్న ప్రపంచం మొత్తానికి అవల ఒక మహోన్నత శక్తి ఉందనడం పరస్పర విరుద్ధం అవుతుంది. పైగా భక్తుల మనో భావాలను అది ఊరికే అవమానించడమేనని నాకు అనిపిస్తుంది .

మన అజ్ఞేయవాది లాంఛనంగా కొన్ని మేధోపరమైన మినహాయింపులను ప్రకటించిన తర్వాత అతను పచ్చి భౌతికవాదిగా మాట్లాడతాడు, వ్యవహరిస్తాడు. నిజానికి అతడు లోలోపల భౌతికవాదే మనకు తెలిసినంతవరకూ పదార్థమూ, దాని చలనమూ లేదా ఇప్పుడు మనం అంటున్నట్టుగా దాని శక్తీ సృష్టించడానికి, విచ్ఛిన్నం చేయడానికి వీలులేనివి. కాని అవి ఒకనాడు సృష్టించబడ్డాయో లేదో మన దగ్గర రుజువు లేదు అని అజ్ఞేయవాది అనవచ్చు అయితే ఏ ప్రత్యేక విషయంలోనైనా అతని ఒప్పుకోలును అతనికి వ్యతిరేకంగా ఎపయోగించడానికి మీరు ప్రయత్నిస్తే వెంటనే అతను మీతో బేరసారాలకు వస్తాడు. నైరూప్యంగా అతను ఆత్మవాదాన్ని సుసాధ్యమని అంగీకరిస్తే నిర్దిష్టంగా మాత్రం అతని దగ్గర ఏమీ లేదు. మనకు తెలిసినంతవరకూ తెలుసుకోగలిగినంతవరకూ విశ్వాని కంతటికీ ఒక సృష్టికర్తగానీ, ఒక పాలకుడు గానీ లేదని అతను మీకు చెబుతాడు. మనకు సంబంధించినంతవరకూ పదార్థమూ దాని శక్తీ సృష్టించబడలేవు నాశనం చేయబడలేవు . మేధ అన్నది శక్తి ఉండే ఒక విధానం. అది మెదడు నిర్వహించే పని. మనకు తెలిసింది ఏమంటే భౌతిక ప్రపంచం నిశ్చల నియమాలతో శాసించబడుతుంది. ఇటువంటి అంశాలనే సంశయవాది చెబుతాడు ఒక శాస్త్రీయమైన వ్యక్తిగా అతనికి తెలిసిన మేరకు అతడు భౌతికవాది శాస్త్రానికి అవల అతనికి బొత్తిగా తెలియని రంగాల్లో అతడు తన అజ్ఞానాన్ని గ్రీకుగా మార్చి దానికి అజ్ఞేయవాదమని పేరుపెడతాడు.

ఏదిఏమైనప్పటికీ ఒక విషయం మాత్రం స్పష్టం. నేను ఒక అజ్ఞేయవాదినైనప్పటికీ ఈ చిరు గ్రంధంలో నేను రాసిన చారిత్రక భావనను "చారిత్రక అజ్ఞేయవాదం" గా పేర్కొనలేను అలా చేస్తే భక్తులు నన్ను చూసి నవ్వుతారు మమ్ములను

ఎగతాళి చేస్తున్నావా అని . అజ్ఞేయవాదులు కోపంగా నన్ను అడుగుతారు. ప్రధాన చారిత్రక సంఘటనలు అన్నింటికీ అంతిమ కారణమూ, మహా చోదకశక్తీ సమాజ ఆర్థి క అభివృద్ధిలో ఉంటుంది. ఉత్పత్తి మార్పిడి విధానాల మార్పులలోనూ దాని పర్యవసానంగా సమాజం విభిన్న వర్గాలుగా విభజితం కావడంలోనూ ఈ వర్గాలు ఒకదానికొకటి వ్యతిరేకంగా నిర్వహించుకునే పోరాటాలలోనూ ఉంటుంది. ఈ భావననే నేను "చారిత్రక భౌతికవాదం" అని అంటాను. కేవలం ఇంగ్లీష్‌లోనే కాదు మిగిలిన అనేక భాషల్లో కూడా . దీనికి బ్రిటిష్ అతి మర్యాద సైతం అతిగా దిగ్భ్రాంతి చెందదనే ఆశిస్తాను.

-ఏంగెల్స్, సోషలిజం ఊహాజనితమూ, శాస్త్రీయమూ

# 4

# రివిజనిస్టులకు వ్యతిరేకంగా మార్క్సిస్టు భౌతికవాదం

ఈ యేడాది అనేకమంది రచయితలు, మార్క్సిస్టులు కాగలమనుకునేవారు మార్క్సిస్టు తత్వశాస్త్రానికి వ్యతిరేకంగా నిజంగానే ఒక ప్రచారాన్ని ప్రారంభించారు ఆరు నెలలలోగానే కేవలం గతి తార్కిక భౌతికవాదంపై దాడికి అంకితమైన నాలుగు పుస్తకాలు వెలువడ్డాయి. ఇందులో " మార్క్సిస్టు తత్వశాస్త్రం"లో (మార్క్సిస్టు తత్వశాస్త్రానికి వ్యతిరేకంగా అంటే సబబుగా ఉండేది) అధ్యయన వ్యాసాలు అన్న గ్రంథం మొదటిది, ముఖ్యమైనది. ఇది పీటర్స్‌బర్గ్‌లో 1908 లో వెలువడింది. బజరోవ్, బొగ్దనోవ్, లూనా చెరస్కీ, బెర్మన్, హెల్ఫాండ్, యుష్కేవిచ్, సువరోవ్ లు నిర్వహించిన సదస్సు, ఉుష్కేవిచ్ రాసిన భౌతికవాదం, విమర్శనాత్మక వాస్తవ వాదం అనే గ్రంథం, బెర్మన్ రాసిన ఆధునిక జ్ఞాన సిద్ధాంతపు వెలుగులో గతితర్కం అనే గ్రంథం, వాలెంటినోవ్ రాసిన మార్క్సిస్టు తాత్విక సూత్రీకరణలు, ఇవన్నీ కూడా ఈ దాడిలో భాగమే.

మార్క్స్, ఏంగెల్స్‌లు తమ తాత్విక భావాలను గతితార్కిక భౌతికవాదమని అనేక సార్లు పేర్కొన్నారన్న సంగతి వీళ్లందరికీ తెలియకుండా ఉండదు. అయినప్పటికీ తమలో తమకు తీవ్రమైన రాజకీయ బేదాభిప్రాయలు ఉన్నప్పటికీ వీరంతా గతితార్కిక భౌతిక వాదానికి వ్యతిరేకంగా ఏకమయ్యారు పైగా తాత్వికంగా తాము మార్క్సిస్టులమేనని చెప్పుకున్నారు. ఏంగెల్స్ గతితర్కం "మాయావాదం" అని బెర్మన్ అంటాడు. ఏంగెల్స్ భావాలు "కాలం చెల్లిపోయాయి" అని బజరోవ్ చాలా యాదాలాపంగా అంటాడు, అదేదో స్వయం విదితమైన వాస్తవంలాగా. ఆ రకంగా మన మహా వీరులు భౌతికవాదాన్ని తప్పు అని రుజువు చేసేసినట్టే కనిపిస్తుంది. వారు ఈ పనిలో "ఆధునిక జ్ఞాన సిద్ధాంతం", "ఇటీవలి తత్వశాస్త్రం" ( లేదా "ఇటీవలి రూఢివాదం") , "ఆధునిక ప్రకృతి తత్వశాస్త్రం", "20 వ శతాబ్దపు ప్రకృతి తత్వశాస్త్రం" తో సహా ఆసరా తీసుకున్నట్టు కనిపించారు. ఇటీవలి సిద్ధాంతాలనబడే వీటి ఆసరాతో మన ఈ గతితార్కిక భౌతిక[illegible] విధ్వంసకులు [illegible] లేకుండా సరాసరి ఫైడీయిజానికి (విశ్వాస వాదానికి) [illegible]కున్నారు. ఈ విషయ[illegible]

A.C. No. 393

లూనా చెరస్కీ స్పష్టమైన ఉదాహరణ. అయితే ఆయన ఒక్కడే కాదు (తాత్విక మత సంబంధమైన విషయాల్లో హేతుబద్ధతకంటే విశ్వాసానికే ప్రాధాన్యం ఇచ్చే సిద్ధాంత ధోరణిని ఫైడీయిజం అంటారు-సం.) అయితే మార్క్స్, ఏంగెల్స్ ల వ్యవహారంలో తమ వైఖరిని స్పష్టంగా నిర్వచించాల్సి వచ్చేసరికి మాత్రం వారి ధైర్యమూ, వారికి తమ విశ్వాసాలపైన ఉన్న గౌరవమూ మటుమాయమైపోయాయి. ఆచరణలో గతితార్కిక భౌతికవాదాన్ని అనగా మార్క్సిజాన్ని పూర్తిగా పరిత్యజించడం మాటలలో అనంతమైన డొంక తిరుగుళ్లు ప్రశ్న సారాంశాన్ని దాటవేయుడాలు, వారి తిరోగమనాన్ని దాచుకోవడానికిగాను భౌతికవాదానికి బదులు ఎవరోఒక భౌతికవాదిని నిలబెట్టడం, మార్క్స్, ఏంగెల్స్‌ల అసంఖ్యాకమైన భౌతికవాద ప్రకటనలను ప్రత్యక్షంగా విశ్లేషించడానికి తిరస్కరించడంలో కృతనిశ్చయమూ-ఇవీ లక్షణాలు. దీనినంతటినీ "తమ సొంత మోకాళ్ల మీదే తిరుగుబాటు" అని ఒక మార్క్సిస్టు చక్కగా వర్ణించాడు. ఇది తాత్విక రివిజనిజానికి ఒక నమూనా. రివిజనిస్టులే మార్క్సిస్టు మౌలిక భావాల నుండి వైదొలగుతూనే భయం వల్లనో, అశక్తత వల్లనో తాము విడనాడిన ఆ భావాలను బహిరంగంగా, స్పష్టంగా కృతనిశ్చయంతో ఎదుర్కోరు ఉదాహరణకు కొన్ని చారిత్రక ప్రతిపాదనల విషయంలో మెహరింగ్ వ్యతిరేకించినట్టుగా మార్క్స్ భావాలలో కాలం చెల్లినవాటికి వ్యతిరేకంగా ప్రకటించాల్సి వచ్చినప్పుడు గతంలో సంప్రదాయక మార్క్సిస్టులు సమగ్రంగానూ, ఖచ్చితంగానూ ఆ పనిని నిర్వహించారు అటువంటి ప్రకటనలలో అస్పష్టత అనేది ఎవరికీ కనిపించలేదు.

మార్క్సిస్టు తత్వశాస్త్రం "లో" అధ్యయన వ్యాసాలు అనే దానిలో సత్యాన్ని పోలిన ఒక వాక్యం ఉంది. ఇది లూనా చెరస్కీ వ్యాఖ్య . "బహుశా మేము ( ఈ అధ్యయన వ్యాసాలలో జమకూడిన వాళ్లంతా అన్నది స్పష్టం) దారి తప్పి ఉండవచ్చు. కాని మేము సత్యాన్వేషకులం ( పేజీ 161) ఈ వాక్యంలో మొదటి భాగం సంపూర్ణ సత్యం. రెండో భాగం సాపేక్ష సత్యం ఈ విషయాన్ని నా గ్రంథంలో సందర్భసహిత ఉదాహరణలతో రుజువు చేయడానికి ప్రయత్నిస్తాను ప్రస్తుతానికి ఒక మాట మార్క్సిజం పేరుతో గాక "అన్వేషకులైన" మార్క్సిస్టులుగా తమను తాము పిలుచుకుని ఉంటే మన ఈ తాత్వికులు మార్క్సిజాన్ని మాత్రమే గాక తమను తాము కూడా గౌరవించుకున్నట్టు అయ్యేది. నా మట్టుకు నేను కూడా తత్వశాస్త్రంలో ఒక "అన్వేషి"నే. మార్క్సిజం ముసుగులో నమ్మలేనంత గందరగోళాన్ని, తిరోగమనాన్ని ప్రవేశపెడుతున్న వారిని అడ్డుకోగల సాధనం కోసం అన్వేషించడమే ఈ గ్రంథంలో నా లక్ష్యం

**లెనిన్ భౌతికవాదమూ, అనుభవగత విమర్శనమూ (1908)**

# 5

# బర్క్లీ మొదలుకుని మాకియన్ల వరకూ భౌతికవాదాన్ని తప్పుబట్టేవారే

సమకాలీన తత్వశాస్త్ర (లేదా దైవవాద) ప్రొఫెసర్‌లలో ప్రత్యక్షంగానో, పరోక్షంగానో భౌతికవాదాన్ని తప్పు అని రుజువు చేయడానికి ప్రయత్నించని వారు ఒక్కరు కూడా ఉండరు. ఈ విషయం తాత్విక సాహిత్యంతో పరిచయం ఉన్న ప్రతి ఒక్కరికీ తెలిసిందే. భౌతికవాదం తప్పు అని రుజువైంది అని వారు వెయ్యిసార్లు ప్రకటించారు. అయినా వెయ్యిన్నొకటోసారి దానిని తప్పు అని రుజువు చేయడానికి తంటాలుపడుతూనే ఉన్నారు. మన రివిజనిస్టులంతా భౌతికవాదాన్ని తప్పు అని చెప్పడానికి కృషి చేస్తున్నారు. అయితే భౌతికవాది ఏంగెల్స్‌ను, భౌతికవాది ఫ్యూయర్ బాక్‌ను , డీజెన్ భౌతికవాద భావాలను గాక కేవలం భౌతికవాది ప్లెకనోవ్‌ను మాత్రమే తాము తప్పు అంటున్నట్టుగా వారు నటిస్తున్నారు. పైగా వారు ఆ పనిని " ఇటీవలి", "ఆధునిక" రూఢివాదం, ప్రకృతి శాస్త్రం మొదలైనవాటి దృక్పథంతో నిర్వహిస్తున్నామని అంటున్నారు.....

భౌతికవాదులు ఏదో ఊహించలేనిదానిని, తెలుసుకోలేని దానిని," స్వయంభూ వస్తువులను" , "అనుభవానికి బాహ్యంగానూ" , జ్ఞానానికి బాహ్యంగానూ ఉండే పదార్థాన్ని గుర్తిస్తారు అని వారు ప్రవచించారు

"అనుభవ", జ్ఞాన పరిధులకు ఆవల దేనినో ఒకదానిని గుర్తించడం ద్వారా అసలైన మాయావాదంలో పడతారని వారు అంటారు. పదార్థం మన ఇంద్రియాలపై పనిచేసినప్పుడు అది ఇంద్రియానుభూతులను కలిగిస్తుంది. కాని భౌతికవాదులు మాత్రం ఒక పక్కన ఇంద్రియానుభూతులే జ్ఞానాని కున్న ఏకైక మూలాధారమని అంటూనే ఏదో "తెలియని" శూన్యాన్ని తమ ప్రాతిపదికగా తీసుకుంటారు. ఆ రకంగా భౌతికవాదులు ( "స్వయంభూ వస్తువులను" అనగా మన చైతన్యానికి బాహ్యంగా ఉన్న వస్తువుల అస్థిత్వాన్ని గుర్తించడం ద్వారా ప్లెఖనోవ్ లాంటివారు) కాంట్ వాదంలో కూరుకుపోతారు

భౌతికవాదులు కనిపించే వాటికి బాహ్యంగా స్వయంభూ వస్తువులు ఉంటాయనీ, ఇంద్రియాలు సమకూర్చే తక్షణ సమాచారానికి ఆవల మరేదోఒక పూజా విగ్రహం, ఒక "మూర్తి " , ఒక సంపూర్ణ అదిభౌతికవాద మూలాధారం, మతానికి ఒక నకలు ( దీనినే బజరోవ్ "పవిత్ర పదార్థం" అంటాడు) ఉందంటారు.

భౌతికవాదానికి వ్యతిరేకంగా మాకియన్లు లేవనెత్తిన వాదనలు ఇవి. వారు అనేక రాగాలలో పదే పదే వాటిని ఆలపించారు.

ఈ వాదనలు కొత్తవేనా? కాంట్ వాదనలో కూరుకుపోయిన ఒక రష్యన్ భౌతికవాదికి వ్యతిరేకంగానే ఇవన్నీ ఉద్దేశించబడినాయా ? అన్న ప్రశ్నలను పరిశీలించడం కోసం ఒక పాత భావవాది జార్జ్ బర్కిలీ రచనల నుండి వివరంగా ఉల్లేఖిస్తాను. ఈ చారిత్రక దర్యాప్తు మా వ్యాఖ్యలకు ముందుమాటలో మరింత అవసరం. ఎందుకంటే తర్వాత బర్కిలీని, అతని తాత్విక ధోరణిని ప్రస్తావించాల్సి ఉంది. మాక్‌కీ, బర్కిలీకీ ఉన్న సంబంధాన్నీ, బర్కిలీ తాత్విక ధోరణి సారాంశాన్నీ మాక్ వాదులు అపసవ్యంగా ప్రదర్శించారు

"మానవ జ్ఞాన సూత్రాల గురించిన గ్రంధాన్ని" ఈ బిషప్ జార్జ్ బర్కిలీ 1710 లో ప్రచురించాడు. అది ఈ కింది వాదనతో ప్రారంభమైంది.

"మానవ జ్ఞాన వస్తువులను పరిశీలించిన ఎవరికైనా ఒక విషయం స్పష్టం అవుతుంది. అవి ఇంద్రియాలపైన వాస్తవంగా ముద్రితమైన భావాలైనా అయివుంటాయి లేదా మనసుని ఉద్వేగాలకు, చర్యలకు గురిచేస్తూ మనసు చేత గ్రహింపబడేవైనా అయివుండాలి. లేదా తుదకు జ్ఞాపకం వల్ల, ఊహ వల్ల ఏర్పడిన భావాలైనా అయివుండాలి .. దృష్టిద్వారా వివిధ డిగ్రీలలో వైవిధ్యాలతో, నాకు కాంతి, రంగుల గురించిన భావాలు కలుగుతాయి. స్పర్శ ద్వారా నేను గట్టితనాన్ని, మెత్తదనాన్ని, వేడిని, చలిని, చలనాన్ని, ప్రతిఘటనను గ్రహిస్తాను .. ఘ్రాణ శక్తి నాకు వాసనలు సమకూరుస్తుంది అంగుటి వల్ల రుచులు తెలుస్తాయి. నా వినికిడిజ్ఞానం శబ్దాలను తెలియజేస్తుంది.. .

వీటిలో చాలా అంశాలు ఒకదానితో మరొకటి కలసి ఉండడం వల్ల అవన్నీ ఒక పేరుతో పిలవబడతాయి. అవి ఒక విషయంగా పేరుబడ్డాయి. ఒక నిర్దిష్ట రంగు, రుచి, వాసన, ఆకారం, నికరత్వం కలసి పరిశీలించబడి ఒక ప్రత్యేక వస్తువుగా పరిగణించబడి యాపిల్ అనే పేరుతో గుర్తించబడుతుంది. అలాగే ఇతర భావాల సంపుటులు ఒక రాయి, ఒక చెట్టు, ఒక పుస్తకంలాంటి ఇంద్రియానుగత వస్తువులుగా ఏర్పడతాయి..." (ఒకటో అధ్యాయం)

బర్కిలీ రాసిన గ్రంథంలోని మొదటి విభాగపు సారాంశం ఇది.

గట్టితనం, మెత్తదనం, వేడి, చల్లదనం, రంగులు, రుచులు, వాసనలు మొదలైన వాటిని పునాదిగా బర్కిలీ గ్రహిస్తున్నాడు అన్నది మనం ఇక్కడ గుర్తుంచుకోవాలి. వస్తువులు అంటే బర్కిలీ దృష్టిలో "భావాల సంపుటాలు". ఈ వ్యక్తీకరణ పేర్కొంటున్నది ఇంతకుముందు చెప్పిన లక్షణాలను లేదా ఇంద్రియానుభూతులను తప్ప నైరూప్య ఆలోచనలను కాదు.

ఈ "భావాలు లేదా జ్ఞాన వస్తువులు" మాత్రమే గాక వాటిని పరిగ్రహించే "మనసు, ఆత్మ లేదా నేను" అనేవి కూడా ఉంటాయని బర్కిలీ అంటాడు. ( రెండో అధ్యాయం) "భావాలు దానిని పరిగ్రహించే మనసుకు బాహ్యంగా ఉండలేవన్నది స్వయం విదితం" అని బర్కిలీ నిర్ధారిస్తాడు. ఈ విషయాన్ని మనం అంగీకరించాలంటే "ఉండడం" అన్న ఒక మాట అర్థాన్ని పరిగణిస్తే సరిపోతుంది.

"నేను రాసుకునే బల్లను నేను చూస్తాను, ముట్టుకుంటాను కనుక ఉంది అంటాను. నేను నా గది బయట ఉన్నప్పుడు బల్ల ఉండింది అంటాను. అంటే నేను గదిలో ఉండిఉంటే నేను దానిని గ్రహించి ఉండేవాడిని అని అర్థం" మూడో అధ్యాయంలో బర్కిలీ చెప్పే మాట అది. ఆ తర్వాత ఆయన భౌతికవాదులు అని తాను పిలిచే వారితో వాదనకు పూనుకుంటాడు. (18, 19 అధ్యాయాలు)

"వస్తువులను ఎవరో ఒకరు గ్రహిస్తున్నారు అన్న దానితో ప్రమేయం లేకుండా నిరపేక్షంగా ఉంటాయని చెప్పడం ఎలా సాధ్యమో నేను ఊహించలేకపోతున్నాను. ఉండడం అంటే గ్రహింపబడడమే" (తత్వశాస్త్ర చరిత్ర గ్రంథాల్లో 'ఉండడం అంటే పరిగ్రహించబడడమే' అనే ఈ బర్కిలీ సూక్తి ఉల్లేఖించబడుతుంది )

"అవగాహనతో పరిగ్రహించబడడంతో ప్రమేయం లేకుండా ఇళ్లు, పర్వతాలు, నదులు ఒక్కమాటలో చెప్పాలంటే ఇంద్రియానుగత వస్తువులన్నింటికీ సహజమైన లేదా వాస్తవమైన అస్తిత్వం ఉంది అనే అభిప్రాయం వింతగా మనుషుల్లో ఉంది". (నాలుగో అధ్యాయం)

ఈ అభిప్రాయాన్ని "స్పష్టమైన వైరుధ్యం" అంటాడు బర్కిలీ. 'పైన పేర్కొన్న వస్తువులు ఏమిటి ? మనం ఇంద్రియాలతో గ్రహించే అంశాలే గదా. మన భావాలను, ఇంద్రియానుభూతులను తప్ప ఇంకేం గ్రహించగలం ? వీటిలో ఏదైనా లేదా వీటి కలయిక ఏదైనా మన ఇంద్రియాలతో పరిగ్రహించబడకుండా అస్తిత్వంలో ఉండడమన్నది రోత వ్యవహారం కాదూ!' ( నాలుగో అధ్యాయం).

'భావాల సంపుటాలు' అనే వ్యక్తీకరణ స్థానంలో 'ఇంద్రియానుభూతుల సమ్మేళనం' అనే వ్యక్తీకరణను బర్కిలీ ప్రవేశపెడతాడు. ఆయన దృష్టిలో ఈ రెండూ సమానార్థకాలే. ఈ సంకీర్ణానికి అనగా ఈ ఇంద్రియానుభూతుల సమ్మేళనానికి ఏదో ఒక మూలాధారాన్ని వెతుకులాడుతూ ముందుకు పోయే ఈ 'అసంబద్ధ' ధోరణిని కలిగి ఉన్నందుకు భౌతికవాదులను ఆయన నిందిస్తాడు. అయిదో అధ్యాయంలో ఒక నైరూప్య అంశంతో కాలయాపన చేస్తున్నందుకు, ఇంద్రియానుభూతిని వస్తువు నుంచి వేరు చేస్తున్నందుకు ఆయన భౌతికవాదులను నిందిస్తాడు. అలా వేరు చేయడం అర్థరహితం అని ఆయన ఉద్దేశం. అయిదో అధ్యాయం చివరిలో ఆయన ఇలా అంటాడు ' నిజానికి వస్తువు, ఇంద్రియానుభూతి ఒకటే. ఒకదాని నుంచి మరోటి వేరు చేయబడజాలవు' ఈ వాక్యాన్ని రెండో ప్రతిలో తొలగించారు. బర్కిలీ ఇంకా ఇలా అంటాడు

మనసు లేకుండా భావాలు ఉండనప్పటికీ వాటిలాంటి వస్తువులు ఉండొచ్చునని మీరు అంటారు. ఆ వస్తువులకు భావాలు నకళ్లని వాటిని పోలి ఉంటాయని మనసు లేకుండానే వస్తువులు ఉంటాయని ఆలోచనారహితమైన పదార్థం ఉంటుందని మీరు అంటారు కాని ఒక భావం తప్ప మరేదీ కాదని నేను అంటాను. ఒక రంగు, ఒక ఆకారం అవే రంగు , ఆకారాలు తప్ప మరేమీ కావు.. . మీరు అంటున్న మూలాలకు లేదా బాహ్య వస్తువులకు మన భావాలు రూప చిత్రాలని, ప్రతినిధులని మీరు అంటున్నారు. అయితే అవి గ్రహింపబడుతున్నవా లేవా అని నేను అడుగుతున్నాను. అవి గ్రహింపబడినట్లయితే అవి భావాలే కనుక మా మాట రుజువైంది అవి గ్రహింపబడడం లేదని మీరంటే అప్పుడు ఒక రంగు కనిపించనిదానిలా ఉంటుందనడంలోనూ, గట్టితనం లేదా మెత్తదనంలాంటి అభౌతికమైన ఇతర అంశాలు ఉన్నాయనడంలోనూ అర్థం ఉందా అని నేను అడుగుతాను'. ( ఎనిమిదో అధ్యాయం)

వస్తువులు మనపై ఎటువంటి చర్యను కలిగించకుండా ఉంటాయా అని ప్లెఖనోవ్‌కి వ్యతిరేకంగా బజరోవ్ వాదించాడు. ఈ వాదనలు పేరూఊరూ లేకుండా స్థూలంగా భౌతికవాదులకు వ్యతిరేకంగా బర్కిలీ చేసిన వాదనలకు భిన్నంగా లేవని పారకుడు గ్రహిస్తాడు. 'పదార్థం లేదా ఒక భౌతిక వస్తువు' ఉందన్న భావన ఎంత 'అసంబద్ధమూ', 'వైరుధ్యభరితమూ' అని బర్కిలీ భావించాడంటే వాటిని బహిర్గతం చేయడంలో సమయాన్ని వృధా చేయడం అనవసరం అని ఆయన అనుకున్నాడు ఆయన ఇలా అంటాడు

'తాత్వికుల మనసులలో పదార్థం ఉంది అన్న సూత్రం లోతుగా వేళ్లూనుకుంది. ఇది అనేక దుష్పరిణామాలకు దారితీస్తుంది నేను ఆలోచనాంతరంగుడిని అవుతాను విసుగుపుట్టించినప్పటికీ ఒక్క ఆలోచనను కూడా నేను తొలగించను. ఆ ఒక్క ఆలోచన

పై దురభిప్రాయాన్ని సంపూర్ణంగా ఆవిష్కరించవచ్చు అంతం కూడా చేయవచ్చు' (తొమ్మిదో అధ్యాయం)

బర్కిలీ పేర్కొంటున్న ఆ 'దుష్పరిణామా'లేమిటో చూద్దాం. భౌతికవాదులకు వ్యతిరేకంగా ఆయన చేసిన సైద్ధాంతిక వాదనల సంగతిని ముందు తేలుద్దాం. వస్తువుల 'నిరపేక్ష' అస్తిత్వాన్ని ఆయన తిరస్కరించాడు అంటే మానవ జ్ఞానానికి ఆవల వస్తువులు ఉంటాయన్నదాన్ని ఆయన నిరాకరించాడు. తన శత్రువుల భావాలను ఆయన నిందిస్తూ 'స్వయంభూ వస్తువు' ని వారు గుర్తించారన్నట్టుగా ప్రదర్శించాడు. 24 వ అధ్యాయంలో తాను వ్యతిరేకిస్తున్న అభిప్రాయాన్ని ఆయన ఇలా పేర్కొన్నాడు. అది (భౌతికవాదం) 'ఇంద్రియగ్రాహ్య వస్తువులు తమంత తాముగా మనసు ఆసరా లేకుండా నిరపేక్షంగా ఉండగలవని గుర్తిస్తుంది' ( పైన పేర్కొన్న గ్రంథంలో పేజీలు :167-68 ) ఇక్కడ రెండు తాత్విక దృక్పథాల ప్రాథమిక ధోరణులు సూటిగా, స్పష్టంగా, ఖచ్చితంగా చిత్రించబడ్డాయి మన కాలపు 'కొత్త' వ్యవస్థల సృష్టికర్తలకు సంప్రదాయక తాత్వికులకు మధ్య ఉన్న తేడా ఇదే.

'స్వయంభూ వస్తువులను' మనసుకు ఆవల ఉండే వస్తువులను గుర్తించడమే భౌతికవాదం. భావాలు ఇంద్రియానుభూతులు ఈ వస్తువులకు నకళ్లు లేదా ప్రతిబింబాలు అని అది అంటుంది. 'మనసు లేకుండా' వస్తువులు ఉండవు అనీ, ఇంద్రియానుభూతుల సమ్మేళనాలే వస్తువులు అనీ దానికి వ్యతిరేకమైన సిద్ధాంతం (భావవాదం) చెబుతుంది. ఇమ్మాన్యువల్ కాంట్ పుట్టడానికి 14 యేళ్ల ముందు 1710 లో బర్కిలీ ఈ గ్రంథం రాశాడు అయితే 'స్వయంభూ వస్తువుల'ను గుర్తించడమన్నది భౌతికవాదానికి అంటుకున్న కాంట్ వాద జాడ్యమని 'ఇటీవల' తత్వశాస్త్రం అనబడే దాని ప్రాతిపదికతో మన మాక్ వాదులు కొత్తగా ఆవిష్కరించారు. మాక్ వాదుల 'ఈ సరికొత్త' ఆవిష్కరణలు ప్రాథమిక తాత్విక ధోరణుల చరిత్ర తెలియకపోవడం అనే వింత అజ్ఞానం నుంచి తలెత్తిన ఫలితాలు.

వారి మరో 'సరికొత్త' ఆలోచన ఇలా సాగుతుంది: 'పదార్థమూ' లేదా 'వస్తువు' అనే భావనలు పాత విమర్శనారహిత భావాల అవశేషాలు. మాక్, అవనేరియస్ తాత్విక ఆలోచనను పురోగమింపజేశారు. విశ్లేషణకు మరింత లోతు కల్పించారు. ఈ 'నిరపేక్ష' 'పరివర్తనారహిత అస్తిత్వాలు' వగైరాలను తొలగించారు. ఇటువంటి ప్రకటనలను మూల గ్రంథాలతో పోల్చి చూడాలని మీకనిపిస్తే మీరు బర్కిలీ రాసిన పై గ్రంథాన్ని చదవండి. అవి నటనల మారి కల్పనలని మీరు గ్రహిస్తారు. పదార్థాన్ని 'అస్తిత్వ రహితం' అనీ పదార్థం అంటే 'శూన్యం' అనీ బర్కిలీ చాలా నిర్దిష్టంగా చెబుతాడు. 'కావాలనుకుంటే మీరు శూన్యమనే పదాన్ని ఇతరులు ఏ అర్థంలో వాడతారో పదార్థం అనే పదాన్ని

కూడా  అదే విధంగా వాడుకోవచ్చు  అని భౌతికవాదులను ఆయన ఎగతాళి చేస్తాడు. ప్రారంభంలో రంగులు, వాసన తదితరాలు 'వాస్తవంగా  ఉన్నాయని' నమ్మారని  అయితే ఆ తర్వాత కాలంలో అటువంటి దృక్పధాలు త్యజించబడ్డాయని అవి మన ఇంద్రియాల పైన ఆధారపడి మాత్రమే ఉండగలవని తెలిసిందని బర్కిలీ అంటాడు అయితే ఈ పాత పొరపాటు భావనల అంతం ఇంకా పూర్తికాలేదు. వాటి అవశేషమే 'పదార్థ అంశమన్న' భావన. అది కూడా 'దురభిప్రాయమే'. 1710 లో బిషప్ బర్కిలీ దాన్ని చివరగా బహిర్గతం చేశాడు! 1908 లో మళ్లీ ఈ 'అధి భౌతికవాద' దురభిప్రాయాలను అంతిమంగా అంతం చేయడంలో అవెనేరియస్, పెట్జోల్ట్, మాక్ తదితరులు సఫలీకృతులయ్యారని నమ్మే హాస్యగాళ్లు ఉన్నారు. వారు తమ  ఈ  వాదానికి 'ఇటీవలి రూఢివాదం' అని, 'ఇటీవలి ప్రకృతి శాస్త్రం'  అని  పేరు పెట్టుకున్నారు.

చైతన్యానికి అవల ఉండే వస్తువులను మానవ చైతన్యం ఏదో ఒక విధంగా 'ప్రతిబింబిస్తుందని' చెప్పే భౌతికవాదుల సిద్ధాంతం శాశ్వతంగా తప్పు అని రుజువైంది 'ప్రపంచాన్ని నకలు చేయడం' అనే వారి పొరపాటును ఈ సరికొత్త తత్వశాస్త్రమే సరిచేసిందని తమ పాఠకులకు బొగ్దనోవ్‌తో సహా ఈ హాస్యగాళ్లు హామీ ఇస్తున్నారు. ఈ నకలు చేయడం గురించి పైన చెప్పిన రచయితలు గంపల కొద్దీ సెంటిమెంటల్ పదజాలాన్ని గుమ్మరించారు. అయితే విస్మృతి వల్లనో, అజ్ఞానం వల్లనో వారు ఈ కొత్త ఆవిష్కరణలను 1710 లోనే బర్కిలీ ఆవిష్కరించాడన్న సంగతిని చెప్పడంలో విఫలమయ్యారు. బర్కిలీ ఇలా అంటాడు:

వీటి గురించి ( అంటే భావాలు లేదా వస్తువుల గురించి ) మనకి పరిజ్ఞానం లేదు. ఉన్నది గందరగోళం. ఒకటి, మనసులో ఉన్న సులభగ్రాహ్య అంశమూ, రెండోది, మనసుతో ప్రమేయం లేకుండా ( అనగా చైతన్యానికి బాహ్యంగా ) ఉన్న వాస్తవ అంశమూ– ఈ రకంగా ఇంద్రియానుగత వస్తువులను రెండింతలుగా ఉన్నాయని భావించడం వల్ల చాలా ప్రమాదకరమైన పొరపాట్లకు మనం గురవుతాం. ( 86 వ అధ్యాయం)

ఊహాతీతమైనదాన్ని ఊహించ సాధ్యమని చెప్పే ఈ 'అసంబద్ధ' భావనను బర్కిలీ ఎగతాళి చేస్తాడు. వస్తువులకూ , భావాలకూ తేడా ఉందని భావించడంలోనే ...బాహ్య వస్తువులు ఉన్నాయనే భావనలోనే ఈ అసంబద్ధతకు మూలముంది అంటాడాయన. (87 వ అధ్యాయం). 1710 లో  బర్కిలీ ఆవిష్కరించిన ఈ మూలాన్నే 1908 లో బొగ్దనోవ్ పునరావిష్కరించాడు. ఈ మూలమే రాళ్లనూ రప్పలనూ కొలిచేలా చేస్తుందన్న మాట !

'పదార్థమూ  లేదా  ఇంద్రియగ్రాహ్యం  కాని  వస్తువులూ నాస్తికులకూ, విధి

వాదులకూ ప్రధాన ఆధారం. అంతేగాక వివిధ రూపాలలో విగ్రహ పూజ కూడా ఇదే సూత్రంపైన ఆధారపడుతుంది అని బర్కిలీ అంటాడు. ( 94 వ అధ్యాయం) ఒక బాహ్య ప్రపంచం ఉంది అన్న 'అసంబద్ధ' సిద్ధాంతం నుంచి 'చెడు పర్యవసానాల'కు మనం ఇప్పుడు చేరుకుంటాం. ఈ సిద్ధాంతాన్ని తప్పు అని సైద్ధాంతికంగా రుజువు చేయడమే గాక ఈ సిద్ధాంతాన్ని నమ్మేవారిని శత్రువులుగా భావించి శిక్షించాల్సి ఉందని బిషప్ బర్కిలీ ఉద్వేగంతో విజ్ఞప్తి చేశాడు.

'పదార్థమూ భౌతిక అంశాల సిద్ధాంతమే సంశయవాదానికి ఆధారమూ, ప్రధాన మూలస్తంభమనీ మేము ఇంతకుముందు రుజువు చేశాం. అలాగే అదే మూలాధారం. నాస్తికవాదం మతరాహిత్యాల అపవిత్ర పథకాలు తలెత్తడానికి మూలాధారం.... 'భౌతిక పదార్థం' అన్నది అన్ని యుగాలలోనూ నాస్తికవాదులకు ఎంతటి గొప్ప స్నేహితుడో వివరించాల్సిన పనిలేదు. వారి పైశాచిక వ్యవస్థలన్నీ స్పష్టంగా అత్యవసరంగా దానిపైన ఆధారపడి ఉన్నాయి. ఈ మూల స్తంభాన్ని ఒకసారి ఊడబెరకగలిగితే మొత్తం భవంతి కుప్పకూలక తప్పదు. నాస్తికుల ప్రతి ఘోరమైన అసంబద్ధతను ప్రత్యేకించి పరిశీలించాల్సిన అవసరం అటుపిమ్మట ఉండదు. ( 92 వ అధ్యాయం)

'ప్రకృతి నుంచి పదార్థాన్ని బహిష్కరిస్తే దానితోపాటు ఎన్నో సంశయవాద అపవిత్ర భావాలను, నమ్మశక్యం కానంత అసంఖ్యాకంగా ఉన్న వాదవివాదాలను, చిక్కు ప్రశ్నలను ఈడ్చుకుపోతుంది. (70 లలో మాక్ ఆవిష్కరించిన 'ఆలోచనలలో పొదుపు సూత్రం' , అలాగే 1876 లో అవెనేరియస్ ఆవిష్కరించిన 'కనీస కృషి వ్యయం అనే సూత్రం ప్రకారం ప్రపంచ భావనగా తత్వశాస్త్రం' అనేవి గమనార్హాలు.) ఇవి దైవికుల, తాత్వికుల పక్కల్లో బల్లేలుగా ఉన్నాయి. మానవ జాతి ఎనలేని నిష్ఫల కృషికి కారణాలు అయ్యాయి. ఇక్కడ మేము చేసిన వాదనలు పదార్థ మూల వాదనలను తప్పు అని రుజువు చేయడంలో సఫలీకృతం కాకుంటే ( సఫలీకృతం అనే నేను భావిస్తున్నాను) మాత్రం జ్ఞానానికి, శాంతికి, మతానికి ఉన్న మిత్రులంతా అవి సఫలీకృతం అయినట్టుగానే భావిస్తారని నేను గట్టిగా నమ్ముతున్నాను. ( 96 వ అధ్యాయం)

నిర్మొహమాటంగా, బండగా వాదించాడు బిషప్ బర్కిలీ. 'పదార్థాన్ని' తత్వశాస్త్రం నుంచి 'పొదుపు'గా తొలగించే ఈ ఆలోచనలే మన కాలంలో మరింత వంచనా రూపం తగిలించుకుని వచ్చాయి. అమాయకులు ఈ ఆలోచనలను 'ఇటీవలి' తత్వశాస్త్రం అనుకునే విధంగా, 'కొత్త' పదజాలాన్ని ఉపయోగించడం ద్వారా, అవి గందరగోళ పర్చుతున్నాయి.

అయితే బర్కిలీ మాత్రం తన తాత్విక ధోరణుల విషయంలో నిష్కపటంగా ఉన్నాడు. తన తాత్వికతకు ఉన్న భావవాద దిగంబరత్వాన్ని కప్పుకోవడానికి మాత్రం ఆయన ప్రయత్నించాడు. అసంబద్ధతల నుంచి విముక్తమయినట్టుగానూ 'వ్యవహార జ్ఞానాని'కి అమోదయోగ్యం గానూ దానిని ప్రదర్శించడానికి ప్రయత్నించాడు. ఇవాళ ఆత్మాశ్రయ భావవాదమని స్వీయవాదమని పిలవబడుతున్న నిందారోపణల నుంచి తనను తాను రక్షించుకోవడానికి సద్యోజనితంగా ప్రయత్నించాడు. తన తత్వశాస్త్రం వల్ల ప్రకృతిలో ఏ వస్తువూ కొరవడదని ఆయన అన్నాడు. ( 34 వ అధ్యాయం) 'ప్రకృతి ఉంటుంది. వాస్తవాలకు, ఎండమావులకు మధ్య తేడా ఉంటుంది. కాకపోతే అవి రెండూ సమానంగా మనసులో ఉంటాయి' . (34 వ అధ్యాయం)

మనం ఇంద్రియాలతోకానీ, ఆలోచనతో కానీ గ్రహించబడే ఏ వస్తువు అస్తిత్వానికీ వ్యతిరేకంగా నేను వాదించను. నేను నా కళ్లతో చూసే వస్తువులు, నా చేతితో స్పర్శించే వస్తువులు నిజంగానే ఉంటాయి. దానిని నేను ఏ మాత్రం ప్రశ్నించను. తాత్వికులు (ఇటాలిక్స్ బర్కిలీవి) పదార్థమని లేదా భౌతిక వస్తువని పిలిచే దాని అస్తిత్వాన్ని మాత్రమే నేను తిరస్కరిస్తాను. మిగతా మానవ ప్రపంచానికి దీని వల్ల ఏమాత్రం నష్టం జరగదు. మానవ జాతి ఏమీ కోల్పోదని నేను ధైర్యంగా చెప్పగలను. నాస్తికుడు నిజానికి తన అపవిత్రతను సమర్థించుకోవడానికి ఒక ఖాళీ 'పేరుకి రంగును కోరతాడు'. (35వ అధ్యాయం)

37 వ అధ్యాయంలో ఈ ఆలోచన మరింత స్పష్టంగా కనిపిస్తుంది. భౌతిక వస్తువును తన తత్వశాస్త్రం నాశనం చేస్తుంది అన్న ఆరోపణకు ఆయన ఇలా బదులు చెప్పాడు.

'.... పదార్థాంశం అన్న పదాన్ని అతి సామాన్య అర్థంలో విస్తరణ, ఘనం, బరువులాంటి ఇంద్రియానుగత లక్షణాల సమ్మేళనంగా పరిగ్రహిస్తే ఈ అర్థాన్ని మేము అంతం చేయడం లేదు. ఒకవేళ దానిని తాత్విక అర్థంలో యాదృచ్ఛిక ఘటనలను, మస్తిష్కంతో ప్రమేయంలేని లక్షణాలను సమర్థించడానికి ఉపయోగించినట్టయితే దానిని నేను తొలగిస్తానని అంగీకరిస్తాను. అసలు ఊహల్లో సైతం అస్తిత్వం లేనిదానిని తొలగిస్తున్నావు అని ఆరోపిస్తే దానిని నేను ఆమోదిస్తాను' .

భావవాది అయిన ఇంగ్లీష్ తత్వవేత్త రేజర్, బర్కిలీ సిద్ధాంతానికి అనుయాయుడు. బర్కిలీ రచనలకు ఆయన సంపాదకత్వం వహించాడు. వాటికి తన సందర్భసహిత వ్యాఖ్యలు చేర్చాడు. ఆయన బర్కిలీ సిద్ధాంతాన్ని 'ప్రాకృతిక వాస్తవ వాదం' అనే పేరుతో పిలిచాడు. ఇది అకారణంగా కాదు. వినోదభరితమైన ఈ పదజాలాన్ని గమనించాల్సి ఉంది. నిజానికి వాస్తవ వాదానికి నకిలీని సృష్టించాలన్న బర్కిలీ ఉద్దేశాన్ని ఇది బయటపెడుతుంది. 'ఇటీవలి

రూఢివాదులు' తరచుగా ఇదే వ్యూహాన్ని లేదా నకిలీ వాదాన్ని భిన్న రూపంలో, భిన్నమైన పదజాలపు తొడుగులో తరచుగా పునరావృతం చేయడాన్ని నేను ముందు ముందు మీకు వెల్లడిస్తాను. వాస్తవ అంశాలు ఉంటాయన్న దానిని బర్కిలీ తిరస్కరించలేదు. మొత్తం మానవ జాతి అభిప్రాయానికి వ్యతిరేకంగా బర్కిలీ పోలేదు. బాహ్య ప్రపంచం ఒకటి ఉన్నదని మానవుల మస్తిష్కాలలో అది ప్రతిబింబిస్తుందని భౌతికవాద తత్వవేత్తలు గుర్తిస్తారు. ఈ గుర్తింపే వారి జ్ఞాన సిద్ధాంతపు తాత్వికత అంతటికీ పునాది అని సీరియస్‌గానూ, స్థిరంగానూ వారు నమ్ముతారు. బర్కిలీ వారి బోధనను 'మాత్రమే' అనగా వారి జ్ఞాన చిద్ధాంతాన్ని 'మాత్రమే' తిరస్కరించాడు భౌతికవాద జ్ఞాన సిద్ధాంతాన్ని ( చాలావరకు తనకు తెలియకుండానే ) నిరంతరం అనుసరించిన ప్రకృతి శాస్త్రాన్ని బర్కిలీ తిరస్కరించలేదు. 59 వ అధ్యాయంలో ఆయన ఇలా రాశాడు :

'మన మస్తిష్కాలలోని... భావ పరంపరలలో పొందిన అనుభవం... అనే స్థిరమైన ప్రాతిపదికపై ( 'విశుద్ధ అనుభవ' తత్వం- బర్కిలీ) చర్యల మహా పరంపరలననుసరించి ప్రభావితమయ్యే మన భావాల గురించి మనం ముందే ఊహించి చెప్పవచ్చు మనం ప్రస్తుతం ఉన్న పరిస్థితుల కంటే భిన్నమైన పరిస్థితులలో ఉండి ఉంటే మనకు అది ఎలా కనిపించి ఉండేది అనే నిర్ధారణను మనం ఇప్పుడు చేయగలం. ఇందులోనే ప్రకృతి పరిజ్ఞానం ఇమిడి ఉంది. ఇప్పుడు చెప్పిన అంశంలో ఈ పరిజ్ఞానం తన ఉపయోగాన్ని, స్థిరత్వాన్ని (వినండి) నిలిపి ఉంచుకోవచ్చు'.

బాహ్య ప్రపంచం, ప్రకృతి అన్నవాటిని మన మస్తిష్కంలో ఒక దేవత 'ఇంద్రియానుభూతుల సమ్మేళనం'గా రేకెత్తించింది అనుకుందాం. దీనిని ఆమోదించి మస్తిష్కానికి ఆవల మానవులకు బాహ్యంగా ఈ ఇంద్రియానుభూతులకు 'మూలాధారాన్ని' వెదకడం ఆపేశాం అనుకుందాం. అటువంటప్పుడు నా భావవాద జ్ఞాన సిద్ధాంతపు చట్రంలోనే ప్రకృతి శాస్త్రాన్ని ఇమడ్చగలను దాని నిర్ధారణల ప్రాధాన్యం, ప్రామాణికతల మొత్తాన్ని నేను ఆమోదించగలను. సరిగా ఈ చట్రమే, ఈ చట్రం మాత్రమే 'శాంతి, మతాలకు' అనుగుణంగా నా నిర్ధారణలకు తోడ్పడుతుంది. ఇదే బర్కిలీ ఆలోచనా స్రవంతి. భావవాద తత్వశాస్త్ర సారాన్ని, దాని సామాజిక ప్రాధాన్యాన్ని అది సరిగా వ్యక్తం చేస్తుంది. మాక్ వాదానికి, ప్రకృతి శాస్త్రానికి ఉన్న సంబంధం గురించి చెప్పాల్సి వచ్చిన చోట ఈ అంశాన్ని మరోసారి ప్రస్తావిస్తాను.

బిషప్ బర్కిలీ నుంచి 20 వ శతాబ్దంలో ఇటీవలి రూఢివాద విమర్శనాత్మక వాస్తవ వాది పి.యుష్కేవిచ్ ఎరువు తెచ్చుకున్న మరో 'ఇటీవలి ఆవిష్కరణను' పరిశీలిద్దాం. 'అనుభవగత సంకేతవాదమే' ఈ ఆవిష్కరణ. 'బర్కిలీ మళ్లీ తనకిష్టమైన

విశ్వ ప్రాకృతిక సంకేత వాదానికి తిరిగి మళ్లుతాడు' అన్నాడు ఫ్రేజర్. ఈ మాటలు గనుక 1871 నాటి ప్రతిలో లేకుంటే మాత్రం ఆధునిక గణిత శాస్త్రవేత్త, భౌతిక శాస్త్రవేత్త అయిన పాయిన్‌కేర్ నుంచి రష్యన్ 'మార్క్సిస్టు' యుష్కేవిచ్ నుంచి గ్రంథ చౌర్యం చేశాడన్న ఆరోపణ ఇంగ్లీష్ దైవవాద తత్వవేత్త ఫ్రేజర్‌పై పడేది.

ఫ్రేజర్‌ను సంతోషంతో ఉక్కిరిబిక్కిరి చేసిన బర్కిలీ సిద్ధాంతం ఈ రకంగా చెప్పింది:

'భావాల సంబంధం అంటే కార్యకారణ సంబంధం కాదు ( బర్కిలీ దృష్టిలో భావాలు, వస్తువులు ఒక్కటేనన్న సంగతి మర్చిపోరాదు.) అది కేవలం గుర్తించబడిన ఒక వస్తువును సూచించే ఒక చిహ్నం లేదా సంకేతం మాత్రమే' ( 65 వ అధ్యాయం)

కనుక కార్యాన్ని ఉత్పత్తి చేయడంలో కారణానికి సహకరిస్తాయని లేదా ఏకీభవిస్తాయని అనే భావనతో ఆ విషయాలను వివరించడం అన్నది ఏమాత్రం సాధ్యం కాదు. ఆ ప్రయత్నం మనల్ని ఘోరమైన అసంబద్ధతలలో ముంచుతుంది... మన సమాచారం కోసం చిహ్నాలుగానూ, సంకేతాలుగానూ పరిగణించినప్పుడు మాత్రమే వాటిని వివరించడం సహజంగా సాధ్యమవుతుంది'. (66వ అధ్యాయం)

బర్కిలీ, ఫ్రేజర్‌ల అభిప్రాయంలో ఈ 'అనుభవగత సంకేతాల' ద్వారా మనకు తెలియజేసేది మరెవరో కాదు, దేవతే. బర్కిలీ సిద్ధాంతంలో సంకేతవాదానికి ఉన్న జ్ఞాన మూల ప్రాధాన్యత 'భౌతిక కారణాల ద్వారా విషయాలను వివరిస్తున్నట్టు నటించే సిద్ధాంతాన్ని' తొలగించడంలోనే ఉంది. (66 వ అధ్యాయం)

కార్య కారణాల సంబంధం గురించి చెప్పే రెండు తాత్విక ధోరణులు మన ముందు ఉన్నాయి. ఇందులో ఒకటి, 'భౌతిక కారణాల ద్వారా విషయాలను వివరిస్తున్నట్టు నటిస్తుంది' . ఇది 'అసంబద్ధ పాదార్థిక సిద్ధాంతం'. దీనినే బిషప్ బర్కిలీ తప్పు అని రుజువు చేశాడు ! రెండో ధోరణి 'కార్య కారణ సంబంధం' అనే భావాన్ని ఒక 'సంకేత ' భావంగానో లేదా ఒక 'చిహ్నం' గానో కుదిస్తుంది. అదే (భగవత్ ప్రసాదమైన) 'మన సమాచారాని'కి తోడ్పడుతుంది. ఈ ప్రశ్న యెడల గతితార్కిక భౌతికవాదం, మాక్‌వాదాల వైఖరులను మనం విశ్లేషించినప్పుడు మనం 20 వ శతాబ్దంలోని ఈ రెండు ధోరణులనూ గమనించవచ్చు.

మరోమాట, వాస్తవానికి సంబంధించినంతవరకూ బర్కిలీకి సంబంధించి ఒక విషయం చెప్పాలి. మస్తిష్కానికి బాహ్యంగా వస్తువులు ఉంటాయనే దానిని గుర్తించడానికి అతను నిరాకరిస్తాడు. అయినప్పటికీ వాస్తవానికి, కాల్పనికతకు మధ్య

ఉన్న తేడాను చూపడానికి ఒక గీటురాయిని కనుగొనడానికి అతను ప్రయత్నిస్తాడు. 36 వ అధ్యాయంలో అతను ఇలా అంటాడు. కొన్ని నిర్దిష్ట ప్రకృతి సూత్రాలకు లేదా నియమాలకు అనుగుణంగా ఇంద్రియాలను ప్రభావితం చేసే ఇంద్రియగ్రాహ్య భావాలతో పోల్చినప్పుడు మానవ మస్తిష్కం ఇష్టానుసారం ఊహించే భావాలు అస్పష్టంగానూ, బలహీనంగానూ, అస్థిరంగానూ ఉంటాయి. ఇంద్రియానుగత భావాలు మానవ ఊహా శక్తుల కంటే శక్తిమంతమైన, విజ్ఞతాయుతమైన మస్తిష్క ప్రభావాలను గురించి తెలియజేస్తాయి. ఇవి మరింత వాస్తవం. అనగా మరింత ప్రభావశీలం, క్రమబద్ధం, విభిన్నం. అవి మస్తిష్కపు కల్పనలు కాదు...

మరోచోట (84వ అధ్యాయంలో) ఒకేలాంటి ఇంద్రియానుభూతులను ఏకకాలంలో అనేకమంది పొందడం అనే అంశంతో వాస్తవికతా భావాన్ని జోడించడానికి బర్కిలీ ప్రయత్నించాడు. ఉదాహరణకు నీరు ద్రాక్షాసవంగా మారడం గురించి మనం వింటాం. కాని అది వాస్తవమా? కాదా? అన్న ప్రశ్నను మనం ఎలా పరిష్కరించగలం? 'ఒక బల్ల ముందు కూర్చున్నవాళ్లందరూ ద్రాక్షాసవాన్ని చూశారు. వాసన పసిగట్టారు. దాని రుచి చూశారు తాగారు. దాని ప్రభావాన్ని అనుభవించారు. అంటే అప్పుడు దాని వాస్తవికత గురించిన సందేహమేదీ నాకు లేదు'. ఫ్రేజర్ ఇలా వివరించాడు : ఏకకాలంలో 'ఒకే ఇంద్రియానుగత భావాలకు సంబంధించి విభిన్న వ్యక్తులకు ఉన్న చైతన్యం వేరు. ఊహా వస్తువుల ఉద్విగ్నతలకు సంబంధించిన వ్యక్తిగత చైతన్యం వేరు. మొదటి రకం చైతన్యం వాస్తవికతకు ప్రమాణంగా ఇక్కడ ప్రస్తావించబడింది'.

వ్యక్తి గ్రాహ్యానికి సమష్టి గ్రాహ్యానికి ఉన్న బేధాన్ని కూడా నిరాకరించే వా ద ం గా బర్కిలీ ఆత్మాశ్రయ భావవాదాన్ని పరిగణించరాదు అనడానికి ఇది నిదర్శనం అందుకు విరుద్ధంగా ఈ రెండు చైతన్యాల మధ్య ఉన్న విభేదాన్ని ప్రాతిపదికగా తీసుకుని వాస్తవికతకు ఒక గీటురాయిని నిర్మించడానికి ఆయన ప్రయత్నించాడు. మానవ మస్తిష్కంపై దేవతా చర్యల ప్రభావం నుంచి 'భావాలను' రాబట్టడం ద్వారా బర్కిలీ వస్తుగత భావవాదానికి చేరుకుంటాడు ప్రపంచం నా భావం కాదు. ఒక ఏకైక పరమాత్మ కారణంగా అది ఉద్భవిస్తుంది. అదే కారణం ప్రకృతి నియమాలను సృష్టిస్తుంది. ఎక్కువ వాస్తవకరమైన భావాలను తక్కువ వాస్తవికమైన భావాల నుంచి వేరుచేసే నియమాలను తదితరాలను అది సృష్టిస్తుంది.

The three dialogues between Hylas and Philonous (1713) అనే తన మరో గ్రంథంలో బర్కిలీ తన భావాలను మరింత సుబోధకంగా పాఠకుల ముందుంచాడు. తన సిద్ధాంతానికి భౌతికవాద సిద్ధాంతానికి మధ్య శత్రుత్వాన్ని ఈ రకంగా చెప్పాడు : '

మనం బాహ్య అంశాలకు ప్రభావితం అవుతాం కనుక మన కంటే భిన్నమైన బాహ్య శక్తులను ఆమోదించాలని నేనూ అంటాను, మీరూ అంటారు .. అయితే ఇది ఏ తరహా శక్తి అన్న విషయంలో మనం విభేదిస్తాం. నేను దానిని ఆత్మ అంటాను. మీరు దానిని పదార్థం అంటారు. లేదా ఆ తృతీయ ప్రకృతి ఏదో నాకు తెలియదు. ( మీకూ తెలియదని నేను జోడించగలను )'

ఫ్రేజర్ ఇలా వ్యాఖ్యానిస్తాడు

ఇదే అసలు విషయం. భౌతికవాదుల ప్రకారం ఇంద్రియానుగత పరిణామాలకు కారణం భౌతిక పదార్థం లేదా ఏదో తెలియని 'తృతీయ ప్రకృతి' బర్కిలీ ప్రకారం అది హేతుబద్ధ అభీష్టం. హ్యూమ్ తదితర రూఢివాదుల ప్రకారం దాని మూలం మనకు ఏమాత్రం తెలియదు. కేవలం సాదృశ్యాల ద్వారా, ఆనవాయితీల ద్వారా నిజాలుగా వాటిని మనం కేవలం సామాన్యీకరించగలం' .

నిక్కచ్చిగా భావవాద వైఖరిని అనుసరించిన ఇంగ్లీష్ బర్కిలీ వాది ఫ్రేజర్, ఇక్కడ భౌతికవాది అయిన ఏంగెల్స్ స్పష్టంగా చిత్రీకరించిన ప్రాథమిక తాత్విక ధోరణులనే పేర్కొన్నాడు. లుడ్విక్ ఫ్యూయర్ బాక్ అనే తన గ్రంధంలో ఏంగెల్స్ 'రెండు మహా శిబిరాలు'గా వివరించాడు. వారు భౌతికవాదులు, భావవాదులు. ఈ రెండు ధోరణులకీ చెందిన సిద్ధాంతాలను- ఫ్రేజర్ నాటికంటే బాగా అభివృద్ధి చెందిన వైవిధ్యపూరితమైన, సుసంపన్నమైన సిద్ధాంతాల మధ్య ఉన్న భేదాన్ని - ఏంగెల్స్ పరిశీలించాడు. భౌతికవాదుల దృష్టిలో ప్రకృతి ప్రాథమికం, ఆత్మ ద్వితీయం. భావవాదుల దృష్టిలో ఆత్మ ప్రాథమికం, ప్రకృతి ద్వితీయం ఈ రెండు శిబిరాల మధ్య ఏంగెల్స్ హ్యూమ్ వాదులను, కాంట్ వాదులను ఉంచాడు వారు ప్రపంచాన్ని తెలుసుకోవడం సాధ్యం కాదంటారు లేదా సంపూర్ణంగా తెలుసుకోవడం సాధ్యం కాదంటారు. వారిని ఆయన అజ్ఞేయవాదులు అన్నాడు. లుడ్విగ్ ఫ్యూయర్ బాక్ అనే తన గ్రంధంలో ఈ పదాన్ని ఆయన కేవలం హ్యూమ్ వాదులకు మాత్రమే ఉపయోగించాడు. ( తమను తాము వారు రూఢివాదులం అని భావించుకున్నారు. వారిని ఫ్రేజర్ కూడా రూఢివాదులనే అన్నాడు. ) అయితే 'చారిత్రక భౌతికవాదం గురించి' అన్న తన వ్యాసంలో 'నయా కాంట్ అజ్ఞేయవాదులు' అనే పదం వాడాడు నయా కాంట్‌వాదులు అజ్ఞేయవాదులలో ఒక తరహాకి చెందుతారు అని ఆయన పరిగణించాడు.

ఏంగెల్స్ నిర్ధారణ ఎంతో ఖచ్చితంగానూ, పరిపూర్ణంగానూ ఉంది. అయితే దీనిని గురించి ఇక్కడ వివరించడం లేదు. ( ఈ నిర్ధారణను మాక్ వాదులు నిస్సిగ్గుగా నిర్లక్ష్యం

చేశారు.) తర్వాత ఈ అంశాన్ని వివరంగా ప్రస్తావిస్తాను. ప్రస్తుతానికి ఈ మార్క్సిస్టు పదాన్ని ప్రస్తావించడానికి పరిమితం అవుతాను. రెండు పరస్పర విరుద్ధ ధోరణుల కలయికను ప్రస్తావిస్తాను. మౌలిక, తాత్విక ధోరణుల విషయంలో ఒక ఖచ్చితమైన భౌతికవాది అభిప్రాయాలు, ఒక ఖచ్చితమైన భావవాది అభిప్రాయాలు ఏకీభవించడాన్ని ప్రస్తావిస్తాను. ఈ ధోరణులను చిత్రించడం కోసం ( ముందు ముందు వీటిని చాలాసార్లు వివరించాల్సిన అవసరం ఉంది.) బర్కిలీ కంటే భిన్నమైన మార్గాన్ని స్వీకరించిన 18 వ శతాబ్దపు సుప్రసిద్ధ తాత్వికుల అభిప్రాయాలను క్లుప్తంగా వివరిస్తాను.

హ్యూమ్ వాదనలివి. మానవ అవగాహన, ఒక పరిశీలన అనే తన గ్రంథంలో 12 వ అధ్యాయంలో తన సంశయవాద తాత్విక ధోరణిని ఆయన ఇలా ప్రదర్శించాడు:

సహజ ప్రవృత్తి వల్లనో లేదా ముందే పడిన ముద్ర వల్లనో మనుషులు తమ ఇంద్రియాలపైన విశ్వాసం పెంపొందించుకుంటారన్నది స్వయంవిదితంలా అనిపిస్తుంది. అది కూడా ఏమాత్రం హేతువు లేకుండా. హేతుబద్ధతను ఉపయోగించడానికి దాదాపు ముందే మనకు బాహ్యంగా ఒక విశ్వం ఉందని, అది మన గ్రహణ శక్తి పైన ఆధారపడి ఉండదని మనమూ, మనలాంటి ఇంద్రియగత జీవులు లేకున్నా అంతమైపోయినా ఆ బాహ్య విశ్వం ఉంటుందని మనం ఎప్పుడూ భావిస్తూ వచ్చాం. జంతు జాలం గురించి కూడా ఇదే అభిప్రాయం ఉంది. బాహ్య వస్తువుల గురించి ఈ నమ్మకం వారి ఆలోచనలలోనూ, పథకాలలోనూ, చర్యలలోనూ దాగి ఉంది....

'మస్తిష్కానికి ప్రతిబింబం లేదా గ్రహణ తప్ప మరేదీ అందదు. ఇంద్రియాలు ఈ ప్రతిబింబాలను మేధకు అందించే సాధనాలు మాత్రమే. అవి మస్తిష్కానికి, వస్తువుకు మధ్య ఎటువంటి ప్రత్యక్ష సంబంధాన్ని సృష్టించవు. ఈ అంశాలను బోధించే ఏపాటి తత్వశాస్త్రమైనా మనిషికి ఏర్పడిన పై సార్వత్రిక ప్రాథమిక అభిప్రాయాన్ని అంతం చేయగలదు. ఒక బల్ల నుంచి మనం దూరం జరిగినకొద్దీ అది చిన్నది అయినట్టుగా కనిపిస్తుంది. అయితే నిజమైన బల్ల మనతో ప్రమేయం లేకుండా ఉంటుంది: దానిలో మార్పు ఉండదు. కనుక మన మస్తిష్కానికి అందేది దాని ప్రతిబింబం మాత్రమే. ఇవి స్పష్టంగా హేతువు మనకిచ్చే ఆదేశాలు. ఈ 'ఇల్లు', 'ఈ చెట్టు' అని మనం పేర్కొంటున్నప్పుడు అవి మన మస్తిష్క గ్రాహ్యాలు తప్ప మరేమీ కాదు. ఈ విషయాన్ని ఆలోచించే మనిషెవరూ ఎన్నడూ సందేహించలేదు....

'మస్తిష్క గ్రాహ్యాలు బాహ్య వస్తువులను పోలి ఉన్నప్పటికీ (అది సాధ్యమైనట్లయితే ) వాటికి పూర్తిగా భిన్నమైన ఈ బాహ్య వస్తువుల వల్లనే ఏర్పడ్డాయనీ, అవి మేధాశక్తి వల్లనో

లేదా ఏదో ఒక తెలియని అదృశ్య శక్తి వల్లనో లేదా ఇంకా ఇంతవరకూ మనకు తెలియని మరేదో కారణం వల్లనో ఏర్పడ్డాయని మనం ఎటువంటి వాదనతో రుజువు చేయగలం ?....

'ఈ అంశాన్ని ఎలా నిర్ధారించగలం ? ఇలాంటి మిగిలిన అంశాలన్నింటిలాగానే దీనిని కూడా అనుభవం వల్ల మాత్రమే నిర్ణయించగలం. అయితే ఇక్కడ అనుభవం అన్నది పూర్తిగా మౌనం పాటిస్తుంది. మస్తిష్కానికి మస్తిష్క గ్రాహ్యాలు తప్ప మరేవీ అందవు. వస్తువులతో వాటికున్న సంబంధపు అనుభవం బహుశా వాటికి ఎన్నడూ అందదు. కనుక అటువంటి సంబంధం ఉంది అనుకోవడానికి హేతుబద్ధ పునాది ఏదీ లేదు.

' మన ఇంద్రియాల సత్యాన్ని రుజువు చేయడానికి పరమ అస్తిత్వ సత్యాన్ని ఆశ్రయించడం అన్నది ఏమాత్రం ఎదురుచూడని డొంకతిరుగుడు మాత్రమే.... బాహ్య ప్రపంచాన్ని ఒకసారి ప్రశ్నించడమంటూ జరిగితే ఆ పరమ అస్తిత్వం అనేదానిని లేదా దాని ఇతర గుణాల అస్తిత్వాన్ని రుజువు చేయడానికి మనకు వాదనలేమీ మిగలవు'

(డేవిడ్ హ్యూమ్, మానవ అవగాహన, ఒక పరిశీలన. వ్యాసాలు. లండన్ 1882)

"మానవ ప్రకృతి.." అనే తన గ్రంథంలో ఆయన ఇదే విషయాన్ని చెప్పాడు. ('ఇంద్రియాల విషయంలో సంశయవాదం' 4 వ భాగం, 2 వ విభాగం) : 'ఉన్నది ఒకే అస్తిత్వం. దానిని నేను భేద రహితంగా వస్తువులు లేదా ఇంద్రియ గ్రాహ్యాలు అంటాను'. హ్యూమ్ దృష్టిలో సంశయవాదం అంటే వస్తువుల వల్లనో, ఆత్మ తదితరాల వల్లనో ఇంద్రియానుభూతులు ఏర్పడతాయని వివరించడానికి నిరాకరించడమే. ఒక వైపున ఇంద్రియ గ్రాహ్యాలను ఆయన భౌతిక ప్రపంచంగా కుదించడానికి నిరాకరించాడు. అలాగే వాటిని దైవంగా లేదా ఒక తెలియని ఆత్మగా కుదించడానికి కూడా నిరాకరించాడు. హ్యూమ్ ఫ్రెంచి అనువాదానికి ముందు మాట రాసిన ఎఫ్.ఫిల్లాన్ మాక్ వాదం లాంటి తాత్త్విక ధోరణిని అనుసరించాడు. ( ఈ విషయాన్ని మనం కింది పేరాల్లో చూస్తాం) హ్యూమ్ కర్తనీ, వస్తువునీ 'వివిధ గ్రాహ్యాల బృందాలు'గానూ 'చైతన్యమూ, ముద్రలూ భావాల అంశాలు' గానూ కుదించాడనీ ఈ అంశాల కలయికలు, బృందాలను మాత్రమే ఆయన పట్టించుకున్నాడనీ పిల్లాన్ సరిగానే పేర్కొన్నాడు.

ఇంగ్లీష్ హ్యూమ్‌వాది హక్స్‌లీ ఈ ధోరణికి Agnosticism (అజ్ఞేయవాదం) అని సరిగానే పేరు పెట్టాడు. హ్యూమ్ తన గ్రంథంలో ఇంద్రియాలను ప్రాథమికమనీ కుదించవీలులేని చైతన్య స్థితులనీ పరిగణించాడని ఆయన పేర్కొన్నాడు. అయితే ఇంద్రియాల మూలమేమిటి ? అవి పనిచేసేది, మనిషిపై వస్తువుల ప్రభావం వల్లనా లేదా మస్తిష్కానికి

ఉన్న సృజనశక్తి వల్లనా అన్న ప్రశ్నను హ్యూమ్ నిలకడగా వివరించలేక పోయాడని ఆయన పేర్కొన్నాడు. 'వాస్తవికవాదం, భావ వాదం (హ్యూమ్ దృష్టిలో) సుసాధ్యమైన దత్తాంశాలే'. ఇంద్రియాలు దాటి హ్యూమ్ వెళ్లలేదు. 'ఎరుపు, నీలం రంగులు, ఒక గులాబి సువాసన మనసుపై పడే సాదా ముద్రలే.... ఒక ఎర్ర గులాబి మన మనసుపై సంకీర్ణమైన ఒక ముద్ర వేస్తుంది. దానిని ఎర్ర రంగు, గులాబి వాసన ఇంకా ఇతర అనేక సాదా ముద్రలుగా విడదీయవచ్చు'. హ్యూమ్ ఇటు భౌతికవాద వైఖరినీ, అటు భావవాద వైఖరినీ రెంటినీ స్వీకరిస్తాడు. ఇంద్రియ గ్రాహ్యాల సంపుటి ఫిచియన్ 'అహం' సృష్టించగలదు. అలాగే అవి 'ఏదో ఒక వాస్తవ వస్తు' సంకేతమో చిహ్నమో కావచ్చు. హ్యూమ్‌కి హక్స్‌లీ భాష్యం చెప్పిన విధమిది. ఇక భౌతికవాదులంటారా ఎన్‌సైక్లోపెడిస్టుల నాయకుడైన డైడరాట్ బర్కిలీ గురించి చెప్పిన అభిప్రాయాన్ని గమనించండి :

భావవాదులు అని పిలవబడే ఈ తాత్వికులకు తమ అస్తిత్వమూ, తమ ఇంద్రియ అనుభూతులూ తప్ప మరేమీ తెలియవు. ఇవి ఒకదాని తర్వాత ఒకటిగా వస్తుంటాయి. వీటిని తప్ప మరో అంశాన్ని దేన్నీ వారు ఆమోదించరు. ఇది ఒక వ్యర్థ వ్యవస్థ. నా దృష్టిలో దీనిని గుడ్డివాళ్లు మాత్రమే సృష్టించగలరు. ఈ వ్యవస్థ మానవ మేధస్సుకీ, తాత్వికతకూ సిగ్గుచేటు. ఇది అత్యంత అసంబద్ధమే అయినప్పటికీ దీనితో పోరాడడం అత్యంత క్లిష్టం, అంటాడు డైడరాట్.

సమకాలీన భౌతికవాద దృక్పథానికి చాలా సన్నిహితంగా వచ్చాడు డైడరాట్. (భావవాదాన్ని తప్పు అని రుజువు చేయడం వాదనలతోనూ సూత్రీకరణలతోనూ మాత్రమే సాధ్యంకాదు. ఇది కేవలం సైద్ధాంతిక వాదనకి సంబంధించిన వ్యవహారం మాత్రమే కాదు) భావవాది అయిన బర్కిలీ ఇంద్రియవాది అయిన కాండీలాక్‌ల ప్రాథమిక వాదనలలోని పోలికను ఆయన చూపించాడు. మన జ్ఞానానికి ఇంద్రియాలు మాత్రమే మూలాధారం అన్న అసంబద్ధ నిర్ధారణలకు రాకుండా ఉండాలంటే కాండీలాక్, బర్కిలీని తప్పు అని రుజువు చేయడానికి ప్రయత్నించి ఉండాల్సింది.

ఒకేఒక నిర్ధారణకు ప్రస్తుతానికి మనం పరిమితం అవుదాం. భౌతికవాదులకు వ్యతిరేకంగా బిషప్ బర్కిలీ చేయని ఏ ఒక్క వాదననూ 'ఇటీవలి' మాక్ వాదులు చేయలేదు.

**–లెనిన్, భౌతికవాదమూ అనుభవగత విమర్శనమూ**

# 6

# భౌతికవాదం, భావవాదం పరస్పర విరుద్ధం తటస్థ వైఖరీ, రాజీ ధోరణీ అసాధ్యం

ఇంతకుముందు నేను ఇచ్చిన వివరణలో, ప్రతి సందర్భంలోనూ భౌతికవాదానికి, భావవాదానికి సాగే పోరును ప్రదర్శించాను. నేను తీసుకున్న ప్రతి జ్ఞాన సిద్ధాంత సమస్య విషయంలోనూ, 'నూతన' భౌతిక శాస్త్రం లేవనెత్తిన ప్రతి తాత్విక సమస్య విషయంలోన నేను ఈ పని చేశాను. ( ఈ విభాగం భౌతికవాదమూ, అనుభవగత విమర్శనమూ అన్న లెనిన్ గ్రంథంలో చివరి విభాగాల్లో ఒకటి. తత్వశాస్త్రంలో రెండు ప్రధాన శిబిరాలుగా ఆయన గుర్తించిన ధోరణులకు ఉన్న సామాజిక ప్రాధాన్యాన్ని లెనిన్ వివరిస్తాడు.) గంపెడు కొత్త పదజాలపు పన్నాగాల మాటున పాండిత్య ప్రఖర్ష అనే తుక్కు చాటున తాత్విక సమస్యల పరిష్కారంలో తప్పనిసరిగా రెండు మౌలిక ధోరణులను, రెండు ప్రధాన పొత్తులను నేను చూపెట్టాను. ప్రకృతి, పదార్థం, భౌతికం, బాహ్య ప్రపంచం అనేవి ప్రాథమికమా ? లేదా మనసు, ఆత్మ, ఇంద్రియానుభూతి (ప్రస్తుతం బాగా ప్రచారంలో ఉన్న అనుభవం) , మనస్తత్వం వగైరాలు ప్రాథమికమా ? అన్నదే మౌలిక ప్రశ్న. ఈ ప్రశ్న తాత్వికులను రెండు మహా శిబిరాలుగా విభజిస్తోంది ఈ రంగంలో గందరగోళానికి, వేలాది పొరపాట్లకు మూల కారణం ఒకటి ఉంది. పదాల నిర్వచనాల తొడుగు మాటున పాండిత్య ప్రకర్ష మాటున పదజాలపు విన్యాసాల మాటున ఈ రెండు మౌలిక ధోరణులు దాగి ఉన్నాయన్న సంగతిని ఉపేక్షించడమే ఆ కారణం. ( ఉదాహరణకు తనది భావవాదం అన్న సంగతిని బొగ్దనోవ్ నిరాకరిస్తాడు. అతడు 'ప్రకృతి', 'మస్తిష్కం' అనబడే 'అధి భౌతిక' భావనలకు బదులుగా 'అనుభవైక' శారీరకం, మానసికం అన్న భావనలను స్వీకరిస్తాడు. ఇక్కడ మారింది ఒక మాట మాత్రమే)

మార్క్స్, ఏంగెల్స్‌లు సుదీర్ఘకాలం పాటు దాదాపు అర్థ శతాబ్దంపాటు భౌతిక వాదాన్ని అభివృద్ధి చేశారు. దానిలోని ఒక మౌలిక ధోరణిని వారు ముందుకు తీసుకెళ్లారు. అప్పటికే పరిష్కారమైన జ్ఞాన సిద్ధాంత సమస్యలను మరోసారి చెప్పడానికి వారు పరిమితం

కాలేదు. ఆ భౌతికవాదాన్ని నిక్కచ్చిగా సామాజిక శాస్త్రాల రంగానికి వర్తింపజేశారు. ఎలా వర్తింపజేయాలో చూపించారు. జిత్తులమారి గందరగోళపు వాదోపవాదాలను 'సరి కొత్త' తాత్విక ధోరణిని 'ఆవిష్కరించడానికి' జరిగే అసంఖ్యాకమైన ప్రయత్నాలను 'నూతన' ధోరణులు వగైరాలను సృష్టించే యత్నాలను అన్నింటినీ తుక్కు, దూదర కింద కొట్టిపారేశారు. మహా మేధావులైన మార్క్స్, ఏంగెల్స్‌ల సామర్థ్యం ఈ అంశాలన్నింటిలోనూ ఇమిడి ఉంది. ఈ ప్రయత్నాల పదగుంభన తత్వం, సరికొత్త తాత్విక వాదాలతో పాండిత్య ప్రకర్ష, జిత్తులమారి పన్నాగాలతో సమస్యకు చిక్కుముడులు వేయడం, జ్ఞాన సిద్ధాంతపు రెండు మౌలిక ధోరణుల మధ్య సాగే పోరును గ్రహించి స్పష్టంగా ప్రదర్శించలేని అసమర్థత – వీటిపైనే మార్క్స్, ఏంగెల్స్‌లు తమ మొత్తం కార్యకలాపాలన్నింటిలోనూ నిక్కచ్చిగా పోరాడారు.

'దాదాపు అర్థ శతాబ్దం' అని నేను అన్నాను. శాస్త్రీయ సోషలిజం, ఆధునిక భౌతికవాదాల నిర్మాత మార్క్స్ 1843 లో మార్క్స్‌గా మారాడు. ఆ సమయంలోనే ఆయన తత్వశాస్త్రంలోని రెండు మౌలిక ధోరణుల గురించి ఆశ్చర్యకరమైనంత స్పష్టతతో పేర్కొన్నాడు ఆయన భౌతికవాదం అంతకుముందున్న భౌతికవాదాల రూపాల కంటే పోల్చవీలులేనంత సుసంపన్నమూ, నికరమూ. Deutsch Franzosische Jahrbucher అనే తను నడిపిన పత్రికలో షెల్లింగ్‌కు వ్యతిరేకంగా ఒక వ్యాసం రాయాల్సిందిగా 1843 అక్టోబర్ 30 వ తేదీన ఫ్యూయర్‌బా కు మార్క్స్ ఒక లేఖ రాశాడు. ఈ ఉత్తరాన్ని కార్ల్ గ్రూన్ ఉల్లేఖించాడు. ఇంతకుముందున్న తాత్విక ధోరణులన్నింటినీ తాను స్వీకరించి అధిగమించినట్లుగా చెప్పుకుంటున్న షెల్లింగ్ ఒక పసలేని బడాయికోరు అని మార్క్స్ అన్నాడు. 'ఫ్రెంచి కాల్పనిక వాదులతోనూ, మాయావాదులతోనూ షెల్లింగ్ ఇలా అంటాడు. తత్వశాస్త్ర దైవవాద సమాగమాన్ని నేను. ఫ్రెంచి భౌతికవాదులతో ఆయన ఇలా అంటాడు. శరీర, భావాల సమాగాన్ని నేను. ఫ్రెంచి సంశయవాదులతో ఇలా అంటాడు. పిడివాద వినాశకుడ్ని నేను'. ( ఈ ఉల్లేఖన కార్ల్ గ్రూన్ రాసిన గ్రంథం నుంచి తీసుకోబడింది)

హ్యూమ్‌వాదులుకానీ లేదా కాంట్ వాదులుకానీ ( లేదా 20 వ శతాబ్దపు మాక్ వాదులు కానీ) 'సంశయవాదులందరూ' భౌతిక, భావవాదాల రెంటి 'పిడివాదానికి' వ్యతిరేకంగా ఆక్రోశిస్తారన్న సంగతిని అనాటికే మార్క్స్ గ్రహించాడు. అనాడున్న వేలాది చిల్లర హీన తాత్విక వ్యవస్థలను ఖాతరు చేయకుండా భావవాదానికి వ్యతిరేకంగా నేరుగా భౌతికవాద మార్గాన్ని ఫ్యూయర్ బాక్ సాయంతో మార్క్స్ స్వీకరించగలిగాడు. 30 ఏళ్ల తర్వాత తన 'పెట్టుబడి' ప్రథమ సంపుటి రెండో ప్రతి మలి మాటలో అంతే స్పష్టంగా, అంతే నిర్దిష్టంగా హెగెల్ భావవాదానికి తన భౌతికవాదాన్ని ఎదురునిలిపాడు.

హెగెల్‌ది ఆనాటికి అత్యంత నికరమైన అభివృద్ధి చెందిన భావవాదం. కామ్టీ రూఢివాదాన్ని ఒక హీన వాదంగా మార్క్స్ ఈసడించుకున్నాడు. ఈ ఆధునిక తాత్వికులు హెగెల్ తత్వాన్ని నాశనం చేశామని ఊహించుకుంటున్నారని నిజానికి వాళ్లు హెగెల్‌కు పూర్వం కాంట్‌వాదమూ, హ్యూమ్ వాదమూ చేసిన పొరపాట్లనే మళ్లీ చేస్తున్నారని మార్క్స్ పేర్కొన్నాడు. 1870 జూన్ 27 వ తేదీన కుగెల్ మాన్‌కి రాసిన లేఖలో బూక్నర్, లాంజ్, డూరింగ్, ఫెచ్నెర్ తదితరుల గురించి మార్క్స్ ఈసడింపుగా ప్రస్తావించాడు ఎందుకంటే హెగెల్ గతితర్కాన్ని వారు ఏమాత్రం అర్థం చేసుకోకపోగా ఆయన రచనలను చిన్న చూపు చూశారు. చివరిగా 'పెట్టుబడి' గ్రంధంలోనూ, తన ఇతర రచనలలోనూ మార్క్స్ పేర్కొన్న తాత్విక అంశాలను గమనించండి. ఆయన భౌతికవాదాన్ని నిక్కచ్చిగా గ్రహించాలని పట్టుబట్టాడని అర్థమవుతుంది. విషయాలను దాచిపెట్టడాన్నీ, గందరగోళపర్చడాన్నీ భావవాదానికి దారితీసే పెడధోరణులనూ ఆయన ఏవగించుకున్నాడన్న సంగతి తప్పనిసరిగా అర్థమవుతుంది. ఈ మౌలిక విరుద్ధ అంశాల మధ్యనే మార్క్స్ తాత్విక పలుకులు కనిపిస్తాయి. ప్రొఫెసర్ తరహా తత్వశాస్త్రం దృష్టిలో ఇది ఒక లోపం. 'సంకుచితత్వం'. 'ఏకపార్శ్వం'. నిజానికి భౌతిక భావవాదాల మధ్య రాజీ చేసే సంకర జాతి పధకాలను గుర్తించడానికి నిరాకరించడంలోనూ, స్పష్టంగా నిర్వచించుకున్న తాత్విక పధంలో ముందుకు సాగిపోవడంలోనూ మార్క్స్ గొప్పతనం ఇమిడి ఉంది.

ఆద్యంతం మార్క్స్ తత్వంతోనూ, ఆయనతో సన్నిహిత సంబంధంతోనూ ఏంగెల్స్ తన తాత్విక గ్రంథాలన్నింటిలోనూ ప్రతి తాత్విక ప్రశ్న విషయంలోనూ భౌతిక భావవాద విరుద్ధ ధోరణులను స్పష్టంగా పేర్కొన్నాడు. భౌతిక భావవాదాల 'ఏకపార్శ్వ' పరిమితిని 'దాటడానికి' అనంతంగా జరుగుతున్న ప్రయత్నాలను, 'రూఢివాదాన్ని', 'వాస్తవ' వాదాన్ని , లేదా ప్రొఫెసర్ తరహా బడాయి వాదాన్ని ఏదోఒక సరికొత్త ధోరణిని ప్రకటించే ప్రయత్నాలను 1878, 1888 లేదా 1892 సంవత్సరాలలో ఏంగెల్స్ సీరియస్‌గా పరిగణించలేదు. ( ఈ సంవత్సరాలలో ఆయన యాంటీ డూరింగ్, లుడ్విగ్ ఫ్యూయర్ బాక్ అనే గ్రంధాలనూ, సోషలిజం ఊహాజనితమూ, శాస్త్రీయమూ అనే గ్రంధం ఇంగ్లీష్ ప్రతికి ముందు మాటనూ రాశాడు.) డూరింగ్ నిక్కచ్చిగా భౌతికవాదానికి కట్టుబడి ఉండకపోవడంపైనే ఏంగెల్స్ తన పోరాటాన్ని కేంద్రీకరించాడు భౌతికవాది డూరింగ్‌సమస్యను పదగుంఫనతో గందరగోళపరుస్తున్నాడని, అనవసర పదజాల ప్రయోగానికి పాల్పడుతున్నాడని, భావవాదంతో రాజీపడే పద్ధతులను అనుసరిస్తున్నాడని, చివరికి భావవాద వైఖరిని స్వీకరిస్తున్నాడని ఏంగెల్స్ విమర్శించాడు. చివరి వరకూ

భౌతికవాదానికి కట్టుబడి ఉండడమో లేదా అసత్యానికి, తాత్విక భావవాద గందరగోళానికి గురికావడమో అన్నదే ప్రశ్న. యాంటీ డూరింగ్‌లో ప్రతి పేరా ప్రదర్శించిన సూత్రం ఇదే. ప్రొఫెసర్ తరహా అభివృద్ధి నిరోధక తత్వశాస్త్రంతో ఆ పాటికే బుర్రలు పాడుచేసుకున్నవారు తప్ప ఈ అంశాన్ని గుర్తించనివారంటూ ఉండరు. యాంటీ డూరింగ్‌కి చిట్టచివరి ముందు మాట 1894 లో రాశాడు. ఆ యేడాది ఆ గ్రంథాన్ని రివైజ్ చేసి మరింత వివరంగా చిట్టచివరిసారిగా రాశాడు. ఆనాటి వరకూ తత్వశాస్త్రంలోనూ, సైన్స్‌లోనూ తాజా పరిణామాలన్నింటినీ అనుసరిస్తూ వచ్చాడు. చిన్నా పెద్దా కొత్త వ్యవస్థల తుక్కూ దూగరను తుడిచిపారేస్తూ స్పష్టమైన, స్థిరమైన తన వైఖరిని కృతనిశ్చయంతో ఆయన కొనసాగించాడు.

ఆయన లుడ్విగ్ ఫ్యూయర్ బాక్ గ్రంథాన్ని బట్టి తత్వశాస్త్రంలో నూతన పరిణామాలన్నింటినీ ఏంగెల్స్ పరిశీలించాడని తెలుస్తోంది. ఇంగ్లండ్‌లోనూ, స్కాండ్‌నేవియాలోనూ సాంప్రదాయక జర్మన్ తత్వశాస్త్రం పునర్జన్మ ఎత్తిందని చెప్పబడిన ధోరణిని కూడా ఆయన తన 1888 నాటి ముందు మాటలో ప్రస్తావించాడు. ముందు మాటలోనూ, పుస్తకంలోనూ కూడా ఆనాటికి ప్రబలంగా ఉన్న నయా కాంట్ వాదాన్ని, హ్యూమ్ వాదాన్ని ఆయన ఈసడించుకున్నాడు. జర్మనీలోనూ, ఇంగ్లండ్‌లోనూ ఫ్యాషనబుల్ తత్వశాస్త్రవేత్తలు హెగెల్‌కి పూర్వం ఉన్న కాంట్‌వాదమూ, హ్యూమ్ వాదమూ చేసిన పాత తప్పులనే మళ్ళీ చేస్తున్నారని ఏంగెల్స్ గమనించాడు. ఇంగ్లండ్, స్కాండినేవియాల్లో తాత్వికులు మళ్ళీ హెగెల్ వాదానికి మరలుతున్నారని కూడా ఆయన గమనించాడు. ఈ రెండోదే మేలని ఆయన భావించాడన్నది స్పష్టం. సంకుచిత భావవాద అధిభౌతికవాద ధోరణులను బహిర్గతం చేయడంలో కనీసం ఆ మహా భావవాది గతితార్కికవాది (హెగెల్) తోడ్పడవచ్చునని ఏంగెల్స్ ఆశించాడు.

జర్మనీలో నయా కాంట్‌వాదానికి, ఇంగ్లండ్‌లో హ్యూమ్ వాదానికి ఉన్న సవాలక్ష ఛాయలను పరీక్షించడమే పనిగా పెట్టుకోకుండా భౌతికవాదం నుంచి వారు వైదొలగడాన్నే ముందు నుంచీ తప్పు అని ఏంగెల్స్ రుజువు చేశాడు. ఈ రెండు వాదాలు కూడా శాస్త్రపరంగా చూస్తే ఒక అడుగు వెనక్కు వేశాయని ఏంగెల్స్ ప్రకటించాడు. నిస్సందేహంగా 'రూఢి' వాదులైన, ఇప్పటి పదజాలం ప్రకారం నిస్సందేహంగా 'వాస్తవ' వాదులైన నయా కాంట్‌వాదుల, హ్యూమ్‌వాదుల ధోరణులను గురించి ఆయన అభిప్రాయం ఏమిటి ? వారందరిలోనూ హక్స్లీ కూడా ఉన్నాడని ఆయన గమనించకుండా ఉండడానికి వీలులేదు. అసంఖ్యాకమైన గందరగోళపు బుర్రలను ఆకర్షించిన ఇంకా ఆకర్షిస్తున్న అదే 'రూఢివాదం' , అదే 'వాస్తవిక' వాదం గురించి విమర్శిస్తూ అవి మహా అయితే 'భౌతికవాదాన్ని'

బహిరంగంగా శపిస్తూనే ఆ వాదాన్నే దొంగతనంగా రవాణా చేసే అల్పిష్టి పద్ధతి అని ఏంగెల్స్ అన్నాడు. మాక్, అవెనేరియస్ అండ్ కో ల కంటే పోల్చవీలులేనంతగా వాస్తవికంగా వాస్తవిక వాది, రూఢిగా రూఢివాది, ఎంతో గొప్ప శాస్త్రవేత్త అయిన థామస్ హక్స్లీ గురించి ఏంగెల్స్ ఆ మాట అన్నాడంటే 'ఇటీవలి' రూఢివాదాన్ని, 'తాజా' వాస్తవిక వాదాన్ని తలకెత్తుకుని మోజుపడుతున్న ఒక మార్క్సిస్టు బృందాన్ని గురించి ఏంగెల్స్ ఎంత ఈసడింపుగా మాట్లాడి ఉండేవాడో తేలిగ్గానే అర్థం చేసుకోవచ్చు.

మార్క్స్, ఏంగెల్స్‌లు ఇద్దరూ మొదటి నుంచి చివరి వరకూ తత్వశాస్త్రంలో భౌతికవాద పక్షానికే కట్టుబడ్డారు. ప్రతి 'సరికొత్త' ధోరణిలోనూ భౌతికవాదం నుంచి తప్పుకున్న పెడధోరణులను, అవి భావవాదానికి, విశ్వాసవాదానికి ఇచ్చే రాయితీలను వారు గమనించారు. అందుకే వారు ప్రత్యేకించి హక్స్లీని అతని భౌతికవాద నికరత్వం గురించి పరిగణించారు. అందుకే తుది వరకూ భౌతికవాదాన్ని కొనసాగించనందుకు ఫ్యూయర్ బాక్‌ను వారు తప్పుబట్టారు. పిడి భౌతికవాదుల్లో తప్పులు ఉన్నాయి. అంతమాత్రం చేత ఫ్యూయర్ బాక్ భౌతికవాదాన్ని తిరస్కరించడం పొరపాటని వారు భావించారు. ఒక కొత్త మతాన్ని సృష్టించడానికో, పునరుద్ధరించడానికో ఆయన మతంతో పోరాడాడని, సామాజిక శాస్త్రంలో భావవాద పదజాలాన్ని విడనాడలేకపోయాడని, .... భౌతికవాది కావడంలో విఫలమయ్యాడని ఫ్యూయర్ బాక్‌ను వారు విమర్శించారు....

తత్వశాస్త్రంలోనూ ఇరుపక్షాల దృష్టి కోణం నుంచి మాక్, అవెనేరియస్ తదితర తాత్విక ధోరణిని పరిశీలిద్దాం. ఈ పెద్ద మనుషులు తమ పక్షపాత రహిత వైఖరి గురించి డంబాలు పలుకుతారు. వారికి విరుద్ధాంశం అంటూ ఉంటే అది భౌతిక వాదమే.... కేవలం భౌతిక వాదం మాత్రమే. మాక్ వాదుల రచనలన్నింటిలోనూ ఒక అత్యుక్తి కనిపిస్తుంది. భౌతికవాద, భావవాదాలు రెండింటి కంటే 'ఎత్తుగా ఎదిగామని' ఈ రెంటి మధ్య ఉన్న 'కాలం చెల్లిన' వైరుధ్యాన్ని తాము దాటిపోయామని వారు గొప్పలు చెప్పుకుంటారు. నిజానికి వీరంతా భావవాదంలోకి నిరంతరాయంగా జారిపోతున్నారు. నిరంతరాయంగా వారు భౌతికవాదానికి వ్యతిరేకంగా పోరాడుతున్నారు. అవెనేరియస్ లాంటి మనిషి కనీకనిపించకుండా అల్లే జ్ఞాన సిద్ధాంతపు అల్లికలు ప్రొఫెసర్ తరహా కల్పనలు తప్ప వేరు కాదు. తన సొంత చిల్లర తాత్విక మురాను పోగేసే ప్రయత్నం మాత్రమే. నిజానికి ఆధునిక సమాజంలో భావాలకూ, ధోరణులకూ సాగుతున్న పోరాటంలో ఈ జ్ఞాన సిద్ధాంతపు విన్యాసాలు ప్రతి సందర్భంలోనూ పోషించే వాస్తవ పాత్ర ఒకటే. భావవాదానికి, విశ్వాసవాదానికి మార్గం సుగమం చేసి వాటికి నమ్మకంగా ఊడిగం చేయడమే అవి చేసే పని. వార్డులాంటి ఇంగ్లీష్ ఆత్మవాదులు, జర్మన్

ఇమ్మానెంటిస్టులు, ఫ్రెంచి నయా విమర్శనా వాదులు ఈ అనుభవ వాద విమర్శకులనే ఈ చిన్న తాత్విక బృందాన్ని శ్లాఘిస్తున్నారంటే యాదృచ్ఛికంగా కాదు. భౌతికవాదంపై దాడి చేసినందుకుగాను మాక్‌ను ఫ్రెంచి నయా విమర్శనావాదులు శ్లాఘిస్తారు. డీజెన్ మాటల్లో చెప్పాలంటే వీరంతా విశ్వాసవాదానికి పట్టభద్రులైన నమ్మిన బంటులు. మాక్, అవెనేరియస్ తదితరుల తాత్విక ధోరణికి ఈ మాట సరిగా అతుకుతుంది. (అభివృద్ధి నిరోధక బూర్జువా తత్వశాస్త్రంలో సుప్రసిద్ధ స్రవంతులు మాక్ వాదాన్ని ఆచరణలో ఎలా వాడుకుంటాయో తెలియడానికి ఇదొక ఉదాహరణ. తాజా అమెరికన్ తత్వశాస్త్రంలో తాజా ఫ్యాషన్ ప్రాగ్మాటిజమ్ (ఆచరణ వాదం. ప్రాగ్మా అంటే గ్రీకు భాషలో ఆచరణ అని అర్థం. కనుక ఇది ఆచరణ వాదం) తాత్విక పత్రికలు అక్కడ మిగతా అన్ని ధోరణులకంటే ఈ ఆచరణవాదం గురించే మాట్లాడుతున్నాయి భావ, భౌతికవాదాల అధి భౌతిక ధోరణులను ఈ ఆచరణ వాదం అనబడేది ఎగతాళి చేస్తున్నది. అనుభవం, కేవలం అనుభవాన్ని మాత్రమే అది ఆమోదిస్తుంది. ఆచరణే ఏకైక గీటు రాయి అంటుంది. రూఢివాద ఉద్యమాన్ని అది సాధారణంగా ప్రస్తావిస్తుంది. ఆస్ట్‌వాల్డ్, మాక్, పియర్‌సన్, పాయిన్‌కేర్, డూహెమ్ లాంటి వారి మద్దతు తీసుకుంటుంది. సైన్స్ అనేది వాస్తవానికి సంపూర్ణంగా నకలు కాదని నమ్ముతుంది. ఆచరణాత్మక అవసరాల కోసం కేవలం ఆచరణాత్మక లక్ష్యాలతో అధి భౌతికవాదంతో ప్రమేయం లేకుండా అనుభవ పరిమితులను దాటిపోకుండా విజయవంతంగా అది ఒక దేవుణ్ని రాబడుతుంది. ( చూ. విలియమ్ జేమ్స్ ప్రాగ్మాటిజం పాత తరహా ఆలోచనలకు కొత్త పేరు). భౌతికవాదం దృష్టి నుంచి చూస్తే అనుభవగత విమర్శనా వాదానికి, అనుభవగత ఏకతా వాదానికి ఉన్న తేడా ఎంత అప్రధానమో మాకిజానికి, ప్రాగ్మాటిజానికి ఉన్న తేడా కూడా అంతే అప్రధానం. బొగ్డోవ్ సత్యానికి ఇచ్చిన నిర్వచనాన్ని ప్రాగ్మాటిస్టుల సత్య నిర్వచనంతో పోల్చండి. 'ప్రాగ్మాటిస్టుల దృష్టిలో సత్యం అంటే అనుభవంలో అమలయ్యే అన్ని రకాల నిర్దిష్ట విలువల జాతి నామ ధేయమే'.)

మాక్ వాదానికి, మార్క్సిజానికి 'రాజీ' కుదర్చాలని ప్రయత్నిస్తున్న రష్యన్ మాక్ వాదుల దురదృష్టమేమంటే వారు అభివృద్ధి నిరోధక తత్వశాస్త్ర ప్రొఫెసర్‌లను నమ్మారు. ఆ కారణంగా వారు ఏటవాలుగా ఉన్న భూమి మీద నిలబడలేక జారిపోతున్నారు. మార్క్స్‌కి అనుబంధాలు చేర్చడానికి ఆయన సిద్ధాంతాన్ని 'అభివృద్ధి' చేయడానికి జరుగుతున్న వీరి ప్రయత్నాల్లో అనుసరిస్తున్న కార్య విధానంలో గొప్ప తెలివి ఏమీ లేదు. వారు ఆస్ట్‌వాల్డ్‌ని చదువుతారు. ఆస్ట్‌వాల్డ్‌ను నమ్ముతారు. ఆస్ట్‌వాల్డ్ చెప్పిందే మళ్లీ చెబుతారు. దానికి మార్క్సిజం అని పేరు పెడతారు. వారు మాక్‌ను చదివి మాక్‌ను నమ్మి మాక్ చెప్పిందే చెప్పి దానికి మార్క్సిజం అని పేరు పెడతారు. వారు పాయిన్ కేర్‌ను

చదివి పాయిన్ కేర్‌ను నమ్మి పాయిన్ కేర్ చెప్పిందే చెప్పి దానినే మార్క్సిజం అంటారు ! రసాయన శాస్త్రం, చరిత్ర, భౌతిక శాస్త్రం వగైరా ప్రత్యేక రంగాల్లో ఎంతో విలువైన సేవలు అందించగలిగిన ఈ ప్రొఫెసర్‌లలో ఒక్కరిని కూడా తత్వశాస్త్రం విషయంలో వీసమెత్తు కూడా నమ్మరాదు. ఎందుకని ? ఎందుకంటే వాస్తవాలను సేకరించడంలోనూ, ప్రత్యేక పరిశోధనలలోనూ రాజకీయ అర్థశాస్త్రంలో విలువైన సేవలను అందించగల ఏ ఒక్క రాజకీయ అర్థ శాస్త్ర ప్రొఫెసర్‌ను ఆ శాస్త్రపు సామాన్య సిద్ధాంతం విషయంలో వీసం కూడా ఎందుకు నమ్మరాదో అందుకే వారినీ నమ్మరాదు. ఆధునిక సమాజంలో జ్ఞాన సిద్ధాంతం ఎంతగా ఒక పక్షానికి కట్టుబడి ఉంటుందో అంతగానూ రాజకీయ అర్థశాస్త్రం కూడా కట్టుబడి ఉంది. స్థూలంగా చూస్తే అర్థశాస్త్ర ప్రొఫెసర్‌లు పెట్టుబడిదారీ వర్గానికి శాస్త్రీయమైన సేల్స్‌మెన్. అలాగే దైవ వాదానికి తత్వశాస్త్ర ప్రొఫెసర్‌లు శాస్త్రీయమైన సేల్స్‌మెన్.

రెండు సందర్భాలలోనూ మార్క్సిస్టుల కర్తవ్యమేమంటే ఈ సేల్స్‌మెన్ సాధించిన పరిశోధనా విజయాలను క్షుణ్ణంగా ఆకళింపు చేసుకుని వాటిని ఉపయోగించగలగాలి. ( కొత్త ఆర్థిక పరిణామాల పరిశోధనలో ఈ సేల్స్‌మెన్ రచనలను ఆసరా తీసుకోకుంటే మనం ఏమాత్రం పురోగతి సాధించలేం) వారి అభివృద్ధి నిరోధక ధోరణిని పరిహరించి మొత్తంగా ఈ శక్తుల సమాగమంతోనూ మనకు వ్యతిరేకులైన శక్తులతోనూ పోరాడడానికి వీలైన సొంత విధానాన్ని అనుసరించడానికి ఇది అవసరం. మన మాక్ వాదులు చేయలేని పని సరిగా ఇదే. అభివృద్ధి నిరోధక తత్వశాస్త్ర ప్రొఫెసర్‌ల అడుగుజాడలను వారు బానిసలుగా అనుసరించారు. ఈ బృందం రాసిన వ్యాసాల గ్రంథం 'స్టడీస్' లో వీరి తరపున లూనా చెరస్కీ 'బహుశా మేం దారి తప్పి ఉండొచ్చు. కాని మేము అన్వేషిస్తున్నాం' అని రాశాడు. సమస్య ఏమిటంటే మీరు అన్వేషించడం లేదు. మిమ్మల్నే అన్వేషిస్తున్నారు. బూర్జువా తాత్విక ఫ్యాషన్‌లలో ప్రతి మార్పుని మీరు ( మార్క్సిస్టులం కావాలనుకుంటున్న మీరు ) మీ దృక్పథంతో చూడడం లేదు. ఆ ఫ్యాషనే మీ దగ్గరకు వస్తోంది. తన భావ వాద అభిరుచితో సృష్టించిన కొత్త భావాలను మీ పై రుద్దుతోంది. ఒక రోజు అస్ట్‌వాల్డ్ మరో రోజు మాక్ మరో రోజు పాయిన్ కేర్ మిమ్మల్ని ప్రభావితం చేస్తున్నారు. మీరు ఎంతో అమాయకంగా నమ్ముతున్న ఈ వెకిలి సైద్ధాంతిక వ్యూహాలు ('ఎనర్జటిక్స్', 'ఎలిమెంట్స్' , 'ఇంట్రోజెక్షన్స్' తదితరాలు ) ఒక సంకుచిత తాత్విక బృందానికి పరిమితం. అయితే వీటి సామాజిక, భావజాల ధోరణిని వార్డులాంటి వారు, లోపాటిల్ లాంటివారు, నయా విమర్శనవాదులు, ఇమ్మానెంటిస్టులు, ఆచరణవాదులు పసిగట్టారు. తమకు పనికొస్తారని వారు గ్రహించారు. అనుభవగత విమర్శనంపైన, 'పాదార్థిక' భావవాదం పైన వీరు

పడుతున్న మోజు నయా కాంట్‌వాదంపైన, 'శారీరక' భావవాదంపైన ఒకనాటి మోజులాగానే గడచిపోతుంది. కాని విశ్వాసవాదం ఇటువంటి ప్రతి మోజు నుండి దాని వాటా అది తీసుకుంటుంది. అది తన సాధనాలను తాత్విక భావవాదం కోసం వేనవేల పద్ధతిలో మెరుగుపరచుకుంటుంది.

అనుభవగత విమర్శనావాదాన్ని వాస్తవంగా తమ వర్గ ప్రయోజనాల కోసం బూర్జువా అభివృద్ధి నిరోధకులు ఎలా వాడుకోగలరో మతం విషయంలోనూ, ప్రకృతి శాస్త్రం విషయంలోనూ వారి వైఖరిని బట్టి అద్భుతంగా తెలుస్తుంది.

మార్క్సిస్టు తత్వశాస్త్రానికి వ్యతిరేకంగా ఉద్దేశించబడిన ఒక సమష్టి గ్రంథంలో లూనా చెరస్కీ ఉన్నత మానవ శక్తుల దివ్యత్వం గురించి, మతపరమైన నాస్తిక వాదం గురించి మాట్లాడడం మీరు యాదృచ్ఛికం అనుకుంటున్నారా ? అలా అనుకుంటే యూరప్‌లో మతం విషయంలో మాక్ వాద వైఖరిని రష్యన్ మాక్ వాదులు పాఠకులకు సరిగా తెలియజేయలేదని అర్థం. మాక్ వాదమనే దానికి మార్క్స్, ఏంగెల్స్‌ల వైఖరితో మాత్రమే కాదు డీజెన్, ఫ్యూయర్ బాక్‌ల వైఖరితో సైతం ఎటువంటి పోలికా లేదు. అది వీటికి బద్ధ వ్యతిరేకి. అనుభవగత విమర్శ అన్నది ఆస్తికత్వాన్ని లేదా నాస్తికత్వాన్ని రెంటినీ వ్యతిరేకించదు. పెట్జోల్ట్ ప్రకటన మొదలుకొని మతాభిప్రాయం సొంత వ్యవహారం అన్న మాక్ ప్రకటన వరకూ ఈ విషయాన్నే తెలియజేస్తుంది. విశ్వాసవాదం కూడా ఇదే మాట అంటుంది. కార్నేలియస్‌గానీ, ఇమ్మానెంటిస్టులుగానీ ఇదే విషయం చెబుతారు. బాహాటంగా పచ్చి అభివృద్ధి నిరోధకుడైన కార్నేలియస్ మాక్‌ని పొగుడుతాడు. మాక్ కార్నేలియస్‌ను పొగుడుతాడు. ఈ విషయంలో ఒక తత్వశాస్త్రవేత్త తటస్థ వైఖరి తీసుకుంటున్నాడంటే అది విశ్వాసవాదానికి ఊడిగం చేయడంతో సమానమవుతుంది. మాక్, అవెనేరియస్‌ల జ్ఞాన సిద్ధాంతం ప్రాథమికంగానే తటస్థ వాదాన్ని దాటిపోలేదు. పోజాలదు.

ఇంద్రియగతమైన వస్తుగత వాస్తవికతను ఒకసారి విడనాడారా, విశ్వాసవాదానికి వ్యతిరేకంగా సాగే పోరాటంలో మీకున్న ఆయుధాలన్నింటినీ కోల్పోయినట్టే అవుతుంది. ఎందుకంటే అజ్ఞేయవాదంలోకి లేదా ఆత్మాశ్రయ వాదంలోకి నువ్వు జారిపోయినట్టే. అదే విశ్వాసవాదానికి కావాల్సింది. ఇంద్రియ గ్రాహ్య ప్రపంచం భౌతిక వాస్తవికత అయినట్లయితే ఇక ప్రతి ఇతర 'వాస్తవికత'కు లేదా 'అర్థవాస్తవికత'కు ద్వారాలన్నీ మూసుకుపోతాయి. ( భగవంతుడు అనేది 'ఒక వాస్తవ భావన' అని ప్రకటించిన ఇమ్మానెంటిస్టుల 'వాస్తవ వాదా'న్ని బజరోవ్ నమ్మాడన్న సంగతిని ఇక్కడ గుర్తుంచుకోవాలి) ప్రపంచం చలనంలో ఉన్న పదార్థం అయినట్లయితే ఆ పదార్థాన్ని అనంతంగా అధ్యయనం చేయవచ్చు, చేయాలి. అనంత సంకీర్ణమైన విడి విడి రూపాల్లో, ఈ చలనం

పదార్థానికి కలిగించే ప్రభావాలన్నింటితో సహా ఈ పదార్థపు చలనాన్ని అధ్యయనం చేయాలి. అయితే దానికి ఆవల, అందరికీ తెలిసిన ఈ 'భౌతిక' బాహ్య ప్రపంచానికి ఆవల, మరోటి ఏదీ ఉండజాలదు. పౌర ప్రజాతంత్ర యూరప్‌లో భౌతికవాదులపైన కురిపించే తిట్ల వర్షం మామూలే అది ఇవాళ్టికీ కొనసాగుతోంది దీనినంతటినీ రష్యన్ మాక్ వాదులు దాచిపెడుతున్నారు. భౌతికవాదానికి వ్యతిరేకంగా దాడి చేస్తూ మాక్, అవెనేరియస్, పెట్జోల్ట్ అండ్ కంపెనీ చేసిన ప్రకటనలను కానీ భౌతిక వాదాన్ని సమర్థిస్తూ ఫ్యూయర్ బాక్, మార్క్స్, ఏంగెల్స్, డీజెన్‌లు చేసిన ప్రకటనలు కానీ వారు పాఠకునికి తెలియజేయడానికి ఒక్కసారి కూడా ప్రయత్నించలేదు. ..

లూనా చెరస్కీ చెప్పిన ఉన్నత మానవ శక్తుల దైవత్వ భావనకు, భౌతిక స్వభావానికి బదులు మానసిక స్వభావాన్ని గురించి బొగ్దనోవ్ చెప్పిన 'సామాన్య ప్రతిక్షేపం' అన్న భావనకు ఉన్న భావజాలపు బాంధవ్యాన్ని గమనించకుండా ఉండాలంటే అంధులై ఉండాలి. ఈ రెండూ ఒకటే ఆలోచనని తెలుపుతాయి. మొదటిది సౌందర్య దృష్టి నుంచి చేసిన ఆలోచన. రెండోది జ్ఞాన సిద్ధాంతపు దృష్టి నుంచి చేసిన ఆలోచన. ఈ 'ప్రతిక్షేపం' అన్నది మౌనంగా భిన్నమైన కోణం నుంచి విషయాన్ని పరిశీలిస్తుంది మనిషి నుంచి అతని 'మనస్తత్వాన్ని' విడదీసి దాని స్థానంలో అపారంగా విస్తరించిన, అనిర్దిష్టమైన, దైవికంగా నిర్జీవమైన 'స్థూల మనస్తత్వాన్ని' నింపుతుంది మొత్తం భౌతిక స్వభావానికి అంతటికీ బదులుగా ఈ స్థూల మనస్తత్వాన్ని ప్రతిక్షేపించడం ద్వారా అది ఉన్నత మానవ శక్తులకు అప్పటికే దైవత్వం ఆపాదించింది. ఇక, తన 'నిర్హేతుక అనుభవ స్రవంతి'లో యుష్కేవిచ్ ప్రవేశపెట్టిన లోగోస్ ( చిహ్నాల) మాట ఏమిటి ? ఒక్క గోరు చిక్కుకుందా పిట్ట పోయినట్టే. ఇక మన మాక్ వాదులు అందరూ భావవాదంలోనూ మితమైన, కనీకనిపించని విశ్వాసవాదంలోనూ చిక్కుకున్నారు. 'ఇంద్రియానుభూతిని' భౌతిక ప్రపంచపు ప్రతిబింబంగాకాక ఒక ప్రత్యేక 'మూలకం'గా వారు స్వీకరించినప్పుడే చిక్కుకుపోయారు. అది ఎవరి ఇంద్రియానుభూతీ కాదు. ఎవరి మస్తిష్కమూ కాదు. ఎవరి ఆత్మా కాదు. ఎవరి అభీష్టమూ కాదు మానవ మస్తిష్కం వస్తుగత, వాస్తవ, బాహ్య ప్రపంచాన్ని ప్రతిబింబిస్తుందనే భౌతిక వాద సిద్ధాంతాన్ని గుర్తించకపోతే ఎవరికైనా జరిగేది ఇదే.

–లెనిన్ భౌతికవాదమూ, అనుభవగత విమర్శనమూ

# 7

# కొత్త భౌతిక శాస్త్రం భౌతికవాదాన్ని తప్పు అని రుజువు చేస్తోందా ?

మాక్ వాదుల రచనలుగానీ, మాక్ వాదం గురించి తెలిపే రచనలు కానీ చూడండి. భౌతికవాదాన్ని కొత్త భౌతిక శాస్త్రం తప్పు అని రుజువు చేసిందనే జిత్తుల మారి ప్రస్తావనలులేని రచన ఒక్కటి కూడా మీకు కనిపించదు. ఈ ప్రకటనలకు సరైన ప్రాతిపదిక ఉందా అన్నది వేరే ప్రశ్న. కొత్త భౌతిక శాస్త్రానికి లేదా కొత్త భౌతిక శాస్త్రంలోని ఒక నిర్దిష్ట ధోరణికి మాక్ వాదానికి నూతన భావవాద తత్వశాస్త్రంలోని వివిధ రకాల ధోరణులకు మధ్య సంబంధం ఉందని అనడంలో సందేహమే లేదు. మాక్ వాదాన్ని విశ్లేషిస్తూనే ఈ సంబంధాన్ని ప్లెఖనోవ్ లాగా పట్టించుకోకపోవడం అంటే గతితార్కిక భౌతికవాద స్ఫూర్తిని విడనాడడమే. ఇది ఏంగెల్స్ చెప్పిన అక్షరాలను పట్టుకుని ఆయన భావాన్ని వదిలేయడమే అవుతుంది.'ప్రకృతి శాస్త్ర రంగంలో యుగ ప్రాధాన్యం కలిగిన ప్రతి ఆవిష్కరణతో పాటు భౌతికవాదం కూడా తన రూపాన్ని మార్చుకోవాల్సి ఉంటుంది ( మానవ చరిత్రకు కూడా ఇదే వర్తిస్తుంది') అని ఏంగెల్స్ తన లుడ్విగ్ ఫ్యూయర్ బాక్ అనే రచనలో స్పష్టంగా పేర్కొన్నాడు. కనుక ఏంగెల్స్ భౌతికవాద 'రూపాన్ని' రివైజ్ చేయడం, ఆయన ప్రకృతి తాత్విక ప్రతిపాదనలను రివైజ్ చేయడం అన్నది రివిజనిజం (ఆ పదానికున్న అర్థంలో ) కాదు. అంతేకాదు అలా చేయమని మార్క్సిజం కోరుతుంది. మాక్ వాదులు అటువంటి రివిజన్ చేశారని మనం నిందించడం లేదు. భౌతికవాద రూపాన్ని విమర్శిస్తున్నాం అన్న ముసుగులో దాని సారాంశాన్ని వారు మారుస్తున్నారు. ఇది పూర్తిగా రివిజనిస్టు పద్ధతి. దానినే మనం విమర్శిస్తున్నాం. '...పదార్థంలేని చలనం అత్యంత అనూహ్యం' (యాంటీ డూరింగ్) అని ఏంగెల్స్ అన్నాడు. ప్రధాన తాత్విక సమస్య విషయంలో ఇటువంటి నిస్సందేహంగా అత్యంత ప్రధానమైన ఏంగెల్స్ మాటలను, నిర్ధారణలను ప్రత్యక్షంగా నిష్కపటంగా నిర్దిష్టంగా విశ్లేషించడానికి వీరు ఏమాత్రం కృషి చేయకుండా అభివృద్ధి నిరోధక బూర్జువా తత్వశాస్త్ర మౌలిక సూత్రాలను స్వీకరిస్తున్నారు.

ఆధునిక భౌతిక శాస్త్రంలో ఒకానొక ధోరణికి తాత్విక భావవాదం పునర్జన్మకు మధ్య ఉన్న సంబంధాన్ని పరిశీలించడంలో మా ఉద్దేశం ప్రత్యేక భౌతిక శాస్త్ర సిద్ధాంతాలను చర్చించడం ఏమాత్రం కాదని చెప్పాల్సిన అవసరంలేదు.

కొన్ని నిర్దిష్ట ప్రతిపాదనల నుంచి సార్వత్రికంగా తెలిసిన కొన్ని ఆవిష్కరణల నుంచి తలెత్తుతున్న కొన్ని జ్ఞాన సిద్ధాంత నిర్ధారణల గురించి మాత్రమే మాకు ఆసక్తి ఉంది. చాలామంది భౌతికవాదులు ఇప్పటికే ఈ జ్ఞాన సిద్ధాంతపు నిర్ధారణలను స్వీకరిస్తున్నారు. ఇప్పటికే భౌతిక శాస్త్రవేత్తల్లో అనేక ధోరణులు ఉన్నాయి. అవిగాక ఈ నిర్ధారణల ప్రాతిపదికపై కొన్ని నిర్దిష్ట ధోరణులు ఏర్పడుతున్నాయి కనుక ఈ వివిధ రకాల ధోరణుల మధ్య ఉన్న భేదాల సారాంశాన్ని ఎత్తి చూపడమే గాక అవి తత్వశాస్త్ర ప్రాథమిక ధోరణుల విషయంలో ఎటువంటి సంబంధాన్ని కలిగి ఉన్నాయో చూపించడానికి పరిమితం కావడమే మా లక్ష్యం.

## 1. ఆధునిక భౌతిక శాస్త్రంలో సంక్షోభం

లా వేలియర్ డి లా సైన్స్ అనే తన గ్రంథంలో హెన్రీ పాయిన్ కేర్ అన్న సుప్రసిద్ధ ఫ్రెంచి భౌతిక శాస్త్రవేత్త తత్వశాస్త్రంలో 'తీవ్రమైన సంక్షోభ చిహ్నాలు' కనిపిస్తున్నాయి అని రాశాడు. ఈ సంక్షోభానికి ఆయన ఒక ప్రత్యేక అధ్యాయాన్ని కేటాయించాడు. 'రేడియం ఒక గొప్ప విప్లవకారుడు' అది శక్తి నిత్యత్వ సూత్రాన్ని బలహీనపరుస్తుంది అని ఆయన రాశాడు. అంతేకాదు 'మిగతా అన్ని సూత్రాలు ప్రమాదంలో పడ్డాయి' అని కూడా రాశాడు. ఉదాహరణకు లెవాయిజియర్ చెప్పిన ద్రవ్య నిత్యత్వ సూత్రం ఎలక్ట్రాన్ సిద్ధాంతం వల్ల బలహీనపడింది. ఈ సిద్ధాంతం ప్రకారం పరమాణువుల్లో అతి సూక్ష్మ మైన ఎలక్ట్రాన్లు ఉంటాయి. వీటిలో పాజిటివ్ విద్యుత్తు, నెగెటివ్ విద్యుత్తు ఉంటాయి. ఇవి 'ఈదర్ అనే మాధ్యమంలో మునిగి ఉంటాయి' . భౌతిక శాస్త్రవేత్తలు చేసిన పరిశోధనలలో ఎలక్ట్రాన్ల వేగోధృతిని వాటి ద్రవ్య రాశిని ( వాటి ద్రవ్యరాశికి, వాటి విద్యుత్తు ఛార్జ్‌కి మధ్య ఉన్న సంబంధాన్ని) లెక్కవేయడానికి కావాల్సిన సమాచారం ఉంది. కాంతి వేగంతో ఎలక్ట్రాన్ల వేగం పోల్చడానికి వీలుగా ఉంది. (కాంతి వేగం సెకనుకి లక్షా ఎనభై ఆరు వేల మైళ్లు ) ఎలక్ట్రాన్ వేగం కాంతి వేగంలో మూడో వంతు ఉంటుందని అంచనా వేశారు ఇటువంటి పరిస్థితుల్లో మొదటిది ఎలక్ట్రాన్ స్వయంగా తన జడత్వాన్ని అధిగమించడానికి రెండోది ఈదర్ జడత్వాన్ని అధిగమించడానికి రెండింతల ఎలక్ట్రాన్ ద్రవ్యరాశిని పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. ఎలక్ట్రాన్ ద్రవ్యరాశి యాంత్రిక ద్రవ్యరాశి. 'రెండో తరహా ద్రవ్యరాశి ఎలక్ట్రో డైనమిక్ ద్రవ్యరాశి. ఇది ఈదర్ జడత్వానికి ప్రతినిధి'. మొదటి తరహా ద్రవ్యరాశి సున్నా అని తెలిసింది. ఎలక్ట్రాన్ల మొత్తం ద్రవ్యరాశి లేదా కనీసం

నెగెటివ్ ఎలక్ట్రాన్ల ద్రవ్యరాశి మొత్తంగా మినహాయింపు లేకుండా పుట్టుకతో ఎలక్ట్రో డైనమిక్ అని రుజువైంది. ద్రవ్యరాశి మాయమవుతుంది. యాంత్రిక శాస్త్ర పునాదులు బలహీనపడ్డాయి. చర్య, ప్రతి చర్యలు సమానం అన్న న్యూటన్ సూత్రం బలహీనపడింది. ఇలాంటి నిర్ధారణలకు వారు వచ్చారు. పాత భౌతిక శాస్త్ర సూత్రాల 'శిధిలాలను' మనం చూస్తున్నాం అంటాడు పాయిన్ కేర్. ఇది 'సూత్రాల ఓటమి' అంటాడు. సూత్రాల నుంచి వైదొలగిన ఈ అంశాలన్నీ అతి సూక్ష్మ పరిమాణంలో ఉన్నాయి అన్న మాట నిజమే పాత సూత్రాలను బలహీనపరిచే ఈ పరిస్థితికి వ్యతిరేకంగా పనిచేసే మరికొన్ని సూక్ష్మ అంశాలు ఉంటే ఉండొచ్చు, కాని అవి ఇప్పటికి మనకు తెలియవు అంటాడాయన. అయితే మనం సందేహ కాలం'లో ఉన్నామని ఆయన అంటాడు. ఈ 'సందేహ కాలం' నుంచి ఆయన ఎటువంటి జ్ఞాన సిద్ధాంత నిర్ధారణలకు వచ్చాడో మనం గమనించవచ్చు. 'స్థల కాలాల భావనలను మనపై రుద్దుతున్నది (లేదా ఆదేశిస్తున్నది) ప్రకృతి కాదు. ప్రకృతి పైనే మనం వాటిని రుద్దుతున్నాం' 'ఆలోచన కానిదేదైనా శుద్ధ శూన్యం మాత్రమే' . ఇవన్నీ భావవాద నిర్ధారణలే. అత్యంత మౌలిక సూత్రాలను ( పాయిన్ కేర్ ఆలోచనా ధోరణి కూడా అటువంటిదే) విడగొట్టి చూస్తే ఈ సూత్రాలు ప్రకృతికి కాపీలుకానీ, ఫోటోగ్రాఫ్‌లుకానీ మనిషి చైతన్యంతో సంబంధం ఉన్న ఏదోఒక బాహ్య వస్తువు ప్రతిబింబాలుకానీ కాదని తెలుస్తుంది అవి అతని చైతన్యపు ఉత్పాదితాలని తెలుస్తుంది అంటాడు పాయిన్ కేర్. అయితే ఈ నిర్ధారణలను పాయిన్ కేర్ నికరంగా అభివృద్ధి చేయలేదు. పైగా ఈ ప్రశ్నకు సంబంధించిన తాత్విక అంశం యెడల అతనికి ప్రత్యేక శ్రద్ధ లేదు....

## 2. పదార్థం మాయమైంది

ఆధునిక భౌతిక శాస్త్రంలో ఇటీవలి ఆవిష్కరణలు ఇచ్చిన వివరణలలో వ్యక్తమైన భావాలు అక్షరాలా ఇవే. ఉదాహరణకు, లా ఇవల్యూషన్ డెస్ సైన్సెస్ అనే తన గ్రంథంలో ఎల్ హౌల్లె విగ్ ఈ కొత్త పదార్థాల సిద్ధాంతాల గురించి రాసిన అధ్యాయానికి 'పదార్థం ఉందా ?' అనే శీర్షిక పెట్టాడు. 'పరమాణువు పదార్థేతరం అవుతుంది. పదార్థం మాయమవుతుంది' అంటాడాయన. దీని నుంచి మాక్ వాదులు ఎంత తేలికగా మౌలిక తాత్విక నిర్ధారణలకు వస్తారో చూడాలంటే మనం వాలెంటినోవ్‌ను ఉదాహరణగా తీసుకోవచ్చు. ఆయన ఇలా అంటాడు : 'ప్రపంచం గురించిన శాస్త్రీయ వివరణ స్థిరమైన పునాదిని భౌతికవాదంలో మాత్రమే చూడగలమన్న ప్రకటన కల్పన తప్ప మరేమీ కాదు. పైగా అది అసంబద్ధపు కల్పన మాత్రమే'. ఈ ప్రకటనను అంతం చేయడానికి ఆయన ఆగస్టో రిఘి అనే ఇటలీకి చెందిన భౌతిక శాస్త్రవేత్తను ఉల్లేఖించాడు. 'ఎలక్ట్రాన్ సిద్ధాంతం అన్నది విద్యుత్తు సిద్ధాంతం కంటే కూడా పదార్థ సిద్ధాంతం అని చెప్పవచ్చు కొత్త సైద్ధాంతిక

వ్యవస్థ, పదార్థం స్థానంలో విద్యుత్తును ఉంచుతుంది' అని రిఘి అన్నాడు ఈ మాటలను ఉల్లేఖించిన వాలెంటినోవ్ ఇలా ఆశ్చర్యం వ్యక్తం చేశాడు. 'పవిత్రమైన పదార్ధానికి వ్యతిరేకంగా ఇటువంటి పాపాన్ని చేయడానికి రిఘి ఎందుకు తలపడ్డాడు. బహుశా అతడు స్వీయవాదో, భావవాదో లేదా ఒక బూర్జువా విమర్శకుడో, ఒక అనుభవగత ఏకతావాదో లేదా వీటన్నిటికంటే హీనమైన మరేదో అయి ఉండాలి !'

ఈ వ్యంగ్యాస్త్రంతో భౌతికవాదులను అంతం చేయగలనని వాలెంటినోవ్ భావించాడనిపిస్తుంది. ఇది తాత్విక భౌతికవాదం అనే విషయంలో అతనికున్న శుద్ధ అమాయకత్వాన్ని తెలియజేస్తుంది. తాత్విక భావవాదానికి 'పదార్థం మాయం కావడానికి' మధ్య ఉన్న వాస్తవ సంబంధాన్ని గురించిన సందేహమేదీ వాలెంటినోవ్‌కు లేదు. ఆధునిక భౌతికవాదులను అనుసరిస్తూ 'పదార్థం మాయమవడం' గురించి ఆయన మాట్లాడే దానికీ భౌతికవాద భావవాదాల మధ్య ఉన్న జ్ఞాన సిద్ధాంతపరమైన భేదానికీ ఎటువంటి పొంతనా లేదు.

మన జ్ఞాన మూలానికి సంబంధించిన ప్రశ్నలకూ అలాగే భౌతిక ప్రపంచానికీ మన జ్ఞానానికీ ( స్థూలంగా 'మానసికపరమైన' వాటికీ) ఉన్న సంబంధాన్ని గురించిన ప్రశ్నలకూ భౌతికవాదమూ భావవాదమూ ఇచ్చే సమాధానాలు వేర్వేరు. కాగా పదార్థం పొందికకు సంబంధించిన ప్రశ్న పరమాణువులకూ, ఎలక్ట్రాన్లకూ సంబంధించిన ప్రశ్న ఈ 'భౌతిక ప్రపంచానికి' సంబంధించిన ప్రశ్న భౌతిక శాస్త్రవేత్తలు 'పదార్థం మాయమవుతుంది' అంటున్నారంటే దానర్థం ఇంతకుముందు శాస్త్రం భౌతిక ప్రపంచాన్ని గురించిన దాని పరిశోధనలను పదార్థం, విద్యుత్తు, ఈదర్ అనే మూడు అంతిమ ప్రావనలకు కుదించిందని అర్థం. కాగా పదార్థాన్ని విద్యుత్తుగా కుదించడం సాధ్యమైంది కాబట్టి ఇప్పుడు చివరి రెండు మాత్రమే మిగిలాయి. పరమాణువుని ఒక అనంతమైన చిన్న సూర్య కుటుంబంతో పోలి ఉందని చెప్పవచ్చు. దానిలో నెగెటివ్ ఎలక్ట్రాన్లు, పాజిటివ్ ఎలక్ట్రాన్ చుట్టూ ఒక నిర్దిష్ట ( మనం ఇంతకుముందే చూసినట్టుగా చాలా ఎక్కువ ) వేగోధృతితో తిరుగుతున్నాయని వివరించవచ్చు దాని పర్యవసానంగా మొత్తం భౌతిక ప్రపంచాన్ని డజన్ల కొద్దీ ఉన్న మూలకాల నుంచి రెండు మూడు మూలకాలకు కుదించవచ్చు. ( భౌతిక శాస్త్రవేత్త పెల్లట్ పాజిటివ్ ఎలక్ట్రాన్లు, నెగెటివ్ ఎలక్ట్రాన్లు రెండు విభిన్న రకాల పదార్థాన్ని కలిగి ఉంటాయని చెప్పాడు.) కనుక ప్రకృతి శాస్త్రం 'పదార్థ ఐక్యతకు' దారితీస్తోందన్న మాట. పదార్థం అదృశ్యం అవుతోందని, దాని స్థానంలోకి విద్యుత్తు వస్తోందని అన్న ప్రకటన వాస్తవ అర్థం ఇదే. ఈ ప్రకటనే చాలామందిని దారితప్పిస్తోంది. పదార్థం మాయమవుతోంది అంటే అర్థం మనం ఇంతకుముందు పదార్థం గురించి

మనకున్న జ్ఞాన పరిమితి మాయమవుతుంది అని అర్థం. మన జ్ఞానం మరింత లోతుగా చొచ్చుకుపోతోందని అర్థం. ఇంతకుముందు సంపూర్ణమని, స్థిరమని, ప్రాథమికమని (అభేద్యం, జడత్వం, ద్రవ్యరాశి వగైరాలు) భావించిన పదార్థ ధర్మాలు మాయమవుతున్నాయని అర్థం. అవి కేవలం సాపేక్షమని, కొన్ని స్థితుల్లో మాత్రమే పదార్థానికున్న లక్షణాలని ఇప్పుడు తెలిసింది. తాత్విక భౌతికవాదానికి సంబంధించినంతవరకూ పదార్థానికి సంబంధించిన ఒకే ఒక ధర్మం ఉంది. అదేమంటే మస్తిష్కానికి ఆవల, ఒక భౌతిక వాస్తవికతగా ఉండడమే.

మాక్ వాద నయా భౌతిక శాస్త్రంలాగానే స్థూలంగా మాక్ వాదపు పొరపాటు ఏమంటే తాత్విక భౌతికవాదానికి ఉన్న ఈ పునాదినీ అధిభౌతిక భౌతికవాదానికి, గతి తార్కిక భౌతికవాదానికి మధ్య ఉన్న భేదాన్ని అది నిర్లక్ష్యం చేస్తుంది. 'స్థిరమైన పదార్థపు' స్థిరమైన మూలకాలు వగైరాలను గుర్తించేది భౌతికవాదం కాదు అధిభౌతిక, గతితర్క వ్యతిరేక భౌతికవాదం మాత్రమే. అందుకే 'సైన్స్‌కు సంబంధించిన అధ్యయన అంశం అనంతం' అని డీజెన్ నొక్కి చెప్పాడు. కేవలం అనంత విశ్వమే కాదు 'అతి సూక్ష్మమైన పరమాణువు' సైతం చివరి వరకూ కొలవడానికి, తెలుసుకోవడానికి, సంపూర్ణంగా గ్రహించడానికి సాధ్యపడనిదే. ఎందుకంటే ప్రకృతికి దాని భాగాలన్నింటిలోనూ తుది మొదలు అన్నవి లేవు అని ఆయన నొక్కి చెప్పాడు. అందుకే బొగ్గు తారులో అలిజారిన్ ఆవిష్కరణని ఏంగెల్స్ ఉదాహరణగా చూపించి యాంత్రిక భౌతికవాదాన్ని విమర్శించాడు. ప్రశ్నను సరైన పద్ధతిలో అనగా గతితార్కిక పద్ధతిలో ప్రదర్శించడం కోసం మనం ఇలా అడగాలి. ఎలక్ట్రాన్లు, ఈదర్ వగైరాలు మానవ మస్తిష్కానికి ఆవల భౌతిక వాస్తవాలుగా అస్తిత్వంలో ఉన్నాయా? లేదా ? ఈ ప్రశ్నకు శాస్త్రవేత్తలు నిస్సంకోచంగా చెప్పాల్సి ఉంటుంది. ప్రకృతి అన్నది మనిషి పుట్టడానికి ముందే ఉందని సేంద్రియ పదార్థం ఏర్పడడానికి ముందే ఉందని వారు నిస్సంకోచంగా గుర్తించినట్టే ఈ ప్రశ్నకు కూడా తప్పనిసరిగా వారు అవుననే సమాధానం చెబుతారు. ఈ రకంగా ఈ ప్రశ్నకు సమాధానం భౌతికవాదానికి అనుకూలంగా మారింది. ఎందుకంటే ఇంతకుముందు ప్రకటించినట్టుగానే పదార్థం అంటే మరేదో కాదు . జ్ఞాన సిద్ధాంతం ప్రకారం మానవ మస్తిష్కంతో ప్రమేయం లేకుండా, దానితో ప్రతిబింబించబడే భౌతిక వాస్తవికతే పదార్థం.

పదార్థం పొందిక గురించి, దాని ధర్మాల గురించి తెలియజేసే ప్రతి సిద్ధాంతమూ సుమారుగానూ, సాపేక్షంగానూ మాత్రమే ఉంటుందని గతితార్కిక భౌతికవాదం నొక్కి చెబుతుంది. ప్రకృతిలో సంపూర్ణమైన సరిహద్దులేవీ ఉండవు. వేర్వేరు స్థితులు ఏ[illegible] రాజీలేనివిగా పైకి కనిపించినప్పటికీ చలనశీల పదార్థం ఒక స్థితి నుంచి మరో స్థితికి



A.C. No. 392

పరివర్తన చెందుతుంది. అనూహ్యమైన ఈదర్, ఒక ఊహించవీలైన పదార్థమూ ఒకటి మరో దానిగా పరివర్తన చెందడం 'వ్యవహార జ్ఞానం' దృష్ట్యా ఎంత వింతగా ఉన్నప్పటికీ అది జరుగుతుంది. ఎలక్ట్రాన్లో విద్యుత్ అయస్కాంత ద్రవ్యరాశి తప్ప మరే రకమైన ద్రవ్యరాశి ఉండదనడం ఎంత వింతగా కనిపించినప్పటికీ అది వాస్తవం. యాంత్రిక చలన నియమాలు భౌతిక పరిణామాలకు చెందిన ఒకే రంగానికి పరిమితమై ఉంటుందనీ, యాంత్రిక నియమాలు మరింత పరిపుష్టమైన విద్యుత్ అయస్కాంత పరిణామాలకు లోబడి ఉంటాయనీ అనడం ఎంత అసాధారణంగా కనిపించినప్పటికీ అది వాస్తవం. ఈ అంశాలనే గతితార్కిక భౌతికవాదం చెబుతుంది. ఇవన్నీ గతితార్కిక భౌతికవాదానికి మరో రుజువు మాత్రమే. భౌతిక వేత్తలకు ప్రధానంగా గతితర్కం తెలియకపోయినందునే ఈ కొత్త భౌతిక శాస్త్రం భావవాదానికి దారి మళ్లింది. ఏంగెల్స్ అధిభౌతికవాదం అన్న పదాన్ని ఉపయోగించిన అర్థంలోగాక దాన్ని రూఢివాద అనగా హ్యూమ్వాద అర్థంలో భౌతిక శాస్త్రవేత్తలు దానిపైనా, దాని ఏకపార్శ్వ యాంత్రికతపైనా పోరాడారు. ఆ రకంగా వారు పురిటి నీళ్ళతో పాటు బిడ్డను కూడా బయటపడేస్తున్నారు. మూలకాల చలనరాహిత్యాన్ని, ఇంతవరకూ తెలిసిన పదార్థ ధర్మాలనూ తిరస్కరించడంతో ప్రారంభించి వారు పదార్థాన్నే తిరస్కరిస్తున్నారు. అనగా భౌతిక ప్రపంచపు వస్తుగత వాస్తవాన్ని వారు తిరస్కరిస్తున్నారు. కొన్ని అత్యంత ప్రధానమైన పునాది నియమాల సంపూర్ణ స్వభావాన్ని తిరస్కరించడంతో ప్రారంభించి ప్రకృతిలోని సకల వస్తుగత నియమాలను తిరస్కరించడానికి పూనుకున్నారు. ఒక ప్రకృతి నియమం అన్నది కేవలం ఒక ఆనవాయితీ అనో 'ముందుగా ఊహించిన ఊహల పరిమితి'గానో, 'ఒక తార్కిక అవసరంగానో లేదా మరోదాని లాగానో' వారు తేల్చివేస్తున్నారు. మన జ్ఞాన స్వభావం కేవలం సుమారుగానూ, సాపేక్షంగానూ ఉంటుందని నొక్కి చెబుతూనే మస్తిష్కంతో ప్రమేయం లేకుండా ఉండి సుమారు ఖచ్చితత్వంతోనూ సాపేక్ష వాస్తవికతతోనూ మస్తిష్కం చేత ప్రతిబింబించబడే వస్తువుని వారు తిరస్కరిస్తున్నారు. ఇలాంటి అవగాహననే వారు అనంతంగా కొనసాగిస్తున్నారు.

"వస్తువుల చలనరహిత సారాంశం" గురించి 1899 లో బొగ్దనోవ్ వ్యక్తం చేసిన అభిప్రాయాలు, 'పదార్థాంశం' గురించి వాలెంటినోవ్, యుష్కేవిచ్‌ల అభిప్రాయాలు ఒక లాంటివే. గతితర్కం తెలియకపోవడం వల్ల ఎదురయ్యే ఫలితాలే ఇవి. మానవ మస్తిష్కం ( మానవ మస్తిష్కం అంటూ ఉంటే) తనతో ప్రమేయం లేకుండా ఆవల స్వతంత్రంగా ఉండే బాహ్య ప్రపంచాన్ని ప్రతిబింబిస్తుంది అన్నది ఒక్కటే మారని అంశం అని ఏంగెల్స్ పేర్కొన్నాడు. ఇక పసలేని ప్రొఫెసర్ తరహా తత్వశాస్త్రం చిత్రిస్తున్న అర్థంలో ఏ 'పరివర్తనా రాహిత్యమూ', ఏ 'సారాంశమూ', ఇంకా ఏ 'నిరపేక్ష పదార్థ అంశమూ'

మార్క్స్, ఏంగెల్స్‌ల దృష్టిలో లేనేలేవు. వస్తువుల 'సారమూ, లేదా 'పదార్థ అంశమూ' అంతా సాపేక్షమే. వస్తువుల గురించిన మానవ జ్ఞానానికున్న పరిపుష్టతా స్థాయిని మాత్రమే అది తెలియజేస్తుంది. నిన్న జ్ఞాన పరిపుష్టత పరమాణువుని దాటిపోలేదు. ఈ రోజు అది ఈదర్, ఎలక్ట్రాన్లను దాటిపోలేదు. పురోగమిస్తున్న మానవ శాస్త్రం గ్రహించిన ప్రకృతి జ్ఞానంలో ఇవన్నీ మైలురాళ్లు. ఇవి తాత్కాలికంగానూ, దాదాపుగానూ, సాపేక్షంగానూ ఉంటాయన్నదే గతితార్కిక భౌతికవాదం నొక్కి చెబుతుంది. ఎలక్ట్రాన్ అన్నది పరమాణువు లాగానే అనంతం. ప్రకృతి అనంతం. అయితే అది అనంతంగా 'ఉంటుంది'. మానవ మస్తిష్కానికి, ఇంద్రియ గ్రాహ్యతకు ఆవల ప్రకృతి ఉంటుందన్న బేషరతు గుర్తింపే గతితార్కిక భౌతికవాదాన్ని సాపేక్ష అజ్ఞేయ వాదాన్నుంచి, భావవాదం నుంచి వేరు చేస్తుంది.

## 3 పదార్థం లేని చలనాన్ని ఊహించగలమా ?

తాత్విక భావవాదం కొత్త భౌతిక శాస్త్రాన్ని ఉపయోగించుకోవడానికి ప్రయత్నిస్తుంది. దాని నుంచి భావవాద నిర్ధారణలను ·చేయడానికి ప్రయత్నిస్తుంది. ఇది కొత్త రకాల పదార్థాలను, శక్తిని, పదార్థాన్ని, దాని చలనాన్ని కనుగొనడం వల్ల కాదు. పదార్థం లేకుండా చలనాన్ని ఊహించడానికి చేస్తున్న ప్రయత్నాల నుంచి మాత్రమే ఇది తలెత్తింది. మన మాక్ వాదులు పరిశీలించడంలో విఫలమయింది, ఈ ప్రయత్నాల సారాన్నే . 'పదార్థరహిత చలనాన్ని ఊహించడం సాధ్యంకాదని' ఏంగెల్స్ చేసిన ప్రకటనను వారు స్వీకరించడానికి సిద్ధంగా లేరు. 1869 లో 'మానవ మస్తిష్కస్వభావం' అన్న తన గ్రంథంలో జె.డీజెన్ ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశాడు. అయితే భౌతికవాదాన్ని భావవాదాన్ని రాజీ చేసే ప్రయత్నాలను తన సొంత గందరగోళపు పద్ధతిలో ఆయన చేశాడు, నిజమే. అక్కడ గతితర్కేతర బూక్నర్ భౌతికవాదంతో వాదిస్తూ ఉండడం వల్ల చాలావరకూ ఇటువంటి ధోరణులకు డీజెన్ లోనయ్యాడు. కనుక వాటిని పక్కనపెడదాం. ఈ అంశం విషయంలో డీజెన్ సొంత ప్రకటనలను పరిశీలిద్దాం. ఆయన ఇలా అన్నాడు: "వారు (భావవాదులు) ప్రత్యేకమైనది ఏదీ లేకుండా సాధారణమైనది కావాలనుకుంటున్నారు. పదార్థం లేకుండా మస్తిష్కం కావాలనుకుంటున్నారు. పదార్థాంశం లేకుండా శక్తి కావాలనుకుంటున్నారు. అనుభవమూ, సామాగ్రి లేకుండా సైన్స్ కావాలనుకుంటున్నారు. సాపేక్షం లేని నిరపేక్షతను వారు కోరుకుంటారు". ఆ రకంగా పదార్థం నుంచి చలనాన్ని, పదార్థాంశం నుంచి శక్తిని వేరు చేసే ప్రయత్నాన్ని డీజెన్ భావవాదానికి ఆపాదించాడు. ఈ ప్రయత్నాన్ని మస్తిష్కం నుంచి ఆలోచనను వేరు చేసే ప్రయత్నంతో ఆయన ఇలా పోల్చాడు:

"లీబిగ్ తన సాదృశ్య శాస్త్రం నుంచి కల్పనా రంగానికి జారిపోతూ ఉంటాడు.

ఆయన భావవాద స్ఫూర్తితోనే ఇలా అంటాడు: 'శక్తిని మనం చూడలేం....' ఆత్మవాది లేదా భావవాది ఒక ప్రేతంలాంటి అనూహ్యమైన అభౌతిక శక్తి స్వభావాన్ని నమ్ముతాడు.... శక్తికీ, పదార్థానికీ ఉన్న వైరుధ్యం భావవాదానికి భౌతికవాదానికి ఉన్న వైరుధ్యమంత ప్రాచీనం ... అయితే పదార్థంలేని శక్తి లేదు. శక్తిలేని పదార్థమూ ఉండదు. శక్తి రహిత పదార్థమూ పదార్థరహిత శక్తి అన్నవి అసంబద్ధాలు. శక్తుల అభౌతిక అస్థిత్వాన్ని నమ్మే భావవాద ప్రకృతి శాస్త్రవేత్తలు ఎవరైనా ఉంటే... వారీ విషయంలో ప్రకృతి శాస్త్రవేత్తలు కానేకారు.... భూత ప్రేతాల రుషులు మాత్రమే".

కనుక నలభై యేళ్ల క్రితం కూడా పదార్థ రహిత చలనాన్ని ఆమోదించే శాస్త్రజ్ఞులు ఉన్నారని మనకు అర్థమవుతుంది. ఈ విషయంలో వారిని డీజెన్ భూత ప్రేతాల రుషులని ప్రకటించాడు. పదార్థం నుంచి చలనాన్ని వేరు చేయడానికి పదార్థాంశం నుంచి శక్తిని వేరు చేయడానికి భావవాదానికి మధ్య ఉన్న సంబంధం ఏమిటి ? పదార్థ రహిత చలనాన్ని ఊహించడం నిజానికి 'చాలా పొదుపైన వ్యవహారం' కాదా ?

మొత్తం ప్రపంచాన్ని తన ఇంద్రియానుభూతిగానూ , తన భావమూ తదితరాలుగానూ భావించే ఒక ఖచ్చితమైన భావవాదిని ఊహిద్దాం. ( మనం ఎవరికీ చెందని ఇంద్రియానుభూతిని, భావాన్ని కూడా తీసుకోవచ్చు. దీనివల్ల ఒక తరహా తాత్విక భావవాదం పోయి మరో తరహా తాత్విక భావవాదం వస్తుంది. సారాంశంలో మాత్రం మార్పేమీ ఉండదు) ప్రపంచాన్ని చలనమనీ, తన ఆలోచనల భావాల ఇంద్రియానుభూతుల చలనమనీ అనడానికి ఈ భావవాది నిరాకరించడు. కదిలించేది ఏది అన్న ప్రశ్నని మాత్రం అతడు అసంబద్ధమని పరిగణించి తిరస్కరిస్తాడు. నా ఇంద్రియానుభూతులలోని మార్పు తప్ప మరేమీ జరగడం లేదు. నా భావాలు వస్తాయి పోతాయి. అంతకుమించి ఏమీ లేదు నాకు బాహ్యంగా ఏమీ లేదు. 'అది చలిస్తుంది, అంతే. ఇంతకుమించిన 'పొదుపైన' ఆలోచనా విధానాన్ని ఊహించడమే కష్టం. స్వీయవాది కనుక తన దృక్పథానికి నిక్కచ్చిగా కట్టుబడి ఉంటే ఏ రుజువులూ ఏ సూత్రీకరణలూ ఏ నిర్వచనాలూ అతన్ని తప్పు అని రుజువు చేయలేవు.

ఇంద్రియానుభూతి, గ్రహణ శక్తి, భావమూ, మానవుని మనసు భౌతిక వాస్తవికతను ప్రతిబింబిస్తుంది అన్న వాస్తవ విషయంలోనే భౌతిక వాదికి, భావవాదికి మౌలికమైన భేదం ఉంది. ఈ భౌతిక వాస్తవికత చలనమే ప్రపంచం. దానిని మన చైతన్యం ప్రతిబింబిస్తుంది. నాకు అవల ఉన్న చలనానికి నా భావాల, ఇంద్రియ గ్రాహ్యాల చలనం అనుగుణంగా ఉంటుంది. పదార్థం అన్న భావన భౌతిక వాస్తవికతను తప్ప మరి దేన్నీ వ్యక్తం చేయదు. అది మనకు మన ఇంద్రియానుభూతుల ద్వారా గ్రహించబడుతుంది. కనుక పదార్థం నుంచి చలనాన్ని వేరు చేయడమంటే భౌతిక వాస్తవికత నుంచి ఆలోచనను

వేరు చేయడమే లేదా బాహ్య ప్రపంచం నుంచి నా ఇంద్రియానుభూతులను వేరు చేయడమే. ఒక్క మాటలో చెప్పాలంటే ఇది భావవాదానికి పాల్పడడమే. పదార్థ రహిత చలనాన్ని ఊహించడంలోనూ పదార్థ అస్తిత్వాన్ని తిరస్కరించడంలోనూ చేసే సాధారణ గారడీ ఏమంటే పదార్థానికి, ఆలోచనకూ ఉన్న సంబంధాన్ని నిర్లక్ష్యం చేయడమే. అటువంటి సంబంధం ఏదీ లేనట్టుగానే ఈ ప్రశ్నను ప్రదర్శిస్తూనే వాస్తవంలో దానిని రహస్యంగా ప్రవేశపెట్టడం జరుగుతుంది. వాదనకు ముందు అది వ్యక్తం కాదు. తర్వాత కనీకనిపించకుండా ప్రవేశించి తలెత్తుతుంది.

పదార్థం మాయమైపోయిందని మనకు వారు చెబుతున్నారు. దాని నుంచి జ్ఞాన సిద్ధాంత నిర్ధారణలను చేయాలనుకుంటున్నారు. అయితే ఆలోచన మిగిలే ఉందా అని మేము అడుగుతున్నాం. పదార్థం మాయమవడంతో పాటు ఆలోచన కూడా మాయమై ఉంటే మస్తిష్కమూ, నరాల వ్యవస్థ మాయమవడంతో పాటు భావాలు, ఇంద్రియానుభూతులు కూడా మాయమై ఉంటే, దాని అర్థం ప్రతిదీ మాయమైపోయినట్టే. ఆలోచనకు (లేదా అనాలోచనకు) 'నమూనా' అయిన మీ వాదన కూడా మాయమైపోయినట్టే. లేదా అది మిగిలే ఉంటే అంటే పదార్థం మాయమవడంతో పాటు ఆలోచన ( భావం, ఇంద్రియానుభూతి తదితరాలు) మాయం కాలేదనుకుంటే మీరు రహస్యంగా తాత్విక భావవాద దృక్పథాన్ని స్వీకరించినట్టే. 'పొదుపు కోసం' పదార్థ రహిత చలనాన్ని ఊహించే వారందరికీ ఎప్పుడూ జరిగేది ఇదే. ఎందుకంటే పదార్థం మాయమైపోయిన తర్వాత ఇంకా ఆలోచన మిగిలే ఉంటుందన్న వాదాన్ని వారు మౌనంగా కొనసాగిస్తున్నారు మరి. అంటే దీని అర్థం వారు అతి సాదా లేదా అతి సంకీర్ణ తాత్విక భౌతికవాదాన్ని ప్రాతిపదికగా తీసుకున్నారు. అవి నిర్మొహమాటమైన స్వీయవాదం (నేను ఉన్నాను కనుక ప్రపంచం నా ఇంద్రియానుభూతి మాత్రమే అన్న వాదం) అయితే అది అతి సాదా భావవాదం అని చెప్పవచ్చు. ఒక సజీవ వ్యక్తి ఆలోచన, భావం లేదా ఇంద్రియానుభూతికి బదులుగా ఒక నైరూప్య భావాన్ని ఆధారం చేసుకుంటే అది సంకీర్ణ భావవాదం అవుతుంది. అప్పుడు అది ఎవరి ఆలోచనా కాదు. ఎవరి భావమూ కాదు. ఎవరి ఇంద్రియానుభూతీ కాదు. కేవలం అది ఒక సామాన్య ఆలోచన. ( ఒక నిరపేక్ష భావం, ఒక సార్వత్రిక అభీష్టం వగైరా ) ఇంద్రియానుభూతి అనేది ఒక అనిర్దిష్ట మూలకం. మొత్తం భౌతిక స్వభావానికి బదులు 'మానసికమైనదాన్ని' నిలబెడతారు. తాత్విక భావవాదానికి వేలాది ఛాయలు ఉండొచ్చు. మళ్లీ వేయిన్నొకటో ఛాయను సృష్టించడం సాధ్యమే. ఈ వేయిన్నొకటో చిల్లర వ్యవస్థ (ఉదాహరణకు అనుభవగత ఏకతా వాదం) మిగతా ఛాయల నుంచి భిన్నంగా కనిపించడం తాత్కాలికం మాత్రమే. భౌతికవాదుల దృష్టి నుంచి చూస్తే ఈ తేడాలన్నీ

అప్రధానం. వాటి ప్రారంభ స్థానమే ప్రధానం. పదార్థ రహిత చలనాన్ని ఊహించడానికి చేసే ప్రయత్నాన్ని పదార్థం నుంచి వేరైన ఆలోచనలో దొంగచాటుగా జొరబెట్టడమే ఇక్కడ ప్రధానం. అదే తాత్విక భావవాదం.

-లెనిన్, భౌతికవాదమూ, అనుభవగత విమర్శనమూ

AC No. 393

18వ శతాబ్దపు ఫ్రెంచి తత్వవేత్తలు అభివృద్ధి చేసిన అత్యుత్తమ తాత్విక విజయాలను సోషలిస్టు ఉద్యమం స్వీకరించింది. అందులో భౌతికవాదం ప్రధానం. అలాగే జర్మన్‌తత్వవేత్త హెగెల్ రూపొందించిన గతితర్కాన్ని కూడా స్వీకరించింది. మార్క్సిస్టు తత్వశాస్త్రం గత చరిత్ర నుంచి ఉద్భవించింది. భవిష్యత్ చరిత్రను ఊహిస్తుంది. సృష్టిస్తుంది.

ప్రజాశక్తి బుక్‌హౌస్